# శ్రీ బూర్లె రంగన్న బాబుగారి దివ్య చరిత్ర

Photo

రచన : K. రామ క్రిష్ణారావు

ప్రతులు : 5,000

సర్వస్వామ్యములు : శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్ట్ వారివి

వెల:

కాపీల కొరకు : శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (P.O.)
నెల్లూరు జిల్లా - 524321

## ముందుమాట

శ్రీ రంగన్నబాబుగారి లాంటి మహాభక్తుని జీవిత సన్నివేశములు కాగితం మీద పెట్టడం నాకు సాధ్యమయ్యే పనికాదు. శ్రీ దేవులపల్లి క్రిష్ణమూర్తి గారి దివ్యానుభవాలు నా చెంతకు చేరడంలో శ్రీ మాష్టరుగారి అదృశ్యహస్తమే కారణము. కనుక వారి దివ్యప్రేరణతో నాకు తోచినది వ్రాశాను. శ్రీ బాబుగారి జీవిత విధానాన్ని చూచి మనం కొంతైనా నేర్చుకొని ఆచరించి తరిద్దాము. చివరిదాకా భార్యాబిడ్డలను వదలలేదు. అట్లని ఆశపడి సిరిసంపదలు ప్రోగుచేసుకోలేదు. నీళ్ళకావడి మోసే కాయకష్టంగాక వడ్డీ వ్యాపారంకూడా చేశారు. కానీ లౌకికుల వడ్డీ వ్యాపారం లాంటిదికాదు. ప్రాంసరి నోటు లేకుండా అప్పివ్వడమేమిటి? డబ్బు, బంగారం జోలికేపోరు. పిచ్చుకలకు నీళ్ళుపోయడం, ఫ్యాక్టరీ మూసినందున బీదలకు పనిపోతే ఫ్యాక్టరీ పనిచేసి అందరికీ పని ఇచ్చేంతవరకు ఒక్కపూటే అన్నంతింటానని శ్రీ రామచంద్రునికి చెప్పుకొని అలా కఠినంగా ఫ్యాక్టరీ తీసినంతవరకూ ఒక్కపూటే భోంచేశారు. వారి నమ్రత, నిరాడంబరత, సాటిజీవుల ఎడల ప్రేమ, శరీరాన్ని సుఖపెట్టాలనే ధ్యాసే లేకుండడం, భగవంతుని మన ఆచరణతో మెప్పించాలిగాని లోకాన్ని కాదు మెప్పించవలసినది అనే వారి పవిత్ర భావము, అంతటా ఉండే భగవంతుని అనుక్షణమూ గుర్తించుచుండడంలాంటి కొన్ని విషయాలు గుర్తించి ఆచరించేటట్లు చేయమని శ్రీ బాబుగారిని హృదయపూర్వకంగా ప్రార్థించుచున్నాను.

పెసల సుబ్బరామయ్య

## శ్రీ రంగన్నబాబు గారి బాల్యము

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణవాసులు బూరెల పుల్లయ్య, జాలమ్మ అను పుణ్యదంపతులకు నాల్గవ సంతానంగా 1895 వ సంవత్సరములో మన రంగన్నబాబుగారు జన్మించారు. ఆరు సంవత్సరముల వయసులో తల్లి స్వర్గస్తురాలైంది. చాలా బీదకుటుంబము. తండ్రి గోతాలు కుట్టే మిల్లులో పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. అందరు పిల్లలలాగా తినుబండారాల మీద, గుడ్డలమీద ధ్యాసే ఉండేది కాదు. ఆటకాయతనంగా తిరుగుతుండేవారు. ఊళ్ళు చూపిస్తానంటే వీళ్ళ సోదరి వివాహనిమిత్తం దాచి ఉంచిన ఏడువందల రూపాయలు తీసుకొని ఒక సాధువుతోపాటు వెళ్ళిపోయాడు. రంగూన్, బర్మా, కలకత్తా మొదలగు నగరాలేకాక పవిత్ర నదులు పుణ్యక్షేత్రాలు త్రిప్పి ఒక్క సంవత్సరం తరువాత తిరిగి ఏలూరులో వదలి వెళ్ళాడా సాధువు. బిడ్డకొరకు వెతికి వెతికి వేసారిన తండ్రి పరమానంద భరితులైనారు. ఏ అంగడిలోనన్నా గుమస్తాగా చేర్చాలంటే బాబుగారికి చదువురాదు. వయసు పదిహేను సంవత్సరాలు. కనుక తాను పనిచేసే గోతాలమిల్లులో నీళ్ళకావడి మోసే ఉద్యోగమిప్పించారు. భవిష్యత్తులో అందరి బాధలు మోసే మహనీయునకు భగవంతుడు ఎంతచక్కని ఉద్యోగం ఇచ్చారో చూడండి. ఎవ్వరితో సంబందం లేకుండా ఏకాగ్రంగా రామనామం చేసుకునే అవకాశం కల్పించారు. మంచి ఉద్యోగం కావాలని వెంపర్లాడే వారికి ఇది గొప్పపాఠం. ఏదైనా భగవంతుని సేవేననే భావంతో ఎవ్వరూ చేయలేనంతగా ఆ పనిని నామస్మరణతో జోడించి చేసి భగవంతుని మెప్పించడమే మనధ్యేయమైనప్పుడు మనం భగవంతునకు దగ్గరవుతాము. భగవంతుడిచ్చిన దానితో అసంతృప్తి చెందినంతసేపు భగవంతునికి దూరమౌతాము. పని

ఏది చేసినా అందరూ తినేది ఆకలికి అన్నమే. అసంతృప్తి నిర్మూలనమైతే, భగవంతుని తృప్తి పరచడమే ధ్యేయమైతే అప్పుడు మనకు భగవంతునకు చక్కని బాంధవ్యం ఏర్పడుతుంది. ఆపైన మనకు కావలసిందేమీ ఉండదు. వారు మిల్లులో ఎప్పుడూ పని చేయకపోయినా, ఏ యంత్రం ఏ పనిచేసేది అయనకు క్షుణ్ణంగా తెలుసు. కాలాంతరంలో బీహారులోని ఒక పెద్ద ప్రాజెక్టులో చెడిపోయిన యంత్రం రిపేరు చేయనెవరితరమూ కాలేదు. ఆ చీఫ్ ఇంజనీర్ శ్రీ బాబుగారిని ఆశ్రయిస్తే, శ్రీ స్వామినడిగి చెపుతానని మరునాడు చెప్పాడు. "గవర్నరు అనే భాగంలో ఒక ఇనుపగోలీ ఇరుక్కున్నది. అది తీసివేయమని చెప్పారు" అని చెప్పాడు. ఫోనులో చెప్పి అలా చేయించగానే యంత్రం పనిచేసింది. అంతపెద్ద చీఫ్ ఇంజనీర్ శ్రీ బాబుగారి పాదములపైబడి భక్తిప్రపత్తులతో నమస్కరించి వెళ్ళాడు.

శ్రీ బాబుగారికి 18వ ఏట శ్రీమతి లక్ష్మీదేవమ్మతో వివాహమైంది. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగారు. ఏలూరు పట్టణ మునిసిపాలిటి ఓవర్‌హెడ్ ట్యాంకు, వీధి కుళాయిలద్వారా నీటి సరఫరా చేస్తుంది. శ్రీ బాబుగారికి నీళ్ళకావడి మోసే పనిపోయింది. వీరికి ఇకవేరే పని చేతకాదు. కుటుంబాన్ని చాకమని దైవాదేశము. కనుక చీరాలవచ్చి నీళ్ళకావడి మోసేవాడు. కావడి నీళ్ళుపోస్తే రెండణాలు (1/8 రూపాయి) ఇచ్చేవారు. వీరి కావడిలో నీరు ఎక్కువ ఉండడంతో హోటళ్ళవాళ్ళు బాగా ఆకర్షింపబడ్డారు. అప్పుడు బాబుగారి వయస్సు 50 సంవత్సరాలు. శ్రీ బాబుగారి రెండవ కుమారుడు వీధి వీధి తిరిగి ఆముదం అమ్మేవాడు. వారికి కూడా శ్రీ రామానుగ్రహం కలిగిందని శ్రీ బాబుగారు చెప్పారు. ఐదుగురు బిడ్డలలో ఆముదం అమ్మేవానికి రామానుగ్రహం కల్గడమేమిటి?



గత జన్మలలో వారు చేసిన పుణ్యమే అందుకు కారణం. వీధి, వీధి తిరిగి ఆముదం అమ్మే తన వృత్తి ఎడల అసంతృప్తి లేకుండా రామనామస్మరణ తీవ్రంగా సాగించిన ఫలితమే వారికి రామనుగ్రహం కలిగింది. భగవంతుడు మనకిచ్చిన పనితో తృప్తిచెందక మనసులో ఎప్పుడూ ఆలోచనాస్రవంతిని నిరంతరాయంగా ప్రవహింపజేస్తుంటే దైవకృపకల్గడమెట్లా సాధ్యమౌతుంది? మన శక్తిసామర్ధ్యాలను ఆలోచనాస్రవంతిని అరికట్టేందుకు వినియోగిస్తే భగవంతుడు తప్పక అనుగ్రహిస్తాడు.

సుమారు 52 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు ఏలూరులో ఉన్నారు. ఆ తర్వాత 14 సంవత్సరాలు చీరాలలో ఉన్నారు. ఆ తర్వాత స్వర్గస్తులయ్యేవరకు గుంటూరులోనే ఉండేవారు.

ఆలోచనా స్రవంతిని అరికట్టిన శ్రీ బాబుగారికి శ్రీ రామచంద్రుడే వేళకు ఆహారం ఎంతో ఆనందంగా అందించేవారు. ఒకరోజు శ్రీ ఎక్కిరాల వేదవ్యాసగారు "బాబు గారు తమ భోజనం, బస ఎక్కడ చేస్తారు?" అని అడిగారు. "ఇల్లు వాకిలి లేని నాకు రాముడే సమయానికి ఏది పెడితే అది తిని బ్రతుకుతున్నానయ్యా" అని బాబుగారు చెప్పారు. అక్కడున్న పీతాంబరం అనే భక్తుడు అదెలా సాధ్యమని సంశయించాడు. వెంటనే శ్రీ బాబుగారు "కృష్ణా ఆపద్బాంధవా" అంటూ కేకవేసి గాలిలోకి చేతులు చాచారు. వారి చేతిలోకి అరిటాకులో ఉంచిన వేడి వేడి సుండలు వచ్చాయి. వాటిని శ్రీ వేదవ్యాసగారి చేతిలో పెట్టి పీతాంబరంగారి అనుమానం నివృత్తిచేశారు.

ఒక ఆసామి తనభార్యతో సయోధ్యగా కాపురం చేయడం లేదు. ఆ తల్లి శ్రీ బాబుగారిని ఆశ్రయించింది. ఒకరోజు శ్రీ బాబుగారు ఆ ఆసామిని కలసినప్పుడు ఆయన "మీరేమిస్తారు సత్యసాయి బాబాగారైతే బంగారు, డబ్బు, ఏదీ కావాలంటే అది ఇస్తారు" అని అన్నాడు. "నీవు తీసుకొని భరించగల్గితే ఇస్తాను" అన్నారు. "ఇవ్వండి" అన్నాడు ఆసామి. గాలిలోకి చేతులు పైకెత్తి చాపి మరుక్షణంలో 15 వేల రూపాయల నోట్ల కట్టలు తీసి అతనికిచ్చారు. అతను శ్రీ బాబుగారి కాళ్ళమీద పడి నోట్ల కట్టలను తీసుకోలేదు. ఆ ఆసామిని వెంటబెట్టుకొని మండా జగన్నాధరావు గారి షాపుకు వెళ్ళారు. "ఏం బాబాగారు ఇంతలోనే వచ్చారు. ఇప్పుడేగదా 15 వేలు తీసుకవెళ్ళారు" అన్నాడు. "వీటి అవసరం తొలగిపోయింది తీసుకో మన్నారు. "నాకు మీరు తిరిగి ఇవ్వనక్కరలేదు, ఉంచుకోండి" అంటారు జగన్నాధరావుగారు. శ్రీ బాబుగారు వారికి తిరిగి ఇచ్చేశారు. ఈ విధంగా వారి ఆశీస్సులతో కోటీశ్వరులైన ఎందరో భక్తులు వారి పాదాలచెంత వారి సర్వస్వం హృదయపూర్వకంగా సమర్పించేందుకు పడికాపులు కాస్తున్నా వారు మాత్రం నాసిరకం ఖద్దరు పంచె ఖద్దరు కండువా ధరించి ఎప్పుడూ నడకేగానీ ఏ వాహనం ఎక్కరు. గుంటూరు అంతా తిరిగేవారు

ఎంతమంది భక్తులు షడ్రసోపేతమైన భోజనాలు సమర్పించేందుకు నిత్యం పోటీపడుతున్నా వారు ముందుగా చెప్పి ఎవ్వరింటికీ భోజనానికి రారు. ముందుగా చెపితే స్పెషల్స్ చేస్తారని అది వారికి గిట్టదు. చెప్పాపెట్టకుండా తనకు నచ్చిన వారింటికి వెళ్ళి ఆకలి తీర్చుకుంటారు.

ఎంతగొప్ప అద్భుతం గావించినా, ఎంతమందికి జబ్బులు నయంచేసినా, ఎందరి సమస్యలు తీర్చినా, ఎందరికి సిరిసంపదలు



ప్రసాదించినా, ఎందరికి సంతానం ప్రసాదించినా అది అంతా శ్రీ రామచంద్రప్రభువుల వారి దయ, మీ ప్రాప్తం అంటారేగానీ తన ప్రశక్తి వీసమంతైనా ఉంచుకోరు. నేను ఆ మహనీయుని సేవకుణ్ణి. వారు చెప్పిన పనిచేయడమొక్కటే నాకు తెలిసింది. శ్రీవారు ఆదేశించిన పని చేసే శక్తి కూడా వారే ఇవ్వాలి అంటారు.

నిత్యం భిక్ష చేసేవారు. వారు చేసే భిక్ష చాలా చిత్రమైనది. ఒక సంచి తీసుకొని తన భక్తుల అంగళ్ళ దగరకు వెళ్ళేవారు. వారు శనగలు, బెల్లం, బొరుగులు, మిఠాయిలు అందులో సమర్పించేవారు. ఆ సంచి తెచ్చి దేవాలయంలో భగవంతునికి నివేదించి అందరికీ ప్రసాదంగా పంచేవారు. భగవంతునికి నివేదించేటప్పుడు తలుపు వేయించేవారు. 10 నిమిషాలాగి తలుపు తీసిచూస్తే కొంత పదార్ధం తీసుకున్న గుర్తులుండేవి. ఇంతటి రామభక్తుని నుండి ఎన్నో దివ్యానుభవాలు పొంది ధన్యతగావించిన శ్రీ దేవులపల్లి కృష్ణమూర్తి గారికి వారి కుటుంబ సభ్యులకు పాదాభివందనములు చెల్లిస్తున్నాము. శ్రీ కృష్ణమూర్తిగారు ఎంతో గొప్ప సద్గుణరాశి కానిదే శ్రీ బాబుగారు నిత్యం వారింటికి వచ్చి వారితో స్నేహంగా ఉండరు.

## పూజ్యశ్రీ మాష్టరుగారు చెప్పిన దివ్యలీలలు

ఒకరోజు శ్రీ మాష్టారు శ్రీ బాబుగారు ఏదో మందిరంలో ప్రదక్షిణలు చేస్తున్నారట. రెండవ ప్రదక్షిణ చేసేసరికి ఒక కొత్త వెదురుపేళ్ళ గంపలో ఏదో పెట్టి అరటాకులు మూతవేసి ఉందట. మూడవ ప్రదక్షిణ పూర్తిచేసి శ్రీ బాబుగారు ఆ గంపదగ్గరకొచ్చి అయ్యా! శ్రీ రామచంద్రప్రభువులవారు అరిశలు ప్రసాదమిచ్చి ఈ పట్టణములో కొందరికివ్వమన్నారు. మనంవీటినందరికీ అందివ్వాలి

అని చెప్పి రిక్షాపిలిచి అందులో గంపపెట్టుకొని ఎక్కి ఇద్దరూ వెళ్ళారు. ఆ గంపలోనే పార్శిలు కట్టే మందారాకులు కూడా ఉన్నాయట. వీధి వీధి తిరిగి ఎవరెవరికి ఎన్ని ఇవ్వాలో అన్ని చొప్పున ఇచ్చారట. ఇలాగే మరొకసారి రవ్వలడ్డు, మరొకసారి మైసూరుపాకులు కూడా శ్రీ రామచంద్రప్రభువుల వారిస్తే అందరికీ పంచిపెట్టారట.

## రత్నాలు పొదిగిన బంగారు గిన్నెలో పాయసమిచ్చుట

ఒక పేద భక్తురాలు అనేక రోజులనుండి సంతానముకొరకు శ్రీ బాబుగారిని ప్రార్థిస్తుండేది. ఒకరోజు శ్రీ బాబుగారు వారింటికొచ్చి అమ్మా శ్రీ స్వామి మీకు సంతానానికి పాయసమిస్తారట రండి అని చెప్పారు. శ్రీ బాబుగారు తనరెండు చేతులను గాలిలోకి చాపి కళ్ళుమూసుకొని నిలబడ్డారు. వారి చేతిలోనికి రత్నాలుపొదిగిన బంగారు గిన్నెలో పాయసమొచ్చింది. దానినాభక్తురాలికి ఇచ్చి "అమ్మా పాయసం నీవు త్రాగి గిన్నె మీఇంట్లోనే ఉంచు, తర్వాత వచ్చి తీసుకుంటానని చెప్పివెళ్ళారు. కొన్ని నెలల తర్వాత వచ్చి శ్రీ బాబుగారు గిన్నెనడిగారు. ఆ భక్తురాలు ఆ గిన్నెనెక్కడ దాచిపెట్టింది మరచిపోయింది. బాబుగారు వచ్చి అడిగినప్పుడు చాలా కంగారు పడిపోయింది. ఇల్లంతా వెతికింది. ఇంతలో బాబుగారు లోపలికొచ్చి అక్కడ అడుగున ఉండే దొంతె కుండలో ఉంది చూడమ్మా అన్నారు. అంతవరకు ఆమె అక్కడమాత్రం చూడలేదు. ఆ గిన్నె అక్కడే ఉంది. దాన్ని శ్రీ బాబుగారు తన రెండుచేతులతో పట్టుకొని గిన్నెను గాలిలో చూపుతూ కళ్ళుమూసుకున్నారు. రెండుక్షణాలలో గిన్నె అదృశ్యమైపోయింది.



## మానవాళికి శ్రీ మాష్టారిద్వారా బాబుగారు చెప్పిన మహత్తర సందేశము

అయ్యా నీకొక దేవాలయం చూపిస్తాను రమ్మని శ్రీ మాష్టారిని శ్రీ బాబుగారు తీసుకవెళ్ళారు. గాలి కొడితే పడిపోయేవిధంగా ఉండే పెంకుటింట్లోకి తీసుకవెళ్ళారు. ఆ ఇంట్లో ఇనుప గొలుసులు, చెక్క ఉయ్యాల పలకలో పడుకొని ఊగుతుండే అతి బలహీనమైన వృద్ధుడున్నాడు. శ్రీ బాబుగారి చప్పుడు విని పలకరించాడు. "మీ ఇల్లు చూడాలని వచ్చాములేయ్యా" అని శ్రీ బాబుగారు పలుకగానే, చూడండి చూడండి బాబు అన్నారా వృద్ధుడు. ఆ ఇల్లు చాలా పకడ్బందిగా లోపలవైపు కప్పంతా చాలా గట్టి పనిచేసిఉన్నారు. ఎంతో గొప్ప నగిషీ పనిచేసి ఉన్నారు. ఆ ఇంట్లోని వస్తువులన్నీ ఎంతో గొప్ప ఖరీదైనవి. వీరి అంచనాల ప్రకారం ఆ ఇల్లంతా లక్షలవిలువ చేస్తుంది. వెళ్ళిపోతున్నామయ్యా అని వీడ్కోలు చెప్పి శ్రీ బాబుగారు మాష్టారితో వచ్చేశారు. "అయ్యా అతను చూడు, రోజుకు రెండు చిన్న గ్లాసుల రాగి అంబలి త్రాగి జీవించాలి. అంతకు ఎక్కువ త్రాగితే చనిపోతారు. ఈ ఆస్థినంతా కుక్కలాగా కాపలా కాస్తున్నాడు. నీవెప్పుడూ పొరపాటునకూడా దేవుణ్ణి డబ్బియ్యమని అడగవద్దు, అని సందేశమిచ్చారు. ఇది మానవాళికే ఆ మహనీయుని అమృతసందేశము. డబ్బుంటే పదిమందికి ఉపయోగపడాలిగానీ బీరువాలో బంధించి కాపలా కాస్తే ఆ వృద్ధునిగతే పడుతుందని చెపుతున్నారు.

శ్రీ రామచంద్ర ప్రభువులవారు అనుమతిస్తే శ్రీ బాబుగారు ఏ గ్రామమైనా వచ్చేవారు. ఒకప్పుడొక భక్తుని ఇంటికి వెళ్ళారు. వారింటిలో స్నానసంధ్యానుష్టానములయ్యాక ఫలహారం చేసి మూడు మైళ్ళదూరంలోని వాళ్ళ పొలాలు చూచేందుకు ఆ భక్తుడు,

శ్రీ బాబుగారు వెళ్ళారు. అది మంచి వేసవికాలము. పొలాలలో ఎక్కడా నీళ్ళులేవు. ఆ భక్తుని పొలమునకు వెళ్ళి బాబుగారు దాహం, దాహం, దాహం అని అరుస్తూ చేను చుట్టు గనుమలమీద పరుగెట్టుతున్నారట. శ్రీ బాబుగారిని ఒంటరిగా వదలి వెళ్ళలేక ఆ భక్తుడు, చెమటలు పట్టగా భయభ్రాంతుడై చూస్తుండిపోయాడు. కొంతసేపటికి శ్రీ బాబుగారు శాంతించి ఇంటికి తిరిగి వచ్చారు. వచ్చేసరికి ఫైరింజన్లు మంటలు చల్లార్పే పనులు చేస్తున్నాయి. చిత్రమేమంటే బాబుగారి కౌపీనం ఆరవేసియున్న ఆ భక్తుని ఇల్లుదప్ప ఆ ఇంటి చుట్టుప్రక్కల ఉన్న ఇండ్లన్నీ బూడిదరాసులై యున్నాయి. ఈ ఒక్క సన్నివేశంలో వారి సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, సర్వసమర్ధత్వము పాఠకులకు చక్కగా బోధపడిఉంటుంది. అంతా చేసేది శ్రీ రామచంద్రప్రభువులవారే నాకేమీ తెలియదు అని వారి సర్వస్యశరణాగతి చాటేవారు.

పూజ్యశ్రీ భరద్వాజ మాష్టరుగారు మరి రెండు విషయాలు కూడా చెప్పారు. (1) శ్రీ బాబుగారు శ్రీ రామచంద్రుడు, శ్రీ కృష్ణులవారితోపందెము పెట్టి దాయాలాట ఆడేవారట. ఆ ఆటలో శ్రీ బాబుగారు గెలుచుకున్న డబ్బంతా ఒక కుండలో పోసి దాచి పెట్టేవారట. అనేకమంది కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు శ్రీ బాబుగారి ఆశీర్వాదసూచకంగా కొంత పైకం తీసుకవెళ్ళి తమ డబ్బుల పెట్టెలో భద్ర పరచుకునేవారు. వ్యాపారంలో ప్రతివారు ఎంతో అభివృద్ధి సాధించి ధనవంతులై శ్రీ బాబుగారి ఎడల ప్రేమ, భక్తి, విశ్వాసాలతో మెలిగేవారు. అలా ధనికులైన వారు వారి ఎడల చూపే భక్తి గౌరవాలు చూచితీరవలెనే గానీ వర్ణించలేము. శ్రీ బాబుగారి ఎడల వారు చూపే భక్తి గౌరవములు ఏ ఇతర రాజకీయ నాయకుల ఎడలగానీ, బిడ్డలకు తండ్రుల ఎడల, భార్యలకు భర్తల ఎడల కూడా ఉండవనేది పరమసత్యము.



మాష్టరుగారు చెప్పిన మరొకగొప్ప విషయము: శ్రీ బాబుగారు వడ్డీ వ్యాపారము చేసేవారు. వారి వడ్డీ వ్యాపారము చాలా చిత్రమైనది. ఎవరి కెంతిచ్చినా ప్రాంసరి నోటు వ్రాయించుకోరు. అందరికీ ఇవ్వరూ. శ్రీ రామచంద్రప్రభువు ఇవ్వమన్నవారికే ఇస్తారు. కోర్టువారు ఆమోదించిన వడ్డీలో సగమే తీసుకునేవారు. ఈ లెక్కంతా ఒక భక్తునివద్ద ఉంటుంది. వడ్డీకి తీసుకున్న వ్యక్తి ఏరోజు ఎంత ఇస్తే అంత జమ వ్రాసుకోవాలి. అర్ధరూపాయి, పావలా ఇచ్చినా చెల్లు వ్రాసుకోవాలి. అదివారి పద్ధతి.

ఒకరోజు నా ముందే ఒక ఎరుకలతను అప్పుకొచ్చాడు. "అయ్యా రేపు సాయంత్రం ఫలానా ఆయనను అడుగు ఇస్తాడు. నేను ఉదయం ఆయనకు నీకు డబ్బు ఇమ్మని చెపుతానని" అని చెప్పి పంపారు. "అయ్యా నేను వడ్డీ వ్యాపారం చేస్తాను తప్పా" అన్నారు. "లేదు బాబుగారు మీ వడ్డీ వ్యాపారం అందరి లాంటిది కాదుగదా! ప్రాంసరీనోటు లేకుండా ఎవరిస్తారు. అంత తక్కువ వడ్డీరేటుతో అన్నాను. "నాదేమీలేదు అంతా శ్రీ రామచంద్రుడు చేయిస్తున్నారు" అన్నారు.

నేను నా మిత్రుడు శ్రీ శేషగిరిరావుగారు శ్రీ పెద్దబాలయోగి గారి దర్శనార్ధం పోతున్నామని శ్రీ మాష్టరుగారికి చెప్పాను. వారు మొదట బాపట్లలో దిగి జిల్లెళ్ళమూడి అమ్మగారిని దర్శించి ఆ తర్వాత గుంటూరులో శ్రీ రంగన్నబాబుగారిని దర్శించి అప్పుడు పెద్దబాలయోగి గారి దగ్గరకు వెళ్ళమన్నారు. రంగన్నబాబుగారు ఫలానా సెంటరులో ఉదయం 6 గంటలకు కనిపిస్తారు. జాగ్రత్తగా చూస్తుండమన్నారు. ఒక్క నిమిషం వారలేకుండా అదేచోటకు శ్రీ బాబుగారు వచ్చారు. వెంటనే నేను పాదనమస్కారం చేశాను.

అయ్యా! అయ్యా! మీరనుకున్న మనిషిని నేను కాదు. నన్నెవరనుకున్నారో ఏమిటో అన్నారు. నేను పైకి లేచి "మీరు రంగన్నబాబుగారు కదండి" మిమ్ములను విద్యానగర్‌లో చూచానండి. శ్రీ మాష్టరుగారు మీ దగ్గరకు పంపారని చెప్పాను. అట్లాగా! సరే రండి అని మమ్ములను వారి గదికి తీసుకువెళ్ళారు. మా లగేజి అక్కడ పెట్టగానే స్నానానికి రమ్మని పిలచారు. నా స్నేహితుడు అలసిపోయి పడుకున్నాడు. నేను స్నానానికి వారితో వెళ్ళాను. నాలుగు బక్కెట్ల నిండా నీరు బావినుండి తోడి నన్ను స్నానం చేయమన్నారు. వారు చేదుతుంటే తాడు ఇవ్వనే ఇవ్వరు. శ్రీ రామచంద్రప్రభువు వప్పుకోరయ్యా, నేనే మీకు తోడియ్యాలట అన్నారు. నేను స్నానం చేసి వళ్ళు తుడుచుకుంటుంటే వారు చెప్పారు. "నేను బాగా బలంగా ఉండేటప్పుడు యాభై బిందెలనీరు తోడి స్నానం చేసేవాణ్ణి, ఇప్పుడు పది బిందెలతోనే సరిపెట్టుకుంటున్నానన్నారు. గదిలోకి వచ్చి వారు తిరుచూర్ణముతో నామం పెట్టుకోబోతున్నారు. నా వైపు తిరిగి "బొట్టు పెట్టుకుంటావా?" అని అడిగారు. "అట్లాగే బాబుగారు" అంటూ నా ముఖము అందించాను. వారి అమృత హస్తంతోనే నా నుదుట నామం పెట్టారు. వారుకూడా నామం ధరించి గ్రామంలోకి బయలుదేరారు. నా స్నేహితునికి బ్రాహ్మణులమనే భావము ఎక్కువ. "అయ్యా క్రింది వాళ్ళు బ్రాహ్మణులు. వాళ్ళు వచ్చి భోజనానికి పిలుస్తారు, తిను అని నన్ను తీసుకవెళ్ళారు. మేము రైలు బ్రిడ్జి దగ్గరకొచ్చాము, అయ్యా గంట ఎంతైనది. ఎనిమిది అయిందా, ఏదీ రైలు రావాలనే అంటున్నారు. రైలు కూతేస్తూ వస్తుంది. అయ్యా నాకు గడియారం అక్కరలేదు. గంట ఖ చ్చితంగా తెలుస్తుంది. ఊరంతా నడిచే తిరుగుతానయ్యా. అట్లా నడవవచ్చా? అన్నారు. "నడవగలగి నడిస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిది కదండీ" అన్నాను. ఆ ప్రక్కనున్న దేవాలయంలోకి నడిచి



అక్కడ నమస్కరించుకొని ఒక పెద్ద భవనానికి తీసుకెళ్ళారు. మెయిన్‌గేటు ముందు నిలబడి "అమ్మాయ్" అని పెద్ద కేకపెట్టారు. ఆహా! ఎంత ప్రేమ, ఎంత గౌరవం, ఆమె మజ్జిగలో వెన్నతీస్తున్నది. ఆ మజ్జిగ చేత్తోనే వెంటనే వచ్చి నమస్కారం బాబుగారూ అని చెపుతూ గేటు తీసింది. మేమొక పెద్ద హాలులో ప్రవేశించాము. మూడు సోఫా కం బెడ్లున్నాయి. బాబుగారు ఒకదానిపై ఆసీనులయ్యారు. నేను నేలపై కూర్చున్నాను. "భలేవాడివే. వారంత ఖరీదైన ఆసనం వేస్తే క్రింద కూర్చుంటావేమి?" అని పైకిలేచారు. ఇక బాగాలేదని ఆ ఆసనం చివర అలా కూర్చున్నాను. "బాగా కూర్చోవయ్యా" అంటూ నన్ను వెనక్కు దోశారు. ఇక లాభంలేదని చక్కగా కూర్చున్నాను. ఇంతలో ఆ తల్లి ఐదు పెద్ద ఇడ్లీలు (హోటలు ఇడ్లీలైతే పది అవుతాయి) మూడు రకాల చెట్నీలు, పొడివేసుకొని ప్లేటు ఒక చేత్తో, నెయ్యి గిన్నె ఒక చేత్తో తెచ్చింది. నేను మొహమాటపడి ఇన్ని వద్దమ్మా అన్నాను. వెంటనే బాబుగారు ఆ ప్లేటు అందుకొని "తినవయ్యా అవి ఇడ్లీలేకదా" అని ప్లేటు నాచేతికిచ్చారు. ఆమె నెయ్యి ఇడ్లీలపైనా చెట్నీలపైనా, పొడుంపైనా కుమ్మరించేసింది. ఆ నెయ్యంతా మా కుటుంబానికి వారానికి సరిపోతుంది. అంత ఎక్కువగా పోసేసింది. బాగా ఆకలిగా ఉన్నాను. మొత్తం తినేశాను. అరలీటరు చిక్కని కాఫీ తెచ్చి ఇచ్చింది. వద్దంటూనే త్రాగేశాను. ~~ఈ~~లోగా బాబుగారు లోపలికెళ్ళి టిఫిన్ చేసి కాఫీ త్రాగి వక్కపొడి నోట్లో వేసుకుంటూ నా దగ్గరకొచ్చి ఇదిగో వక్కపొడి అని నా చేతిలో కొంత పెట్టారు. అది నోటిలో వేసుకుంటునే "అమ్మా ఇక మేం వస్తాము" అని చెప్పి వచ్చేశాము.

అక్కడనుండి ఒక కిలోమీటరు దూరములోనున్న ఒక పెంకుటింటికి వెళ్ళాము. "అమ్మా" అనే పిలుపు చెవినబడగానే ఉప్మా తింటున్న ఎంగిలి చేతితోనే ఒక్క పరుగున వచ్చి తలుపు తీసి

నమస్కారాలు చెప్పిందొక పెద్దామె. నులక మంచం వాల్చి కూర్చోమని ప్రార్థించింది. "ఎందుకమ్మా రమ్మన్నావంట" అన్నారు. "అమ్మాయి పెండ్లి ఖాయమైంది బాబుగారు. ఆ మాట మీ చెవిలో వేద్దామని" అని చెప్పింది. "శుభం మంచిదమ్మా, అయితే వెళ్ళోస్తాము అన్నారు. కొద్దిగా ఫలహారం చేసి పొమ్మన్నదామె. ఇప్పుడే చేసి వస్తున్నామని చెప్పి వచ్చేశాము.

వారిగొంతు వినగానే భక్తుల హృదయాలలో పరవళ్ళు తొక్కే భక్తి, శ్రద్ధ, ఆనందం నేనెక్కడా చూడలేదు.

## పూజ్యపాదులు శ్రీ రంగన్నబాబుగారితో దేవులపల్లి కృష్ణమూర్తి గారి అనుభవాలు

శ్రీ రంగన్నబాబు గారిది ప్రకాశం జిల్లా దరిశి మండలం శ్రీ రామభద్రాపురం అనే గ్రామము. వీరి తండ్రి బూర్లె పుల్లయ్య గారు, తల్లి జాలమ్మగారు. వైశ్య కులము, మిధునకుల గోత్రము. వీరి ధర్మపత్ని లక్ష్మీదేవమ్మ గారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ముగ్గురు కుమారులు మరియు రెండవ కుమార్తె ఏలూరులో నివసించారు. పెద్ద కుమార్తె గుడివాడ దగ్గర గండిపూడిలో ఉండేవారు. శ్రీ రంగన్నబాబుగారికి తొమ్మిది సంవత్సరాల వయస్సులో ఒక వ్యక్తి తారసపడి ఒక సం||పాటు తీర్థయాత్రలు చేయించి తిరిగి వాళ్ళ ఇంటి ముందు వదలిపోయారు. ఈ సం|| కాలంలో బిడ్డ కనిపించలేదని తల్లిదండ్రులు తమ శక్తి కొలది వెతుక్కొని ఆశవదిలేశారు.

తన గురువు శ్రీ కోదండరామస్వామి అని చెప్పేవారు. నిరంతరము శ్రీ రామ నామస్మరణ చేస్తుండేవారు. ఏ వాహనమూ



ఎక్కకుండా గ్రామమంతా తిరిగేవారు. ఉదయం, సాయంత్రం విధిగా ఏదో ఒక మందిరానికి వెళ్ళేవారు. ఎవరికి ప్రసాదమిచ్చినా, ఎవరింటికి వెళ్ళినా అదంతా తన గురువుగారి ఆజ్ఞ అని చెప్పేవారు. ఒకసారి మా గ్రామం రండి స్వామీ అన్న భక్తులతో "నాదేమీ లేదు, గురువుగారైన శ్రీ రామచంద్రులు చెపితే అలానే వస్తాను. ఇక్కడ లేనిది మీ గ్రామములో ఏముంది" అని చెప్పేవారు. ఎవరైనా తన కష్టములు చెప్పుకుంటే అన్నీ ఎంతో సానుభూతితో వింటారు. శ్రీ రామచంద్రులవారు మీ కష్టాలు తీరేమార్గం చెపితే మీకు చెపుతాలే అనేవారు.

ఎప్పుడూ మోకాళ్ళవరకు పంచె, ఒక కోరా బనీను, చిన్న తుండు గుడ్డ భుజంపైన వేసుకొని కనిపించేవారు. ప్రతివారినీ అయ్యగారు, అమ్మగారూ అని ఎంతో గౌరవంగా పిలచేవారు.

కొంతకాలం ఏలూరులోను అటు తర్వాత పోలవరం, చీరాల, గుంటూరు వచ్చి జీవితాంతం గుంటూరులో ఉండేవారు. ఊహ తెలిసింది మొదలు నీళ్ళకావిళ్ళు మోసి వచ్చిన డబ్బుతో కుటుంబపోషణ చేసేవారు. వీరికి చదువురాదు. ఎవరైనా వీరికి ఉత్తరము వ్రాస్తే దాన్ని ఇతరులచేత చదివించుకునేవారు.

నేను ఏలూరులో ఉండగా వీరితో పరిచయమైనది. తర్వాత వీరు గుంటూరు వెళ్ళినప్పటికీ నేను అప్పుడప్పుడు గుంటూరు వెళ్ళి వీరిని దర్శించేవాణ్ణి.

1936 మొదలు 1943 సంవత్సరం వరకూ నేను ఏలూరులో కాపురముంటూ మా ఇంటి సమీపమునగల మార్కండేశ్వర ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసేవాణ్ణి. శ్రీ రంగన్నబాబుగారు ఒక కొల్లాయి

పంచ ధరించి ఒక తుండుగుడ్డ పైన వేసుకొని మా పాఠశాలకు వచ్చి "అయ్యాగారూ మా అబ్బాయికి, అమ్మాయికి బాగా చదువుచెప్పండి" అని అప్పుడప్పుడూ చెప్పేవారు. వారెవరో తెలియనందున సరేననేవాణ్ణి. కానీ పాఠశాలలో అందరికీ ఒకే విధంగా పాఠం చెప్పేవాడిని. ఒకరోజు వచ్చి "అయ్యాగారు, మా అబ్బాయికి బాగా చదువు చెప్పండి. శ్రీ రామచంద్రమూర్తి మీకు చెప్పామన్నాడు, బాగా చదువు చెప్పండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. వారెవరో తెలియని కారణాన వారి మాటలు నేను పెద్దగా పట్టించుకోకుండా "సరే" అని వదిలేశాను.

మేము దుగ్గిరాల మహలక్ష్మమ్మ గారింట్లో చేరిన మరురోజు నా భార్య దేవాలయానికిపోతే అక్కడ శ్రీ రంగన్నబాబుగారు ఉన్నారు. వారు మహలక్ష్మమ్మగారిని "అమ్మాగారూ! ఈ అమ్మగారు ఎవరు" అని అడిగారట. ఆమె ఫలానా పాఠశాలలో పనిచేసే కృష్ణమూర్తిపంతులుగారి భార్య అని చెప్పిందట. "అమ్మగారూ మీరు వీళ్ళ ఇంట్లో కాపురమున్నారా?" అని పలకరించారు. అదే మాకు శ్రీ బాబుగారి మొదట పరిచయము.

మా ఇంటి ఓనర్ మహలక్ష్మమ్మగారి అన్నగారైన విజయరామమూర్తిగారు చాలా రోజులనుండి నాకు పరిచయమే. కానీ విజయరామమూర్తిగారికి శ్రీ రంగన్నబాబుగారికి పరిచయముందని నాకు తెలియదు.

ఒకరోజు విజయరామమూర్తిగారు, శ్రీ రంగన్నబాబుగారు చెరువులో స్నానము చేస్తుంటే విజయరామమూర్తిగారు శ్రీ బాబుగారితో తనకున్న చనువువలన "బాబుగారు, మీరు శ్రీ రామచంద్రప్రభువునడిగి నాకు పూజచేసుకునే విగ్రహములు



ఇప్పించండి" అని అడిగారట. వెంటనే శ్రీ బాబుగారు నీటిలో మునిగి నీటినుండి పైకి వచ్చేటప్పుడు పెద్ద కొబ్బరికాయ తెచ్చారట. ఆ కొబ్బరికాయను విజయరామమూర్తికిస్తూ శ్రీ రామచంద్రప్రభువు ఇదే ఇచ్చారు" అన్నారట. ఆ తర్వాత పదిరోజులకు నవరాత్రుల సందర్భంగా ఒకరోజు శ్రీ బాబుగారు "అయ్యగారూ మీకు శ్రీ రామ చంద్రప్రభువులవారు పూజా విగ్రహాలు ఇస్తారట. ఒక ఇత్తడి పళ్ళెముతోమి మందిరంలో పెట్టమన్నారు" అని చెప్పారు. వారలాగే చేశారు. శ్రీ బాబుగారు మరియు విజయరామమూర్తి క్రిష్ణానది కాలువలో స్నానముచేసి వస్తుంటే "అయ్యగారూ మీరు తోమించి పెట్టిన పళ్ళెములో శ్రీ రామచంద్రప్రభువులవారు విగ్రహములు మీ కొరకు పెట్టారట" ఈ విషయం మీకు చెప్పమన్నారు, అని శ్రీ బాబుగారు చెప్పారట. వారొచ్చి చూస్తే నిజంగానే (1) శ్రీ రామచంద్రమూర్తి (2) సీతామహాదేవి (3) శ్రీ ఆంజనేయస్వామి (4) శ్రీలక్ష్మణస్వామి (5) శ్రీ విఘ్నేశ్వరుడు (6) దీపారాధన కుందెతో కలసి శ్రీ అనసూయాదేవి విగ్రహము పళ్ళెములో ఉన్నాయట. ఈ విగ్రహములనే విజయరామమూర్తి శ్రద్ధా భక్తులతో నిత్యమూ ఉదయము, సాయంత్రము మందిరములో పెట్టి పూజించేవాడు.

నిత్యమూ ఉదయం, సాయంత్రం తప్పక శ్రీ బాబుగారు పూజటైంలో మందిరంలో ఉండేవారు. రాత్రి పదకొండు గంటలకు మందిరంలోనే శయనించేవారు.

## శ్రీ బాబుగారితో నా ప్రథమ పరిచయము (1941)

మేము మహలక్ష్మమ్మగారింట్లో చేరి ఒక సంవత్సరము పైన అయింది. అనేకసార్లు శ్రీ రంగన్నబాబుగార్ని చూస్తున్నానుగానీ

మేము ఒకరిని ఒకరు పలుకరించుకొన్నది లేదు. ఒకరోజు నేను మందిరంలోకి వెళ్ళేసరికి నన్ను చూచి అచ్చటనున్న స్త్రీలందరూ వెళ్ళేందుకు తయారయ్యారు. నేను రావడంతో వాళ్ళు వెళ్ళిపోతున్నారని నేను తిరిగి ఇంటికి వెళ్ళిపోయాను. మా యింటి కిటికీగుండా చూస్తే మందిరము, శ్రీ రంగన్న బాబుగారు బాగా కనిపిస్తుంటారు. కొంతకాలము గడిచాక ఒకరోజు రాత్రి 11 గంటలసమయం, శ్రీ స్వామివారికి పవళింపు అయిపోయి అందరూ వెళ్ళిపోతున్న సమయంలో శ్రీ బాబుగారు నా భార్యను పిలచి "అమ్మగారు! శ్రీ రామచంద్రప్రభువులవారు మీ భర్తగారిని పిలుస్తున్నారు, పిలుచుకొని రండి" అని చెప్పారు. ఆమె వచ్చి నన్నులేపి శ్రీ రామచంద్ర ప్రభువులవారు పిలుస్తున్నారట. రంగన్నబాబుగారు మిమ్ములను మందిరానికి రమ్మంటున్నారు అని చెప్పి మరలా మందిరానికి వెళ్ళిపోయింది. నేను లేచాను కానీ మరలా నిద్రపోయాను. ఇదే విధంగా శ్రీ బాబుగారు నాభార్యను నన్ను తీసుకరమ్మని మరలా పంపారు. ఇప్పుడు కూడా మొదటిసారిలాగానే జరిగింది. మూడవసారి శ్రీ బాబుగారు "అమ్మగారూ అయ్యగారు పగలంతా పాఠశాలలో పనిచేసి అలసిపోయి మంచి నిద్రలో ఉన్నారు. ముందు వారినిలేపి తర్వాత శ్రీ రామచంద్రప్రభువులవారు పిలుస్తున్నారని చెప్పి మీరు దగ్గరుండి అయ్యగారిని తీసుకురండి" అని చెప్పిపంపారు. ఆమె అలాగే చేసింది. బాగా మెలుకువ వచ్చినందున ఆ మాటలు వింటూనే నిర్ఘాంతపోయాను. నాభాగ్యమునకు పరమానంద భరితుండనై శ్రీ రామచంద్రులవారికి నమస్కరించి నాభార్యతోటి మందిరానికి వెళ్ళాను.

ఆహా! పరమ ఆశ్చర్యము. మేము మందిరములో ప్రవేశించునప్పటికి శ్రీ బాబుగారు కండ్లు మూసుకొని



పద్మాసనములో శ్రీ కోదండరామస్వామి చిత్రపటానికి ఎదురుగా కూర్చొనియున్నారు. వారు భూమిమీద కూర్చొనియున్నారా, గాలిలో కూర్చొని యున్నారా అనేది నేను నిర్ణయించలేక మందిర గుమ్మంలోనే పదినిమిషాలు నిలుచున్నాము. శ్రీ బాబుగారు కళ్ళు తెరచి "అయ్యగారూ వచ్చారా! కాళ్ళు కడుక్కునిరండి - పొద్దస్తమానమూ బడిపిల్లలతో వాగుతున్నందున నిద్రపోతున్నారు. వాగుడు అలసట కలిగిస్తుంది. అందువలన నిద్రవస్తుంది. శ్రీ రామచంద్రప్రభువులవారు "రంగన్నా కబుర్లేమిటో అడగవోయ్" అంటున్నాడు.

నేను: నీకంటే నాకు ఎక్కువ తెలిసిన కబుర్లేమున్నాయి స్వామి? శ్రీ ఆదినారాయణుడవు. సర్వాంతర్యామివి. సర్వరక్షకుడవు. సృష్టి స్థితి లయకారకుడవు. పరమాత్ముడవు - నీకంటే నాకేమి ఎక్కువ తెలుసు స్వామీ.

శ్రీ బాబుగారు: భగవంతుడు అనేవాడు ఉన్నాడా? నీకు నమ్మకమేనా ?

నేను: భగవంతుడు లేడనేంతటి పాపిష్టివాడను కాదు స్వామీ. నేనెట్టివాడనో మీకు తెలియదా స్వామి! తమరే లేకుంటే ఈ సృష్టి స్థితి లయలు ఎలా జరుగుతున్నాయి.

నేను చెప్పినదంతయు నిజమేనని శ్రీ రామచంద్రప్రభువులవారు తల ఊపుచున్నారని శ్రీ బాబుగారు చెప్పారు. కానీ నాకు మాత్రము శ్రీ రామచంద్రప్రభువు కనిపించలేదు.

శ్రీ బాబుగారు: ఉదయం మీరు నిద్రలేచి మరలా బడికి వెళ్ళవలెనట. కనుక వెళ్ళి పడుకోమని శ్రీ స్వామి చెపుతున్నారు.

అప్పుడు రాత్రి ఒంటిగంట అయినది. మేము వెళ్ళిపడుకున్నాము. అది మొదలు ప్రతిదినము మందిరానికి వెళ్ళేవాణ్ణి.

## శ్రీ సత్యనారాయణస్వామి వ్రతప్రసాదమడుగుట

1946 వ సంవత్సరములో మేము మాఇంటిలో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం చేసుకున్నాము. ఆ సమయములో శ్రీ బాబుగారికి అనారోగ్యముగా ఉండి మందిరానికి రావడంలేదు. మేము సత్యనారాయణ వ్రతం చేశామని వారికి తెలిసే ఆస్కారమేలేదు. మీ ఇంటిలో కాపురమున్న పంతులుగారు సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకున్నారట. వారిని కొంచెం ప్రసాదము అడిగి పంపించమని శ్రీ బాబుగారు తన కుమారుణ్ణి మహలక్ష్మమ్మగారింటికి పంపారు. మాకు శ్రీ బాబుగారితో ఎక్కువ పరిచయములేనందుననూ, వారెంతటి గొప్పవారో తెలియ నందున మేము మా ఇంట్లో జరుపుకున్న వ్రతం గురించి వారికి చెప్పనేలేదు. మహలక్ష్మమ్మగారు చెప్పారు కనుక శ్రీ బాబుగారి కుమారుని ద్వారా కొంచెం ప్రసాదం పంపాము. పదిహేనురోజులకు శ్రీ బాబుగారు తిరిగి మందిరానికి వచ్చారు. అప్పుడు నా భార్యతో "అమ్మగారూ! శ్రీ స్వామివారు మీ ఇంటిలోని సత్యనారాయణవ్రతనివేదనను ఆరగించినారట. నన్ను కూడా తెప్పించుకొని తినమని నాకు చెప్పారు. అందువలన నా కుమారుణ్ణి తెమ్మని పంపాను. శ్రీ స్వామివారు ఆరగించినట్లు మనకు తెలియదు. ఎంతో సుకృతముంటే కానీ తెలిసుకోలేము. మీ నివేదన శ్రీ స్వామివారు ఆరగించారట. మీ జన్మ ధన్యమైంది" అని చెప్పారు. ఆ మాట విని మేము వర్ణించలేని ఆనందం పొందాము. శ్రీ బాబుగారికి



అనుక్షణము ఎక్కడేమి జరిగేది తెలుస్తూనే ఉంటుంది. కానీ ఆ విషయం మనకు తెలియకుండా మధ్యలో శ్రీ రామచంద్ర ప్రభువును పెట్టుకొని వారు నాకు చెప్పారు అని చెపుతుంటారు.

ఈ గ్రంధారంభంలో వ్రాసినట్లు ఎక్కడో ఇండ్లు తగులబడుతుంటే దాహం దాహం అని అరుస్తూ శ్రీ బాబుగారు పరుగెత్తారు. వారలా ఎందుకు అరుస్తున్నారో తర్వాత తెలిసింది. వారు దాహం, దాహం అని అరచిన క్షణంలో ఒక పూరింటి చుట్టూ ఉన్న ఇండ్లన్నీ అగ్నిపాలైనా, శ్రీ బాబుగారు స్నానంచేసి ఆరవేసిన కౌపీనంగల ఇల్లు మాత్రం అగ్ని ప్రమాదానికి గురికాలేదు. ఈ మహనీయుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞులు, సర్వసమర్థులు కానిదే ఈ లీల చేయలేరు. ఈ మూడు గుణాలు శాస్త్రాలలో భగవంతునకు చెప్పబడ్డాయి. కనుక శ్రీ బాబుగారు ఎంతటి గొప్ప దైవమో తెలుస్తుంది.

1947 వ సంవత్సరములో నేను నా భార్య మందిరంలో శ్రీ బాబుగారి సమక్షములో ఉన్నాము. "అయ్యగారూ! మీరు ధనికులు, పేదవారు అనే భేదంలేకుండా అందరికీ కష్టపడి చదువుచెపుతారని శ్రీ స్వామి నాతో చెపుతుంటాడు" అని అన్నారు. అందుకు నేను "బాబుగారూ అంత శక్తి నాకెక్కడిది. అంతా ఆ భగవంతుని దయ. ఈశ్వర కృపవల్ల బిడ్డలకు బాగా చదువు వస్తుంది. అంతమందితో పొద్దస్తమానమూ వాగినా గానీ అలుపు, అలసట లేదంటే అదంతా శ్రీ రామచంద్రప్రభువు దయగాక మరేమిటి. నన్ను, పిల్లలనూ కాపాడేవాడు సర్వరక్షకుడైన భగవంతుడే. నాదేమీలేదు బాబుగారు" అని అన్నాను.

"అయ్యగారూ! సత్యవతమ్మ గారు (నా భార్య) ఎప్పుడైనా ఎవరింటికైనా భోజనాలకు వెళ్ళారా? ఒకప్పుడీమె ఏదో శుభకార్యంలో ఒకరింటికి భోజనానికి వారు పిలిస్తే వెళ్ళిందట. ఆ ఇంటి యజమానురాలు వచ్చిన ఆడవారినందరినీ మీ పిల్లలను తీసుకరాలేదేమీ అని అడుగుతున్నారట. కొందరు మాకు పిల్లలు లేరని చెపుతున్నారట. సత్యవతమ్మ గారు కూడా మాకు పిల్లలు లేరని చెప్పారట. కానీ ఆ యజమానురాలు అటుతర్వాత కూడా రెండుమార్లు అదే ప్రశ్న అడిగి - ఓహో నీవు పిల్లలు లేరని చెప్పావుగా, మరచిపోయి అడిగాను. ఏమీ అనుకోవద్దని చెప్పిందట. కానీ అంతమందిలో తనను ఒక్కదానినే అలా మూడుమార్లు అడగడంతో సత్యవతమ్మగారు సిగ్గుపడి, మనసు నొచ్చుకున్నదట" ఈ విషయం నీకు తెలుసా అని అడిగారు.

ఈ విషయం యధార్ధంగా 1943వ సంవత్సరములో సత్యవతమ్మగారు నందిరాజు చలపతిరావు గారింటికి భోజనానికి వెళ్ళినప్పుడు జరిగినదనియు, ఆమె ఆ విషయం తన భర్తకు చెప్పలేదని శ్రీ బాబుగారి సమక్షములో అంగీకరించినది. 1943వ సంవత్సరములో జరిగిన విషయాన్ని 1947వ సంవత్సరములో అంటే నాలుగు సంవత్సరాల తర్వాత బాబుగారు శ్రీరామచంద్ర ప్రభువు చెప్పినట్లు చెపుతున్నారు. అక్కడ జరిగిన సంభాషణంతా యధాతదంగా చెపుతున్నారు. సర్వజ్ఞులంటే ఎలా ఉంటారో, ఆ సర్వజ్ఞత్వాన్ని గోప్యంగా ఉంచేందుకు శ్రీరామచంద్ర ప్రభువుల వారిని అడ్డం పెట్టుకొనేవారు. మహనీయులందరూ ఏదో విధంగా తమ గొప్పతనాన్ని గోప్యంగా ఉంచేవారు. శ్రీ సాయినాధుడు నేను అల్లాకు బానిసనంటే, శ్రీ వెంకయ్యస్వామి వారు పైవాళ్ళు వప్పుకోరంటే, శ్రీ భరద్వాజగారు అంతా చేసేది సాయినాధుడే, నేను



మిఠాయి కట్టిన కాగితంలాంటివాడను. మిఠాయిలేకుంటే కాగితానికి విలువేముంది, అనేవారు.

## షిరిడీ సాయి పటము ప్రసాదించుట

శ్రీరామచంద్రప్రభువులవారు మీకొక పటము ప్రసాదిస్తారట. దానిని మీరు మీ పూజలో ఉంచి పూజించుకోండి అని శ్రీ బాబుగారు చెప్పారు. "అయ్యగారూ రండి, శ్రీ స్వామివారు పటం ప్రసాదిస్తున్నారు రండి" అంటూ మందిరములోని శ్రీ కోదండరామస్వామి వారి పటం దగ్గరకు వెళ్ళి రెండు చేతులూ పైకెత్తుట చూస్తున్నాము. అంతలో దేదీప్యమానమైన వెలుగు ప్రసరిస్తుంది. మిరుమిట్లు గొల్పు ఆ వెలుగు చూడలేకున్నాను. శ్రీ రంగన్నబాబుగారు ఎచ్చట ఉన్నారో కూడా కనిపించలేదు. ఒక్కక్షణంలో వారు గగనమునుండి గాలిలో దిగివస్తున్న దృశ్యం గోచరిస్తుంది. "అయ్యగారూ ఇదిగో శ్రీ స్వామివారిచ్చిన ఫోటో" అంటూ నా చేతిలో ఒక పటం పెట్టారు. అది షిరిడీ సాయి ఫోటో. బాబా పైన కుడివైపు శ్రీరామచంద్రులవారు, మధ్యలో దత్తాత్రేయులవారు, ఎడమవైపు శ్రీ ఆంజనేయస్వామి ఉన్నారు. ఆ ఫోటో అద్దము ఫ్రేముతో కట్టిఉన్నది. పటికబెల్లము ప్రసాదమిచ్చారు. నిత్యం పూజ చేసుకొని పటికబెల్లం కానీ, బెల్లంకానీ నివేదించమన్నారు. ఈనాటి వరకు ఆ పటము మా పూజాగృహమందున్నది. ఈ విధంగా పటము ప్రసాదించడం చాలా అరుదు. ప్రసాదాలు మాత్రం విరివిగా ఇచ్చేవారు. "అదంతా రామచంద్రప్రభువుల దయ, నాదేమీ లేదు. వారు ఎవరికివ్వమంటే వారికే ఇస్తాను" అని చెప్పేవారు.

## మాకందరికీ అరటిపండ్లు ప్రసాదమివ్వటం

ఒక్కొకసారి ఎందరు భక్తులు తనదగ్గరుంటే వాళ్ళందరికీ అరటిపండ్లు, చీనీ పండ్లు, సపోటాలు లాంటి రకరకాల పండ్లు ఒక్కొక్కసారి ఒక్కొకరకం అందరికీ ఇచ్చేవారు. ఒక్కొక్కప్పుడు శ్రీరామచంద్రప్రభువు ఫలానా వాళ్ళకే ఇమ్మన్నారు అని వారికే ఇచ్చేవారు. చేతులు గాలిలో చాచి అడుగుతారు. రెప్పపాటులో వారిచేతిలోకి ప్రసాదాలు వస్తే శ్రీరామచంద్ర ప్రభువు చెప్పినవారికి ఇచ్చేవారు. కొందరు ప్రసాదమడిగినప్పుడు "నాదేముందీ శ్రీరామచంద్ర ప్రభువు ఇస్తే ఇస్తాను" అంటారు. మీరు అడగండి ఇస్తారు అంటే మనముందే గాలిలోకి చేతులు చాపి అడుగుతారు. ఇవ్వలేదు, నేనేం చేసేది అంటారు.

## తేళ్ళ రూపంలో దర్శనము

భగవంతుని అనంతనామాలలో విచిత్ర వేషాయనమ: అనేది ఒకటి. ప్రహ్లాదకుమారుడు చెప్పినట్లు "అందుగలడిందు లేడని సందేహము వలదు - ఎందెందు వెదకిచూచిన అందందే గలడు" అని. అతడంతటా ఉన్నాడు. అన్ని రూపాలూ వారివే. ఎప్పుడు ఏ రూపంలో మనకు కనిపించాలనుకుంటే ఆ రూపాలలోకూడ కనిపిస్తారు. ఈ జగత్తంతా ఆ పరమాత్మయొక్క లీలారూపమేగదా? రాగద్వేషాలు మాని, ఆశను వదలి, అహంకారము వీడి, ఇష్టము, అయిష్టము వదలి ధర్మంగా జీవిస్తూ, సద్గురుసేవచేస్తూ అన్నీ రూపాలలో ఆ పరమాత్మే ఉన్నాడనే ఏమరుపాటులేని ఎరుకతో జీవిస్తుండడమే సాధన అంటారు పూజ్యపాదులు శ్రీ మాష్టరుగారు. అలాంటి జీవనాన్ని ఎన్నో



జన్మలనుండి ఆచరించి భగవంతునితో ఐక్యమైన మహనీయుడే శ్రీ రంగన్నబాబుగారు.

ఒకరోజు నేను అన్నము తినబోతున్న సమయంలో నాకు రెండు గజాల దూరంలో ఒక తేలు పారాడుతుంది. దాన్ని కొట్టి సైడుకాలువగట్టుపై పడేసి అన్నం దగ్గరకు వెళితే మరొకతేలు పారాడుతుంది. ఇలా నాలుగుతేళ్ళను చంపాను. మూటిని బయట సైడుకాలువగట్టుమీద వేసి నాలుగవతేలును చంపి బయట పారేసేందుకు పోతున్నాను. శ్రీ రంగన్నబాబుగారు ఎక్కడున్నారో, నేను తేళ్ళు చంపేది ఎప్పుడు చూచారో తెలియదు "అయ్యగారూ ఏమి జరిగింది, ఏమిటిది ఏంటి తీసుకపోవుచున్నారు" అని అడిగారు. నేను జరిగిన విషయం చెప్పాను. అప్పుడు శ్రీ బాబుగారు "అయ్యగారూ ఎంత పని చేస్తున్నారు? ఎంత పొరపాటు? ఆ తేలు రూపంలో దర్శనమిచ్చింది ఎవరనుకున్నారు? శ్రీ షిరిడీ సాయి మీ మనసు పరిశోధించుటకు ఆ రూపంలో వచ్చారు. మీరు అది తెలుసుకోలేక చంపుతున్నారు. అపరాధమని చెంపలేసుకొని నమస్కరించండి శాంతిస్తారు" అని చెప్పారు. వెంటనే నాకు కన్నీళ్ళు వచ్చాయి, నాచేతిలోని చెప్పు పై ఉన్న తేలును క్రిందపెట్టి "స్వామి నేను పరమ మూర్ఖుడను. తెలియక చేసిన తప్పు క్షమించు తండ్రీ. బ్రహ్మాది దేవతలే నీ మాయను దాటలేనపుడు, నేనెంతటి వాణ్ణి. క్షమించు తండ్రీ అని సాష్టాంగ దండం పెట్టి కన్నీరు తుడుచుకొని చంపిన తేలు బయటపడేసేందుకు క్రింద పెట్టిన చెప్పు మీద చూస్తే తేలులేదు. బ్రతికినతేలైతే పోయిందనుకోవచ్చు. బాగా చితకబాదిన తేలు ఎలాపోతుంది. శ్రీ సాయినాధుడే ఈ రూపంలో వచ్చాడనేందుకు ఈ చచ్చినతేలు అదృశ్యమవడం ఒక నిదర్శనమని తలచాను. వెంటనే సైడుకాలువగట్టు పై పారవేసిన మూడు చచ్చిన తేళ్ళు

ఉన్నాయో లేదోనని చూచాను. ఏమి ఆశ్చర్యము. పగలైతే చచ్చిన తేళ్ళను కోళ్ళు తిన్నాయనుకోవచ్చు. ఇది రాత్రి ఎనిమిదిగంటల సమయము. కాకులు రావు, కోళ్ళు రావు చచ్చిన తేళ్ళు కాలువగట్టున లేవంటే శ్రీ బాబుగారు చెప్పినమాట అక్షర సత్యమన్నమాటే. శ్రీ సాయి, శ్రీ బాబుగారు, భగవంతుడు వేరు వేరుగా లేరు. ఈ తేళ్ళరూపాలలో వచ్చింది, నన్ను క్షమాపణ చెప్పమన్నదీ అంతా ఆ పరమాత్మే. ఇట్టి సద్గురువు సన్నిహితుడుగా లభించినా పొందవలసినదంతా పొందలేక పోయానుగదా పరమేశ్వరా! నమోన్నమో విచిత్ర వేషాయనమః. ఎక్కడో ఉన్న బాబుగారు క్రిష్ణమూర్తి తేళ్ళు చంపే సమయంలో వారి ఇంటికి వచ్చాడంటే అర్ధమేమిటి? వారు సర్వవ్యాపకులని (అంతటా ఉన్నవారు) సర్వజ్ఞులని (అన్నీ తెలిసిన వారని) తెలుస్తుంది. అంతేకాదు సర్వసమర్ధులు (ఏమైనా చేయగలవారు) తేలురూపాలు ధరించగలరు. తేలు రూపాలనుండి అదృశ్యంకాగలరు. ఒకేకాలంలో అనేక ఇండ్లలోనున్న మహనీయునికి ఈ లీల ఒకలెక్కా? సద్గురుని ఆజ్ఞ ప్రకారం సాధనచేయనిదే, ఇంద్రియనిగ్రహం సాధించనిదే దేవుడు ఎదురుపడ్డా పగటి వేషగాడివి పో అంటాముగాని దైవముగా గుర్తించలేము. సాధనకు మనలను నెట్టేది మన పుణ్యమే. ధర్మాచరణమే పుణ్యమునకు పునాధి మరియు చివరిమెట్టు.

## కుంకుమ ప్రసాదము

ఒక దుర్గాష్టమినాడు శ్రీ బాబుగారు మాకు శ్రీరామచంద్ర ప్రభువులవారు మాకిమ్మని ఇచ్చిన కుంకుమ ప్రసాదించారు. లేతగులాబీ రంగులో ఉంది. ఆ కుంకుమ భరిణను పూజాగృహములో ఉంచి పూజించి నిత్యమూ మేమిద్దరమూ నుదుట



ధరించేవారము. చిత్రమేమంటే ఎన్నాళ్ళువాడినా కుంకుమ భరిణెలో కుంకుమ ఎప్పటివలె నిండుగా ఉండేది. అలా నిత్యనూతనంగా కొన్ని సంవత్సరాలు భగవంతుని దివ్యశక్తి చూచే భాగ్యము కలిగింది. ఒకప్పుడు మేము మహలక్ష్మమ్మ గారి ఇల్లు వదలి మరొక ఇంట్లో బాడుగకు చేరాము. మా పూజాగృహము, మా తోడల్లుని ఇల్లు, ఒక వెదురు తడికతో వేరుచేయబడి ఉన్నాయి. పటాలన్నీ గోడకు మేకులు కొట్టి తగిలించాము. ఒక నాలుగురోజులు మరొక గ్రామం వెళ్ళి వచ్చేసరికి పటాలన్నీ క్రిందపడి ఉన్నాయి. కుంకుమ భరిణ తడిక క్రింద గల సందునుండి దొర్లి మా తోడల్లుని పోర్షనులో పడిఉంది. ఈ విషయాన్ని శ్రీ బాబుగారికి విన్నవిస్తే ఆ కుంకుమను క్రిష్ణానదీ కాలువలో కలిపివేయండి, మీకు మరొక కుంకుమను స్వామి వారికి చెప్పి ఇప్పిస్తానన్నారు. ఆ తర్వాత రెండు సంవత్సరములకు శ్రీ జనార్ధనస్వామి కోవెలలో మరలా శ్రీరామచంద్ర ప్రభువుల వారి ప్రసాదమని మరియొక భరిణె నిండా కుంకుమ ప్రసాదించారు.

## నాగులచవితి ప్రసాదము

ఒక నాగులచవితినాడు ఉదయం పదిగంటలకు శ్రీ బాబుగారు మా ఇంటికి వచ్చి "అమ్మగారూ సీతా మహాదేవిగారు పుట్టలో పాలుపోశారట. ఈ ప్రసాదము మీకిమ్మన్నారండీ" అని చలిమిడి, వడపప్పు కొబ్బరిముక్కలు ఇచ్చి వెళ్ళారు. మేమంతా ఎంతో సంతోషంగా ఆ ప్రసాదము తీసుకున్నాము.

## కృష్ణాష్టమినాడు వెన్నపూస ప్రసాదము

ఒక కృష్ణాష్టమినాడు ఐదు లేక ఆరు మందిమి దేవాలయములో శ్రీ బాబుగారితో ఉన్నాము. శ్రీ బాబుగారు ఒక్క క్షణం కళ్ళు మూసుకొని "ఇప్పుడేమి జరిగిందో చెప్పమని" మమ్ములను అడిగారు. మేము ఒకరి మొహాలు ఒకరు చూచుకుంటుంటే శ్రీ బాబుగారు అన్నారు "ఈరోజు కృష్ణాష్టమి గనుక మీకందరికీ ఇవ్వమని ఈ వెన్న పంపాడు కృష్ణయ్య. మహాలక్ష్మమ్మా! ఈ వెన్నను తలా కాస్త పెట్టమ్మా అని వెన్నపూస గిన్నెను మహాలక్ష్మమ్మ గారి చేతికిచ్చారు. మేమందరమూ అమితానందముతో ఆ ప్రసాదము తీసుకొని ఇండ్లకు వెళ్ళాము.

## మందిరములో శ్రీ కృష్ణప్రసాదము - పటిక బెల్లం

ఒకరోజు మేము నలుగురైదుగురము శ్రీ బాబుగారితో కూడా మందిరంలో కూర్చోనున్నాము. ఉన్నట్లుండి శ్రీ కృష్ణుని పటమునుండి "చిట్, ఫట్" అనే శబ్దముతో పటిక బెల్లం పలుకులు నేలపై బడి ఎగిరి మా వడులలో పడుచున్నవి. వెంటనే శ్రీ బాబుగారు "ఈ రోజు శ్రీ కృష్ణ ప్రభువులవారు మనకు పటికబెల్లం ప్రసాదమిస్తున్నారు. ఎవరికి దొరికినది, వారే కండ్లకద్దుకొని తినండి" అని చెప్పారు. మేమలాగే చేశాము.

ఇలాంటివి చిల్లర మహిమలని కొందరు ప్రబుద్ధులు విమర్శించే అస్కారముంది. వారెప్పుడూ సభలుచేసి అందరి ముందూ ప్రదర్శించింది లేదు. ఇలాంటి అనుభవాలు రుచిచూచిన వారు మరియొకరికి చెపుతున్నారని తెలిస్తే అంగీకరించేవారుకాదు. "వారి వారి సుకృతాన్నిబట్టి దేవుడు ప్రసాదమిస్తుంటే మధ్య



నాదేమిటి గోల. అంతా దైవలీలతప్ప నాకేమీ తెలియదు" అని తప్పుకొనేవారు. ఇవి సహజాతి సహజంగా పూవుకు వాసనవచ్చినట్లు వారి ద్వారా ప్రకటమవుతున్నాయే గానీ కీర్తికాంక్షతో వారు ప్రదర్శించినవి కావు అని మనం బాగా గుర్తించాలి. లేకుంటే శ్రీ బాబుగారి చరిత్ర చదివికూడా ఏమీ పొందలేకపోతాము. కారణం వారు తన ఆశ్రితులకు దైవశక్తియందు విశ్వాసము కల్గించి తద్వారా ధర్మపథంలో నడిపించాలనేదే వారి సంకల్పము.

ఎప్పుడో ఆరునెలల క్రిందట "అయ్యగారూ మీకు శ్రీరామచంద్ర ప్రభువులు పండునిస్తానంటున్నారు" అని చెప్పారు గానీ అప్పుడు మాత్రము ఇవ్వలేదు. ఆరు నెలల తర్వాత రాత్రి పదిగంటల సమయంలో శ్రీ బాబుగారు మా ఇంటిలో ఉన్నారు. "అయ్యగారూ మనిద్దరినీ శ్రీరామచంద్ర ప్రభువులవారు మన ప్రక్కనున్న శ్రీ మార్కండేయ మందిరమునకు రమ్మంటున్నారు, పోదాం పదండి" అని మందిరానికి తీసుకవెళ్ళారు. అప్పుడు మందిరం మూసేసి పూజారులు ఇండ్లలో పడుకొనియున్నారు. అప్పుడు మాముందే దేవాలయం తలుపులు తెరుచుకున్నాయి. నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. శ్రీ బాబుగారు కండ్లు మూసుకొని అక్కడున్న ఆంజనేయ స్వామి పటం ఎదుట కనులు మూసుకొని నిలుచున్నారు. అంతలో మందిరమంతా అనంతకోటి సూర్యుల తేజస్సుతో నిండిపోయినది. ఆ వెలుగు చూడలేక నా కనులు మూతపడినవి. అప్పుడు శ్రీ బాబుగారు ఎక్కడ ఉన్నారో ఏమైనారో నాకు తెలియలేదు. నా కాళ్ళు వణుకుచు వళ్ళు జలదరించినది. ఇంతలో నా కళ్ళు తెలిపిరిపడ్డాయి. శ్రీ రంగన్నబాబుగారు అంతరిక్షమునుండి గాలిలో క్రిందికి దిగుతున్నట్లు గోచరించసాగింది.

ఆ మహనీయుడు, నా ఎదుట నిలబడి "అయ్యగారూ ఇదిగో శ్రీరామచంద్ర ప్రభువుల వారు ప్రసాదించిన పండు" అంటూ నా దోసిట్లో పప్పర పనసపండంత పెద్ద బత్తాయి పండు పెట్టారు. అంత పెద్ద బత్తాయిపండు మనకెక్కడా కన్పించదు. ఈ పండును నన్ను నా భార్యను తినమని, ఆ పండుపైనున్న తొక్కు, గింజలు తిరిగి పొట్లము కట్టి తనకిమ్మన్నారు. మేమలాగే ఇస్తే వాటిని వారు తీసుకవెళ్ళి స్వయంగా క్రిష్ణకాలువలో కలిపేశారు. ఇలాంటి దివ్యమహిమను అనుభవించి దానిని మనము ఇతరులతో చెప్పేందుకు అంగీకరించేవారు కాదు. కనుక వారి మహాసమాధి పర్యంతమూ నేను అనుభవించి, ప్రత్యక్షంగా చూచిన విషయాలెవ్వరికీ చెప్పలేదు.

## 1947 లో పెసరట్టు ప్రసాదించుట

ఒకరోజు శ్రీ బాబుగారు మా ఇంటిలో ఉన్నారు. మావారు కాఫీ కలుపుతున్నారు. శ్రీ బాబుగారు నాకీరోజు కాఫీవద్దయ్యగారూ అన్నారు. వెంటనే బాబుగారు అట్టహాసముగా నవ్వుచూ నావైపు చూస్తున్నారు. వారి చేతిలో ఒక అరటాకులో పెద్ద పెనుమంత వెడల్పు పెసరట్టు ఉంది. అది ఘుమఘుమ వాసనలతో నులివెచ్చని పొగలతో ఉంది. వారు మా ఇంటికి వచ్చేటప్పుడు వట్టి చేతులతో వచ్చారు. మరిప్పుడీ పెసరట్టు ఎలా వచ్చింది. అయ్యగారూ ఈ రోజు శ్రీ రామచంద్రప్రభువులవారికి కొంచెము తలనొప్పి, పైత్యముగా ఉన్నదట. శ్రీ సీతామహాదేవిగారిని కామధేనువు నేతితో అల్లము, జీలకర్ర వేసి పెసరట్టు చేసివ్వమన్నారు. ఆ మహాతల్లి చేసి శ్రీ ప్రభువుగారికిచ్చింది. అప్పుడు ప్రభువులవారు "మన రంగడికి కూడా ఒక పెసరట్టు ఇవ్వమన్నారు. ఇది ఆ మహాతల్లి నాకొరకు చేసి ఇచ్చింది. ఇది ఇంకెవ్వరికీ పెట్టకూడదు.



ఎంతమంది ఉన్నా ఎవరికి ఇచ్చిన ప్రసాదం వారే తినాలి మరొకరికి పెట్టకూడదని శ్రీ రామదంద్ర ప్రభువు ఆజ్ఞ" అని బాబుగారు చెప్పి పెసరట్టు తిని నాతో స్కూలువరకు వచ్చారు. నేను స్కూలుకు వెళ్ళాను. వారు తన నిత్యకృత్యమైన నగర పర్యటనకు వెళ్ళారు. ఈ విధంగా శ్రీ రామచంద్రప్రభువుల నుండి ప్రసాదాలందు కొనడం శ్రీ బాబుగారికి ఒక దివ్య క్రీడగా ఉండేది.

## మాకు సంతాన ప్రాప్తికొరకు బంగారు గిన్నెలో పాయసము ప్రసాదించుట

1947 వ సంవత్సరములో ఒకరోజు శ్రీ రంగన్నబాబుగారు నాతో "అయ్యగారూ ఈ రోజు శ్రీ రామచంద్రప్రభువులవారు మీకు సంతాన ప్రాప్తి కొరకు పాయసమిస్తారట. మీరు భోజనము చేసుకొని రాత్రి 8 గంటలకు సిద్దముగా ఉండండి. నేను మీ దొడ్డివాకిలిగుండా వస్తాను. వాకిలి గడియవేయవద్దు. పాయసం విషయం ఎవ్వరికీ చెప్పవద్దు అని చెప్పి వెళ్ళారు.

అదేమి చిత్రమోగానీ, మహాలక్ష్మమ్మ మొదలైన భక్తులందరికీ నిద్రాదేవి ఆవేశించి తూగసాగారు. కనుక అందరూ మందిరంలో పాటలు పాడడం, ఆరతి ఇవ్వడం అన్నీ ఎనిమిదిగంటలలోపలే పూర్తిచేసి వారి వారి ఇండ్లకు వెళ్ళి భోంచేసి నిద్రపోయారు.

వారంతా అలా ఎనిమిది గంటలకే నిద్రపోవడం ఒక విషయం గుర్తుకొస్తుంది. శ్రీ కృష్ణజనన సమయంలో శ్రీ కృష్ణుని ఒక గంపలో పెట్టుకొని వసుదేవుడు జైలునుండి రేపల్లెకు తీసుకవెళ్ళి యశోద ప్రక్కన శ్రీ కృష్ణుని ఉంచి ఆమె ప్రక్కన నిద్రిస్తున్న

యోగమాయను గంపలో ఉంచుకొని జైలునకు తెచ్చినంతవరకూ జైలు కాపర్లు వగైరా అందరూ గాఢ నిద్రలో మునిగిపోయారట. ఇప్పుడు రాత్రి 8 గంటలకే అందరూ నిద్రపోవడం ఎంత చిత్రమో చూడండి.

శ్రీ బాబుగారు రాత్రి 7 1/2 గంటలకే "బాబుగారూ" అంటూ మా దొడ్డి వాకిలిగుండా వస్తున్నారు. వారి రాక మహాద్భుతముగా ఉన్నది. ఏమా బ్రహ్మావర్చస్సు, నుదుటిపైన, వక్షస్థలము మీద, రెండు బాహువులపైన, వెలుగొందు తిరుచూర్ణనామములు, కర్ణములకు మకరకుండలములలో దేదీప్యమానంగా వెలిగిపోతున్నారు. వారొక మహాయోగియా, లేక పరమేశ్వరుడా, లేక శ్రీ రామచంద్రప్రభువా అని తెలియకున్నది. వారి పాదములు భూమిని తాకుచున్నవా లేదా అని భ్రమగొల్పుచున్నవి.

ఆ మహనీయుడు మా గదిలో ప్రవేసించగనే వారికి పాదాభివందనమాచరించి వారిని పీటపై కూర్చోబెట్టి వారి ఎదుట మా దంపతులమిద్దరమూ కూర్చొంటిమి.

శ్రీ బాబుగారి చేతిలో నవరత్న ఖచితమైన బంగారు గిన్నె నిండా వేడి పాయసముండెను. ఆ దివ్యమైన గిన్నె కాంతి కనులను మిరుమిట్లుగొల్పుచుండెను. "అయ్యగారూ! పూర్వము దశరధ మహారాజు సంతానము కొరకు పుత్రకామేష్టి యాగము చేశారుగదా. అప్పుడు యజ్ఞపురుషుడు సాక్షాత్కరించి పాయసమిచ్చారుగదా. అదే విధముగా నేడు శ్రీ రామచంద్రప్రభువులవారు మీకు సంతానము కొరకు ఈ పాయసము ఇచ్చిరమ్మని పంపారు. అప్పటినుండి ఇప్పటివరకు పాయసము ఎవ్వరికీ లభించలేదు. ఇది మీ పూర్వజన్మసుకృత విశేషము. మీకు సంతానము కలుగుతుంది. మీ



దంపతులిద్దరూ చెరిసగము పుచ్చుకోండి. ఈ పాయసము కామధేనువు పాలు, అమృతము, అనేక ఔషధులు, జీడిపప్పు, కిస్మిస్ పండ్లు, ఏలకులు, కలిసి ఉన్నాయి. ఇది దేవలోకములో తయారు చేయబడి శ్రీ రామచంద్రప్రభువులవారు మీకొరకు పంపారు, అని చెప్పారు.

ఈ బంగారు గిన్నెను శ్రీ రామచంద్రప్రభువులవారు భోజనసమయమున ముందు పెట్టుకుంటారు. చారు, పులుసు, పాయసము, పాలు, పెరుగు మొదలగునవి ఉంచుకొనే గిన్నెలివి. ఇలాంటి గిన్నెలు ప్రభువులవారి దగ్గర లెక్కలేనన్ని ఉన్నాయి. ఈ ప్రపంచమంతా అమ్మినా, పధ్నాలుగులోకాలు అమ్మినా ఈ గిన్నె విలువకు సరిపోదు. నేను మరలా వచ్చి అడిగినంతవరకు ఈ గిన్నెను మీవద్దనే జాగ్రత్తగా ఉంచండి అని చెప్పి మా కావడి పెట్టెలో పెట్టించి బాబుగారు వెళ్ళిపోయారు

## పాయసము త్రాగినాక మాకు తాంబూలము ఇప్పించుట

మన ఇంటికి వచ్చిన అతిధులకువలె భోజనానంతరము తాంబూలము ఇచ్చినట్లు మాకు ఇమ్మని శ్రీ రామచంద్రప్రభువులవారు శ్రీ బాబుగారికి చెప్పారట. కనుక శ్రీ ఆంజనేయస్వాములవారిని మేరు పర్వతమునుండి లేత నగుర్రైన తమలపాకులు తెప్పించారు. అదిగో ఆంజనేయస్వామివారు తమలపాకులు, వక్కలు తెచ్చారు అని బాబుగారు అన్నారు. అంతే శ్రీ బాబుగారి చేతిలో 9 అంగుళాల వెడల్పు, 4 అంగుళాల తొడిమలు గల వెయ్యి తమలపాకులు ఉన్నాయి. ఆ తమలపాకులు తెచ్చి ఇచ్చిన శ్రీ ఆంజనేయస్వామి మాత్రం మాకు కనిపించలేదు. విక్టోరియా మహారాణి బొమ్మతో అప్పుడు వస్తున్న రాగి

నాణెములంత వైశాల్యముగల మూడువోకచెక్కలు, ఆకులు మా చేతిలో పెడుతూ మీ దంపతులిద్దరూ చెరిసగము సేవించండి. రాత్రికి సుఖమనుభవించి నిద్రపోండి. నేను తర్వాత ప్రభువుగారు అడిగినప్పుడు గిన్నెతీసుకపోతాను. అని చెప్పి బాబుగారు వెళ్ళిపోయారు.

## బంగారు గిన్నె అంతర్ధానమగుట - పుష్పకవిమాన దర్శనము

మాకు పాయసము ప్రసాదించిన బంగారు గిన్నె షుమారు రెండునెలలు మా ఇంట్లో కావడి పెట్టెలో ఉండెను. ఒకరోజు శ్రీ బాబుగారు రాత్రి పదిగంటలకు వచ్చి "బాబుగారూ శ్రీ రామచంద్రప్రభువులవారు బంగారు గిన్నె తెమ్మంటున్నారు, తీసుకురండి మనం పోదాము. అమ్మగారూ మీకేమీ భయములేదు. మీరిక్కడే ఉండండి" అని చెప్పారు. మేమా గిన్నె తీసుకొని మా ఇంటి దగ్గరున్న శ్రీ మార్కండేయస్వామి వారి దేవాలయమునకు వెళ్ళాము. శ్రీ బాబుగారు నా చేతిలోనున్న బంగారు గిన్నెను తీసుకొని కుడిచేతితో పైకెత్తి పట్టుకున్నారు.

అంతలోనే గింగురుమను శబ్దము, అనంతకోటి చంద్రకాంతుల వెలుగు, అందులో కనులు మిరిమిట్లు గొలుపు తళుక్కు, తళుక్కుమను మెరుపులు వచ్చాయి. ఆ మెరుపులకు నా కళ్ళు మూతపడ్డాయి. శరీరం గగుర్పాటుతో రోమాంచితమైనది. శ్రీ బాబుగారు ఏమయ్యారో నేనెక్కడున్నానో తెలియలేదు. మరలా నా కనులు తెలిపిరి పడుసరికి శ్రీ బాబుగారు అంతరిక్షమునుండి భూమిపైకి వస్తున్నట్లు దర్శనమైంది. దూరంగా పుష్పకవిమానం కనిపిస్తుంది.



"అయ్యగారూ భయపడ్డారా? ఏమీ భయము లేదు. ఆ అంతరిక్షములో పోయేది పుష్పకవిమానము, అందులో యోగీశ్వరులున్నారు. ఆ విమానము నడుచుటకు పెట్రోలు అక్కరలేదు. అది తపోశక్తితో అంతరిక్షములో వాయువేగముకన్నా వేగముగా పోతుంది. పాయసపు గిన్నె విమానములో ఉన్న యోగీశ్వరుల ద్వారా శ్రీ రామచంద్రప్రభువులవారికి పంపమని ఆజ్ఞ అయినది. కనుక వారికందజేసితిని. ఈ కలియుగములో పుష్పకవిమానము ఎవ్వరికీ దర్శనముకాదు. మీ జన్మ సుకృతమువలన దర్శనమైనది" అని చెప్పిరి. రాత్రి ఒంటిగంట అయినది. నేను మా ఇంటికి వెళ్ళాను. శ్రీ బాబుగారు మందిరములో పవళించారు.

## శ్రీ రామచంద్రప్రభువుల వారు ఒక కథను శ్రీ రంగన్నబాబుగారికి చెపితే, బాబుగారు ఆ కథను భక్తులకు చెప్పుట

ఒకరోజు రాత్రి 9 గంటల తర్వాత మందిరములో అందరూ ఇండ్లకు వెళ్ళారు. నేను, నాభార్య, శ్రీ బాబుగారు ఉన్నాము. "బాబుగారూ భగవంతుడు భక్తులను పరీక్షిస్తుంటారు. వారిని కాపాడుతూ కూడా ఉంటారు. భగవంతుడు పరీక్షచేసేమాట వాస్తవమే. భక్తులలో కూడా హేమాహేమీలుంటారు. ఈ పరీక్ష చేసినకథ కొన్ని వేల సంవత్సరముల క్రిందట జరిగింది. ప్రభువులవారు ఈ కథను నన్ను మీకు చెప్పమనుచున్నారు.

సప్తసముద్రాల అవతలగల ఘోరారణ్యములో ఒక యోగీశ్వరుడు తపస్సు చేస్తుంటే నిత్యమూ భగవంతుడే స్వయముగా మధ్యాహ్నం 12 గంటలకు ఆ యోగీశ్వరునకు ఆహారం తెచ్చి, వారది భుజించునంతవరకు అక్కడే ఉండి వెళ్ళేవారు. అప్పుడు శ్రీ

బాబుగారు "స్వామీ! మీ కంటే వేరుగా భగవంతుడనే దేవుడెవరు? అని ప్రశ్నించారు. నేనేననుకో ఓయ్ అని సమాధానము చెప్పాడట. ఒకరోజు శ్రీ ప్రభువులవారు శ్రీ సీతామహాదేవితో చదరంగమాడుతూ భక్తునికి ఆహారం పెట్టేమాట, సాయంకాలం వరకు మరచిపోయారు. అయ్యో ఎంతపొరపాటు పని జరిగినది. నా భక్తునికి ఆహారం పెట్టడం మరచిపోయానే అని భయమూ విచారము వ్యక్తం చేశారు. అప్పుడు సీతామహాదేవి "స్వామీ! పిపీలికాది బ్రహ్మాపర్యంతము మనచేతిలో నుండగా భయమేల" అని పలికింది.

అంతట ప్రభువులవారు "సీతా! అంతటి మహాభక్తునకు కోపము రానేరాదు. ఒకవేళ కోపమువచ్చి కండ్లెర్రజేసిన వారి దృష్టి పడినమేరకు మాడి దగ్ధమవవలసిందే. అప్పుడు మనకు, ప్రపంచమునకు చాలా కష్టము కదా? వత్సా, నీకేమి వరము కావలెను, శాంతించుము అని అడుగుటకు అప్పుడైనా మనము వారి దగ్గరకు పోకతప్పదు. కానీ భక్తులకు తపోభంగము కలుగనీయక రక్షించుట మనధర్మము, అని చెప్పారు.

స్వామీ! మీ కంత భయమైతే నేనే వెళ్ళి ఆ భక్తునికి ఆహారం పెట్టివస్తానని చెప్పి బంగారు పళ్ళెములో ఆహారము, వెండి చెంబుతో నీరు తీసుకొని ఆ భక్తుని ఎదుట సాక్షాత్కరించెను. ఆ భక్తుడు దివ్యసమాధి నిష్ఠలోనుండుటచే ఎన్నిసార్లు పిలిచినా కండ్లు తెరువలేదు. పలుకలేదు. పెద్దగా పలుమార్లు అరిచాక నిదానంగా కండ్లు తెరచెను. ఆ మహనీయుని దృష్టి సీతా మహాదేవి యొక్క పాదములపైబడెను. వారు తన తలపైకెత్తకనే "ఎవరమ్మా నీవు, ఇక్కడకెందుకొచ్చావు?" అని అడిగారు. అందుకు సీతమ్మ తల్లి "నీకు నిత్యమూ ఆహారమిచ్చే ఆయన భార్యను. ఈ రోజు ఆయన



నన్ను పంపారు. ఆహారము స్వీకరించండి" అని పలికెను. అందులకా మహనీయుడు "నీవెందుకు తెచ్చావమ్మా, పిపీలికాది బ్రహ్మాపర్యంతమూ నీచేతిలో ఉంటే నీకేమిభయము. వస్తే వాడే వస్తాడులే. ఇప్పుడు మించిపోయిందేమీలేదు. వెళ్ళమ్మా వెళ్ళు" అంటూ మరలా కనులు మూసుకొని తపస్సమాధిలోనికి వెళ్ళాడు. సీతామహాదేవి వెనుతిరిగి ప్రభువులవారి దగ్గరకు వచ్చెను.

అప్పుడు ప్రభువులవారు "ఏమి సీతా నా భక్తుడు క్షేమముగా యున్నాడా. ఆహారము స్వీకరించాడా అని కంగారు భయమూ నటిస్తూ ప్రశ్నించాడు. ప్రభూ ఆ మహాభక్తుడు నా వంక కన్నెత్తియైననూ చూడలేదు" అని అక్కడ జరిగిన సంభాషణంతా యధాతథంగా చెప్పారు. ప్రభువులవారే స్వయముగా ఆహారము తీసుకొని భక్తుని ఎదుట ప్రత్యక్షమయ్యారు. భగవంతుని జాడ భక్తులకు తెలుసునన్నట్లు భక్తుడు కండ్లు తెరచి ప్రభువునుండి ఆహారం తీసుకొని తినుచుండెను. ప్రభువులవారు "ఈ రోజు చాలా ఆలస్యమైనది. ఏమీ అనుకోకురా" అని పలికెను. "అంతా మీ దయ. నాకదేమీ లేదు. భగవంతుడు జీవులకు, ఏ కాలమునకు ఆహారమందజేయునో ఆ కాలమునకే అందించును. భగవంతుని లీలలు అర్థము చేసుకోలేము. నాకదేమీలేదు ప్రభువు అనెను. ప్రభువులవారు సీతమ్మ దగ్గరకొచ్చారు. అపుడామె "పిపీలికాది బ్రహ్మాపర్యంతము మనచేతిలోనుండగా భయమేల అని నేనన్నమాట ఆ భక్తునకెలా తెలిసింది" అని అడిగింది. భక్తుని హృదయం భగవంతునికి, భగవంతుని హృదయము భక్తునికి తెలియదా? వాళ్ళిద్దరికీ భేదమేలేదు, వారికి భూత భవిష్యత్ వర్తమాన కాలములన్నియూ తెలియును. భగవంతుని కటాక్షముచే వారా విషయములు గ్రహింతురు. అని పలికెను. ఈ కథ

పూర్తియగుసరికి రాత్రి 2 గంటల కాలమైంది. మేము ఇండ్లకు వెళ్ళాము. శ్రీ బాబుగారు మందిరంలో శయనించిరి.

ఒకరోజు రాత్రి 8 గంటలకు నేను నాభార్య శ్రీబాబుగారు మాత్రమే మందిరములో ఉన్నాము. "అయ్యగారూ శ్రీ ప్రభువులవారు మీకొక పుస్తకమిస్తారట. చదువుతారేమో అడుగమంటున్నారు" అనిచెప్పారు. నేను ముందు వెనుక ఆలోచించకుండా "వారివ్వాలేగానీ ఏ పుస్తకమైనా చదువుతాను, ఇవ్వమనండి" అని డాంబికముగా పలికితిని. నా సమ్మతిని ప్రభువులవారు విని "నేను పుస్తకము ఇచ్చినంతవరకు శ్రీ నరసింహ శతకములోని పద్యములు మరియు బ్రహ్మంగారి కాలజ్ఞానము చదువమను" అని ఆజ్ఞాపించిరి. ఈ రెండు పుస్తకములు పూర్తియగుసరికి రాత్రి 11 గంటలు అయినది.

శ్రీ బాబుగారు హఠాత్తుగా లేచి శ్రీ కోదండరామస్వామి వారి ఫోటో దగ్గరకు వెళ్ళి చేతులు పైకి చాపి నిలబడిరి. వెంటనే దేదీప్యమానమైన వెలుగు ఆవరించినది. ఆ వెలుగును చూడలేక నా కనులు మూతపడినవి. నేను కనులు తెరుచుసరికి "అయ్యగారూ ఇదిగో పుస్తకము" అంటూ నా చేతులలో ఒక గ్రంథముంచారు. "బాబుగారూ ఈ గ్రంథము నేను మోయలేనంత బరువుగా ఉంది. ఇంతటి పవిత్రగ్రంథాన్ని క్రిందపెట్టలేను" అని చెపుతుండగానే శ్రీబాబుగారు "అయ్యగారూ భయపడకండి. తేలికగా ఉంటుంది" అంటూ నా వీపు నిమిరారు. వెంటనే అంతటి బరువుగల గ్రంథము చాలా తేలికైపోయింది.

ఆ గ్రంథాన్ని ప్రభువులవారు చదువమంటున్నారని శ్రీ బాబుగారు చెప్పడంతో ఆ గ్రంథంవైపు దృష్టి సారించాను. ఆ



గ్రంథము పైన శ్రీ మద్వాల్మీకి రామాయణము అని వ్రాయబడి ఉంది. ఆ గ్రంథము పొడవు 2 అడుగు, వెడల్పు 1½ అడుగు ఉంది. మానవలోకంలోని ఐదు రామాయణ గ్రంథములు కలిపి కుట్టినంత లావుగా ఉంది. అట్ట తళతళ మెరుస్తుంది. అక్షరములు ఆంధ్రలిపిలోనే ఉన్నాయి. క్రింద సంస్కృతలిపిలో కూడా అక్షరములు గలవు. ఈ అక్షరములు బంగారు తీగలతో తీర్చినట్లు తళతళమెరుస్తున్నాయి. లోపలి కాగితములు తెలుపు, గులాబిరంగు, పసుపు పచ్చని రంగులలో ఉలిపిరి కాగితములవలెయున్నవి. ఈ గ్రంథములో అట్టపైన మాత్రమే ఆంధ్రభాషాక్షరములున్నాయి. మిగిలిన గ్రంథమంతా స్వర్ణాక్షరములలాగ సంస్కృతభాషలో ఉంది. ఈ పవిత్ర గ్రంధాన్ని నేననుకున్నట్లు చదువలేనని నిర్ఘాంతపోయి ఆందోళన, భయములు ముప్పిరిగొన బాధపడుచుంటిని.

"అయ్యగారూ శ్రీరామచంద్రప్రభువులవారు పుస్తకము చదువమంటున్నారు" అని చెప్పగానే నాకళ్ళ నీళ్ళాగలేదు. "బాబుగారు! ఏ పుస్తకమిచ్చినా చదువుతానని అహంకారముతో చాలా పొరపాటు మాట పలికాను". నేను సంస్కృతము చదువలేను. నా అపరాధాన్ని క్షమించి రక్షించమని శ్రీరామచంద్రప్రభువుల వారికి విన్నవించమని దీనంగా వేడుకున్నాను. ప్రభువులవారు నామాట విని "తన శక్తి సామర్ధ్యములు తెలిసికొనక, ముందు వెనుక ఆలోచించక తొందరపడి ఎట్టిమాటలు పలుకరాదు". సరే పుస్తకము ఇచ్చివేయమని చెప్పమని శ్రీ రంగన్న బాబుగారికి చెప్పారు. బాబుగారు ఈ మాట నాకు చెప్పగానే "బాబుగారు! ఈ పవిత్ర గ్రంథమును మొదటి నుండి చివరిపేజీవరకు పరిశీలించి చూచుటకు అనుజ్ఞఇచ్చిరి".

శ్రీ బాబుగారు, నేను, నాభార్య గ్రంథమును పరిశీలించుచున్నాము. అందులో 360 బొమ్మలున్నాయి. అయోధ్యాపురవర్ణనము నుండి లవకుశ పట్టాభిషేకము వరకు వివిధ ఘట్టాలు బొమ్మలరూపంలో చిత్రీకరించారు. ఈ బొమ్మలు ధగధగ మెరుస్తూ వాటి అందము వర్ణనాతీతముగా ఉంది. 270 బొమ్మలు చూచుసరికి రాత్రి ఒంటిగంట అయినది. మిగిలిన 90 బొమ్మలు చూచుసరికి మరలా అర్ధగంట కాలము ప్రభువులవారినడిగి తీసుకొని గ్రంథమంతయు దర్శించగలిగాము.

## శ్రీమద్వాల్మీకి రామాయణము అదృశ్యమగుట

ఆ గ్రంథమును మందిరములో ఉంచి తాళము వేసికొని వెళ్ళి మరలా శ్రీ రంగన్నబాబుగారే వచ్చి మందిరము తెరువవలెనని ప్రభువులవారు ఆజ్ఞాపించిరి. మేమట్లే చేసి తెల్లవారి శ్రీ రంగన్నబాబుగారు మందిరతాళముతీసి చూస్తే ఆ గ్రంథము మందిరములో లేదు. శ్రీ ప్రభువులవారా గ్రంథమును తీసుకవెళ్ళారని చెప్పారు. ఈ గ్రంథము శ్రీ రామచంద్రప్రభువులవారి లీలావతారచరిత్ర. వారప్పుడప్పుడు ఈ గ్రంథము చూస్తూ, చదువుతూ ఉంటారు. మీ జన్మ సుకృతముచే మీరా పవిత్రగ్రంథాన్ని చూడగలిగారు, అని బాబుగారు చెప్పారు.

## శ్రీ కృష్ణాష్టమినాడు శ్రీ కృష్ణుని పటములో వెన్నపూసదృశ్యం

ఒకరోజు ఉదయము 10 గంటలకు దీపారాధన, పాటలు పూర్తయినవి. శ్రీ బాబుగారితోటి అందరమూ మందిరములో కూర్చొనియున్నాము. శ్రీ బాబుగారు నేత్రములు మూసుకొని ధ్యానములోనుండిరి. వారు కండ్లు తెరిచి "శ్రీ కృష్ణపరమాత్మ



నోటికి వెన్నపూసి ఉన్నది. మీరెవరైనా చూచారా?" అని అడిగారు. వారు చెప్పువరకు మేమెవ్వరమూ చిత్రపటంవైపు చూడలేదు కనుక చూడలేదండీ అని చెప్పాము. అప్పుడు మేము పటము వైపు చూస్తే వెన్నపూస ముద్ద శ్రీ కృష్ణుని నోటికి పెట్టబడియుండెను. అప్పుడు శ్రీ బాబుగారు "ఆ వెన్నపూస ముద్దను తీయరాదు. ఆ స్వామివారే ఆరగిస్తారు. ఈ రోజు శ్రీ స్వామీవారి పుట్టినరోజు గనుక దేవతలే అక్కడ వెన్న ఉంచారు" అని సెలవిచ్చారు.

## శ్రీ రామచంద్రప్రభువుల వారు శ్రీ వశిష్ట మహర్షిద్వారా యజ్ఞోపవీతము తయారుచేయించి ఝంఝాల పౌర్ణమి (శ్రావణ పౌర్ణమి) నాటికి ప్రసాదించుట 1947

ఒకరోజు నేను శ్రీ రంగన్నబాబుగారు మందిరములో నున్నాము. అయ్యగారూ ఝంఝాల పౌర్ణమి ఏ మాసములో వస్తుంది ? అని అడిగారు. శ్రావణమాసంలో వస్తుందని చెప్పాను. ఆ తర్వాత ఒకనెల రోజులకు శ్రావణమాసం వచ్చింది. శ్రావణపౌర్ణమి ఎల్లుండి అనగా శ్రీ బాబుగారు నన్ను పిలిచి "అయ్యగారూ రేపటిరోజున వశిష్ఠమహర్షివారిచేత యజ్ఞోపవీతము తయారుచేయించి మీకు ప్రభువులవారు ఇస్తారట. దానిని మీరు ఝంఝాల పౌర్ణమినాడు ధరించాలని ప్రభువులవారు చెపుతున్నారు", అని చెప్పారు. పౌర్ణమిరోజున ఉదయం 6 గంటలకే శ్రీ బాబుగారు మందిరానికి వచ్చారు. అప్పటికే నేను స్నానము చేసి రెడీగా ఉన్నాను. శ్రీ బాబుగారు నేను నిలుచొని ఉన్నాము. శ్రీ బాబుగారి చేతిలోనికి తళుక్కునమెరసి ఝంఝము చేతిలోనికి వచ్చింది. వారది నాచేతికిచ్చి ధరించమన్నారు. నేను దానిని ధరించి జపముచేసికొన్నాను.

**కుమార జన్మ వృత్తాంతము** 1948 వ సంవత్సరము. శ్రీ రామచంద్ర ప్రభువులవారు అనుగ్రహించిన పాయసము త్రాగిన రెండు నెలలకు నా భార్య గర్భం ధరించింది. ఈ విషయం నేను శ్రీ బాబుగారికి చెప్పగా వారు శ్రీ రామచంద్రప్రభువుల వారిని అడిగారు. అందులకు ప్రభువులవారు "ఔను గర్భం ధరించింది. మగపిల్లవాడు పుడుతాడు. మంచి నడవడికగల్గి పెద్ద ఉద్యోగం లేకున్నా సామాన్యమైన ఉద్యోగం చేస్తాడు. పెద్దల ఎడల వినయవిధేయతలుగల్గి వంశమును ఉద్ధరిస్తాడు. తల్లిదండ్రుల ఎడల ప్రేమ, భక్తి విశ్వాసములు కల్గి వారిని పోషించును" అని చెప్పారు. స్వస్తిశ్రీ చాంద్రమాన సర్వధారి నామ సంవత్సర చైత్రశుద్ధ 8 శుక్రవారం తెల్లవారుఝామున 3.30 గంటలకు పుష్యమీ నక్షత్ర ప్రథమ చరణమునందు అనగా తెల్లవారి శ్రీ రామనవమి అనగా జన్మించాడు. ఆ బిడ్డపేరు దేవులపల్లి వెంకట సీతారామాంజనేయ సుబ్రహ్మణ్య లక్ష్మీ నరసింహాశర్మ అని పెట్టాము.

## కుమారుని పుట్టినరోజున సీతామహాదేవి పేరంటమునకు వచ్చుట

మా కుమారుడు జన్మించి సంవత్సరము అయినది. పుట్టినరోజు పండుగచేయబోతూ ముందురోజు శ్రీరామ పట్టాభిషేక పటములోని శ్రీ రామచంద్రప్రభువులవారికి సీతమ్మగారికి కుంకుమబొట్టుపెట్టి "ఓ తల్లీ మా కుమారునికి రేపటిరోజున పుట్టినరోజు పండుగ. తమరు తప్పక పేరంటమునకు రావలెనమ్మా" అని మా భార్య ప్రార్థించినది. నాటి సాయంకాలము శ్రీ బాబుగారు వచ్చి నా భార్యతో "అమ్మగారు! మీ ఇంటికి ఈరోజు శ్రీ సీతామహాదేవి పేరంటమునకు వచ్చి పళ్ళెములోని శెనగలు తీసుకొని వెళ్ళారు అని చెప్పారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరము



శ్రీ సీతామహాదేవిగారు వచ్చి శెనగలు తీసుకపోవడము, అరటిపండ్లు చేతి వేళ్ళతో గుచ్చినట్లు నిదర్శనము కన్పించేది.

5వ సంవత్సరములో జరుగు పుట్టినరోజు నాడు పేరంటాళ్ళకంటే ఒక అరగంటముందుగానే శ్రీ రంగన్నబాబుగారు వచ్చారు. "అమ్మగారూ! ఈరోజు మీ ఇంటిలో జరుగు పేరంటమునకు శ్రీసీతామహాదేవిగారు వస్తారట. నన్ను మీకు చెప్పమన్నారు అని చెప్పారు.

సాయంత్రము ఆరు గంటలకు అబ్బాయిని కుర్చీలో కూర్చుండబెట్టిరి. ఇంతలో మా పెద్దక్క మా చిన్నక్కలమధ్య మనిషి వచ్చి కూర్చున్నట్లుగా నా భార్యకు లీలగా కన్పించింది. అంతట నా భార్య ఆ దృశ్యము చూచుచూ మనస్సులో "అమ్మా తల్లీ వచ్చినారా! అని అనుకొనుచు ఆత్మలోనే నమస్కరించుకున్నది".

పేరంటాళ్ళపాటలు పాడి హారతి బిడ్డకు కళ్ళ కద్దు సమయమున మా అక్కల మధ్యకూర్చున్న వ్యక్తి వచ్చి హారతిని మొదట పిల్లవాని కళ్ళకద్దినది. అక్షింతలు తలపై వేసి ఆశీర్వదించినది. ఈ దృశ్యమంతయూ నా భార్య స్పష్టముగా చూస్తుంది. అప్పుడు శ్రీ సీతామహాదేవి పసుపు పచ్చని చీర, ఎర్రని రవిక ధరించి కాళ్ళకు మెట్టెలు, పట్టాలు ధరించియున్నారట. మా అక్కలమధ్య కూర్చున్న శ్రీ సీతామహాదేవికి వాయనము ఇచ్చుటకు పళ్ళెములో తమలపాకులు, పళ్ళు, శెనగలు పోసి ఆమె ముందుకు వెళ్ళి ఆత్మలో నమస్కారము చేయుచు నిలబడింది. మా అక్కలు తమకేముందుగా వాయనము ఇస్తుందని తలచి "అమ్మాయీ పెద్దవారికి ముందు వాయనమివ్వు" అని చెప్పుచుండగా శ్రీ సీతామహాదేవిగారు చేతితో శెనగలు, పండ్లు తాకినట్లు దృశ్యము

కనిపించింది. వెంటనే ఆమె అంతర్ధానమైంది. ఈ విషయము అచ్చటనున్న మరే ఇతరులకు కనిపించలేదు. శ్రీ బాబుగారు మరలా వచ్చి "శ్రీ సీతామహాదేవిగారు మీ ఇంటికి పేరంటానికి వచ్చారని చెప్పారమ్మా" అని చెప్పి నా భార్యకు కనిపించిన దృశ్యము భ్రమకాదని రూఢీచేశారు.

## 5వ సంవత్సరములో మాకుమారుని అక్షరాభ్యాసము - టైఫాయిడ్ జ్వరము వచ్చుట - శ్రీ ఆంజనేయస్వామి వారి ద్వారా తీర్థము పంపుట 1953

1953 వ సంవత్సరములో నా కుమారునికి ఐదు సంవత్సరముల వయసు. పుట్టినరోజు పండుగ తర్వాత 15 రోజులకు టైఫాయిడ్ జ్వరము వచ్చినది. మొదట 21 రోజులు లంకణములు వేశాము. ఘనపదార్ధము ఆహారముగా పెట్టకుండా ద్రవపదార్ధమే ఇవ్వడం. పత్యము పెట్టగానే మరలా జ్వరము రాసాగింది. ఈ దఫా 24 రోజులు లంకణములు పెట్టాము. అప్పుడు డాక్టరుగారి మందులు వాడుతూనేయున్నాము. చీరాలలో ఉన్న బాబుగారికి అబ్బాయి జ్వరము గురించి జాబువ్రాశాను. బాబుగారు, తిరుగుటపాలో లెటరు వ్రాయించారు. శ్రీ రామచంద్రప్రభువులవారు విభూది తీర్థము ఇస్తారట. ఏమీ భయములేదు. కంగారుపడనవసరం లేదు. ఏమీ పరవాలేదని లెటరు వ్రాయించారు.

ఈ లెటరు చేరిన నాలుగురోజులకు రాత్రి మూడు గంటలకు మేము పిల్లవాని మంచంమీదనే కూర్చొనియున్నాము. పిల్లవాడు నిద్రలేచి "అమ్మా నా గొంతులో నీళ్ళెందుకు పోశావు. నేనే లేచి త్రాగేవాణ్ణికదా?" అని మరలా నిద్రపోయాడు. "సరే నాయనా ఇంకొకసారి అలాగే లేపి తాపిస్తాలే పడుకో" మన్నది. మరికొంత సేపటికి పిల్లవాడు పూర్తి మెలకువతో లేచి కూర్చొని "అమ్మా, నాన్నా ఇందాక నా గొంతులో ఎవరో ఒకాయన నీళ్ళుపోశాడు, నా మంచం చుట్టూ తిరిగి నా వళ్ళంతా విభూతి పూసి అట్లాగే లేచి గాలిలో పైకెళ్ళిపోయాడు. ఆయనకు చిన్న తోకకూడా ఉంది" అని చెప్పాడు. శ్రీ బాబుగారు జాబు వ్రాయించినమాట ప్రకారం శ్రీ ఆంజనేయ స్వాముల ద్వారా తీర్థప్రసాదాలు పంపారు. తెల్లవారి నుండి పిల్లవాని జ్వరం పూర్తిగా తగ్గిపోయి మరలా రాలేదు.

## 1956 వ సంవత్సరములో ఒక మహాత్ముని దర్శనము

ఒకరోజు మధ్యాహ్నం 3½ గంటల కాలములో ఒక అంధుడు భుజాన దర్భాసనము తగిలించుకొని చేత కర్రపట్టుకొని అంగళ్ళ దగ్గర "భవతీ భిక్షాం దేహి" అని అడుగుచూ శ్రీ వక్కలగడ్డ తాతయ్యగారి కొట్టు వద్దకొస్తే వారొక పావలా ఇప్పించి పంపారు. ఆయన వెళ్ళిన పది నిమిషాలకు శ్రీ వక్కలగడ్డ తాతయ్యగారు ఆ అంధుని మరలా పిలిపించి వారి ఊరి పేరు, భోజనము చేసిన విషయాలు అడిగారు. వారి గ్రామం ఢిల్లీ అవతల ఏదో ఊరని చెప్పారు. తాను పదకొండు రోజులకు ఒకసారి భోంచేస్తానని, మిగిలినప్పుడు పండ్లనే ఆహారంగా తీసుకుంటానని, ఈరోజు భోంచేయాలని చెప్పారు. హోటలుకెళ్ళమంటే హోటలులో గాని ఇతరుల ఇండ్లలో గాని భోంచేయనని, బ్రాహ్మణులు - తన శాఖ వారయితే భోంచేస్తానన్నాడు. శ్రీ తాతయ్యగారు మనిషిని పంపి నా భార్యను అడిగిస్తే ఆమె తెలగాణ్యపు శాఖ అని చెప్పినది. కనుక శ్రీ తాతయ్యగారు ఆ అంధుని అంగీకారముపై మా ఇంటిలో భోజనమునకు ఏర్పాటు చేశారు. సమీపమునగల శ్రీ మార్కాండేయస్వామి వారి దేవాలయములో ఉండి స్నాన

సంధ్యానుష్టానములు పూర్తిచేసుకొని రాత్రి 8 గంటలకు భోజనానికి వస్తానని కబురుచేశారు. నా భార్య ద్వారా విషయము తెలిసికొని నేను వారి రాకకొరకు ఎదురు చూచుచుంటిని. శ్రీ తాతయ్యగారి అంగడిలో గుడ్డలు కుట్టే వెంకటేశ్వరరావు ఆ అంధుడైన అతిధిని రాత్రి 8 గంటలకు మా ఇంటికి తీసుకువచ్చాడు. వారు రాగానే నా పేరు, గోత్రము, శాఖ వగైరా అడిగారు. నాపేరు కృష్ణమూర్తి, ఇంటిపేరు దేవులపల్లి, కౌండిన్యస గోత్రం, వైదిక బ్రాహ్మణులము, తెలగాణ్యపుశాఖ అని చెప్పాను.

వారి వివరాలు అడిగాను. వారు హిందుస్థానీలో మాట్లాడుట వలన వెంకటేశ్వరరావు నాకాయన మాటలు తెలుగులోకి తర్జుమా చేసి చెప్పాడు.

వారిది ఢిల్లీ అవతల చిన్న పల్లెటూరని, వారికొక అన్నగారు మాత్రమున్నారని, తనకు వివాహము కాలేదని బ్రహ్మచారినని, తను అంధుల పాఠశాలలో B.A. వరకు చదువుకున్నాననీ, తాను రైలు, కారు, బస్సు మొదలగు ఏ వాహనమూ ఎక్కలేదని, తాను పదకొండురోజులకు ఒకసారి భోంచేస్తానని, మిగిలిన రోజులలో పండ్లు తీసుకుంటాననీ ఈ రోజు భగవంతుడు మీ ఇంట్లో భోజనము ఏర్పాటు చేశాడనీ చెప్పాడు.

వారు భోజనము చేయుచుండగా నా భార్య నెయ్యి వంచినది. నేను వారి విస్తరిలోని పదార్థముల పేర్లు చెప్పుతూ విసనకర్రతో విసురుచుంటిని. భోజనమయ్యాక తాను చిన్నప్పుడు "మా తల్లిగారి ఒడిలో కూర్చొని అన్నం తిన్న అనురాగమును మరిపించుచున్నదమ్మా మీ ఆప్యాయత, అనురాగము, ప్రేమ.



మిమ్ములను దేవుడు చల్లగా కాపాడాలని ప్రార్థిస్తున్నాను" అని పలికారు.

రేపు వేకువఝామున 5 గంటలకు వెళ్ళిపోతాను. నన్ను పంపటానికి మీరు వస్తారా? అని అడిగారు. తప్పకవస్తాను స్వామీ అని చెప్పాను. వారు శ్రీ తాతయ్యగారింటికి వెంకటేశ్వరరావుతో వెళ్ళారు. నేను వేకువఝామున 4 గంటలకే తాతయ్యగారింటికి వెళ్ళాను. నేను తాతయ్యగారు వారి వెనకాలే పోతున్నాము. ఆయన ఏలూరు మెయిన్ బజారు రోడ్డునుండి పాండురంగ సినిమా హాలు రోడ్డునగల వంతెన వద్దకు వచ్చి కాలువగట్టున నడవసాగిరి.

స్వామీ ఈ కాలువగట్టున పాములపుట్టలు ఎక్కువ, మార్గము సరిగాలేదు. చీకటిగా ఉన్నది. ఎలా పోతారు అంటిమి. పుట్టలయితేనేమి? ఏమైనా పర్వాలేదు. ఆ సర్వేశ్వరుడు నడిపించిన మార్గాన్నేపోవాలి. మీరు ఇండ్లకుపొండి అని చెప్పారు. మేము వెనుకకు తిరిగి రెండు గజములు నడిచి వెనుతిరిగి చూస్తే ఆమహనీయుడు కనిపించలేదు. మేము రెండు గజములు నడిచి వెనుకకు తిరిగితే ఆ మహనీయుడు కనిపించలేదంటే వారెంతటి మహనీయులో తెలుస్తుంది.

ఈ విషయం శ్రీ రంగన్నబాబుగారికి చెపితే - ఈ ప్రపంచములో అనేకమంది మహనీయులున్నారు. పూర్వజన్మలో ఈయన గొప్ప తపస్వి. తపోభంగమై ఇలా వచ్చాడు. ఆయన చాలా గొప్ప మహాత్ముడు. ఇటువంటి మహాత్ముల దర్శనము దొరకుట దుర్లభము. శ్రీ రామచంద్రప్రభువులవారే ఈ రూపములో రావచ్చును. వారే వచ్చి ఆరగించి వెళ్ళారని

అనుకుందాము.  వాడే వీడు, వీడే వాడు.  అంతా వారి దయ అని పలికిరి.

## నాగరాజు దర్శనము - హత్యానేరము శిక్ష 1958వ సంత్సరము

ఒక జానెడు పొడవుగల పాము - సప్తవర్ణములతో ధగ ధగ మెరియుచు మంచి తేజస్సుతో, మా పూజగదిలోనికి పోవుచున్నది. చంపి పారవేయకుండా చూస్తూ ఊరకుంటారేమిటండీ అని నా భార్య అరవడం మొదలుపెట్టింది. నేను కర్రతో ఒక దెబ్బ కొట్టగానే అది చనిపోయింది.  దానిని కర్రమీదకు దోసుకొని సైడుకాలువ గట్టున పడేసి ఇంట్లోకి రాగానే మరొక సర్పము అదే సైజు అదే వర్ణములుగలిగి అది కూడా పూజగృహంలోకి పోతుంది.  కర్రతో కొట్టబోవు సరికి ఆ పాము కావడి పెట్టెక్రిందకు వెళ్ళింది.  కావడి పెట్టె జరిపి చూచాము.  ఇంట్లోని ప్రతి వస్తువు, వంటిల్లు, దేవునిగది అంతా వెతికినా కనిపించలేదు.  నాకు అనుమానము వచ్చి బయట సైడు కాలువగట్టుపై పారేసిన పాము ఉందేమోనని చూచాను, అది అక్కడలేదు.  అచ్చట నాగరాజు ఇచ్చట నాగరాజు ఒక్కటే, సందేహములేదు.  ఈ విషయము శ్రీ రంగన్నబాబుగారికి చెప్పాలనే ఉబలాటము మొదలైంది.

అప్పుడు శ్రీ బాబుగారు చీరాలలో ఉంటున్నారు. దైవసంకల్పముచే నా ఆతృత గుర్తెరిగిన శ్రీ బాబుగారు మరురోజు ఏలూరు వచ్చారు.  నేను నిన్నటి నాగరాజును చంపడం, పాములు అదృశ్యంకావడం గురించి వారికి విన్నవించాను.  "అయ్యగారూ! ఆ పాముపై ఒక బట్టకప్పి బయట పారవేయకపోయారా" అని బాబుగారన్నారు.  మాకంత ధైర్యము లేదండి అన్నాను.  ఈ విషయము శ్రీ బాబుగారు ప్రభువులవారికి మనవిచేయగా



"అవునోయ్ నేనే నాగేంద్రుని కృష్ణమూర్తిగారింటికి వెళ్ళిరమ్మన్నాను. వారిని నేను నాగేంద్రుని కొట్టమన్నానా?" అన్నారట.  "స్వామీ కృష్ణమూర్తి గారు వారెవ్వరో తెలుసుకోలేక, మనస్సుకు ధైర్యములేక దుష్టపురుగని భ్రమించి కొట్టారు.  చాలా బాధపడుచున్నారు. ఏదైనా ప్రాయశ్చిత్తము తెల్పి వారిని క్షమించండి స్వామీ" అని ప్రార్థించారు.  "ఈరోజు కృష్ణమూర్తిగారు కాఫీ, భోజనము లేకుండా ఉపవాసముండాలి, వారి భార్య కాఫీ త్రాగి అన్నం తినకుండా ఉపవాసముండాలి.  మరునాడు నాగపడగ వద్ద పాలుబోసుకొని, చలిమిడి, చిమ్మిరి, వడపప్పు నివేదించమను.  ఒక బ్రాహ్మణునకు భోజనము సమర్పించి వారిని భోంచేయమని చెప్పు" అని ప్రాయశ్చిత్తము తెల్పినారు.  మేమావిధముగా చేసి పాప విముక్తులమయ్యాము.

## శ్రీ రామచంద్రప్రభువులవారు శ్రీ రంగన్నబాబుగారి రూపములో మా యింటిలో దర్శనమిచ్చుట 1958వ సంవత్సరము

ఒకరోజు సాయంత్రం 5 గంటల సమయంలో ఎవరో గుమ్మము దగ్గరుండి "సత్యవతమ్మగారూ, సత్యవతమ్మగారూ, కృష్ణమూర్తిగారు లేరా? బడినుండి ఇంకా రాలేదా? ఎప్పుడు వస్తారు?" అని అడుగుచున్నారట.  నా భార్య గుమ్మము వద్దకు వస్తూ 7, 8 గంటలకు గానీ రారండీ అంటూ బయట చూచింది. "అయ్యో మీరా రండి, రండి అని బాబుగారిని ఆహ్వానించి చాపపరచగా కూర్చున్నారు.  వెంటనే వారు అహహ్ అని నవ్వి ఈరోజు కృష్ణమూర్తిగారు ప్రవేటు చెప్పరు.  5 లేక 10 నిమిషాలలో ఇక్కడకు వస్తారు చూస్తుండండి" అని చెప్పారు.  ఈ రోజేమిటి బాబుగారు ఇట్లా మాట్లాడుచున్నారనుకుంటూ ఉంది.  అంతలోనే నేను ఇంటికి వచ్చి శ్రీ బాబుగారికి నమస్కరించి బట్టలు మార్చుకొని

వచ్చి కూర్చున్నాను. నా భార్యకూడా వచ్చి కూర్చున్నది. "ఏమండీ ప్రవేటు చెప్పేందుకు పోలేదా?" అని అడిగారు. "లేదండీ ఒకరు సినిమాకు, మరొకరు పేరంటమునకు, ఇంకొకరు ఏదో గ్రామానికి ప్రయాణమగుచున్నందున ఇంటికి వచ్చేశాను" అన్నాను. "ఏమండీ సత్యవతమ్మగారూ 5, 10 నిమిషాలలో కృష్ణమూర్తిగారు వస్తారని చెప్పాను, నామాట అబద్ధమయిందా అన్నారు. "మీమాట అబద్ధమెలా అవుతుందండీ" అంటుంది. వెంటనే బాబుగారు లేచి వెళ్ళిపోవాలని నిలుచున్నారు. వెంటనే వారి తలచుట్టూ చక్రము కనిపించసాగింది. ఒకసారి ఎ ఘ్నేశ్వరుడుగా చతుర్ముఖ బ్రహ్మగా, శ్రీ కోదండరామునిగా సాక్షాత్కరించి చివరకు చక్రము అదృశ్యమై శ్రీ రంగన్నబాబుగారి రూపం దర్శనమైంది. అంతట మాకు దిగ్భ్రమ కలిగి, తమరెవరో చెప్పండి అనుచూ పాదములు పట్టుకొన ప్రయత్నించగా చివాలునలేచి "ఏనుంది వెళ్ళిపోవాలి" అంటూ రెప్పపాటులో వీధి గుమ్మము దగ్గరకు వెళ్ళారు. ఒక్క పరుగున నేనక్కడకు వెళ్ళేసరికి వారు సమీపమందలి నాలుగురోడ్ల కూడలిలో కనిపించారు. నేనక్కడకు పరుగెత్తేసరికి ఏ రోడ్డునవెళ్ళారోగానీ అదృశ్యమయ్యారు. నాలుగురోడ్లూ వెతికాను. కనిపించక ఇంటికి వచ్చాను.

ఇంటికి రాగానే ఎప్పుడూ మమ్ములను అయ్యగారూ, అమ్మగారూ అని సంభోధించే బాబుగారు ఇప్పుడు పేర్లు పెట్టి పిలవడం గుర్తువచ్చి ఆశ్చర్యపోయారు. తెల్లవారి శ్రీ రంగన్న బాబుగారు మా ఇంటికి వస్తే "ఏమండీ నిన్న 5 గంటల 10 నిమిషాలకు మా ఇంటికి వచ్చారా" అని అడిగితే "నిన్న సాయంత్రం నేను 5 గంటల సమయంలో మీ ఇంటికి రాలేదే, ఆ సమయములో నేను వెంకన్న కోనేరులో స్నానము చేస్తున్నాను" అన్నారు. జరిగిన విషయమంతా నేను శ్రీ బాబుగారికి వివరించాను. "నేను శ్రీ



రామచంద్రప్రభువుల వారిని కనుక్కొని చెపుతాను" అన్నారు. నాటి సాయంకాలము శ్రీ బాబుగారు మా ఇంటికివచ్చి "అయ్యగారూ నిన్న మీ ఇంటికి రామచంద్రప్రభువులే వచ్చారట. మీ ప్రాప్తము ఎంతవరకో అంతవరకే లభించిందట. మిమ్ములను చూచివెడదామని అభిలాష కలిగి వచ్చారట" అని చెప్పారు.

"అయ్యగారూ ఆ రోజు నా రూపములో శ్రీ రామచంద్ర ప్రభువులవారు తొమ్మిది చోట్ల ఒకేకాలములో దర్శనమిచ్చారట" అని ఈ క్రింది వివరములు చెప్పారు.

1. శ్రీ మండా జగన్నాధరావుగారి ఫ్యాన్సీ షాపులో
2. శ్రీ మేతే నరసింహరావు గారి మేడలో
3. గీతాభవనములో
4. శ్రీ వాసుదేవాలయములో
5. శ్రీ జనార్ధనస్వామి వారి మందిరంలో
6. మీ ఇంటి వద్ద దివ్య దర్శనము
7. శ్రీ భుజంగరావుగారి ఇంట్లో (ఫోటో గ్రాఫరు, నల్లమందు సందు)
8. శ్రీ విస్సంశెట్టి ముత్యం గారి ఇంట్లో
9. శ్రీ వక్కలగడ్డ తాతయ్యగారి ఇంట్లో

నేను కాదు శ్రీ రామచంద్రప్రభువులవారని వారు తన గుట్టు గుప్తంగా ఉంచేందుకే అలా చెపుతున్నారు. కానీ శ్రీ బాబుగారికి సర్వసిద్ధులూ దాస్యము చేసేవి. అదే ఆ మహనీయుని గొప్పదనము.

## మా కుమార్తె జననము 1958వ సంవత్సరము

మా కుమారునికి తొమ్మిది సంవత్సరముల వయసు. కుమారుని తర్వాత మాకు పిల్లలు కలుగలేదు. నా భార్యకు మాత్రము కుమార్తె కావాలని తీరని కోరికగా ఉంది. ఒక రోజు శ్రీ బాబుగారు మా ఇంటిలో ఉండగా నా కుమారుని ద్వారా అడిగించినది. "నాకు చెల్లాయి కావాలి ఆడుకునేందుకు. చెల్లాయిని ఇవ్వవా" అని అడిగాడు. శ్రీ బాబుగారు నవ్వుచు "బాబూ నీకు చెల్లాయి కావాలా? అడుగుతాలే" అన్నారు ఆ తర్వాత ఒక సంవత్సరము గడిచింది.

క్షీరాబ్ధి ఏకాదశినాడు నా భార్యను పిలచి "అమ్మగారు ఈ బత్తాయి పండు శ్రీ సీతామహాదేవి మీకిమ్మని ఇచ్చారు. మీరొక్కరే తీసుకోండి" అని ఇచ్చారు. నా కుమారుని పిలచి "బాబూ నీకు చెల్లాయి కావాలన్నావుగా. చెల్లాయి నిస్తాను ఆడుకుందువుగాని" అని చెప్పారు.

వారు ప్రసాదించిన పండు ఆరగించిన మరుసటి నెల నుండి నా భార్య గర్భము ధరించి నవమాసములు మోసి ఒక శుభ సమయములో ఆడశిశువును ప్రసవించినది. ఆ బిడ్డకు వెంకట సీతా కోదండ రామ సుబ్బలక్ష్మి అని నామకరణము చేశాము 4 - 9 - 1957.

## నాకుమార్తె బారసాల నాడు నాగపడిగ ప్రసాదించుట. (1957)

మా కుమార్తె పురిటి శుద్ధి అయ్యాక దేవతార్చన భరిణె తీసి నిర్మాల్యము చేసి అందున్న శివలింగమును పూజించాను. ఆ రోజు



అందులో నాగపడిగలేదు. తెల్లవారి నిర్మాల్యము చేయుటకు భరిణ తీయుసరికి అందులో నాగపడిగ యున్నది. ఆ నాటికి ఆ నాగపడిగను కూడా పూజించితిని. మరునాడు శ్రీ బాబుగారికి ఈ నాగపడిగ మా దేవతార్చన బరిణెలో ప్రత్యక్షమవడం గురించి చెప్పాను వారు "అయ్యగారూ! స్వామి వారు మీకు నాగపడిగ ప్రసాదించిన మాట వాస్తవమేనట. మీరు దానిని జాగ్రత్తగా పూజించుకోండి. మీ జన్మ సుకృతముచే శ్రీ స్వామి వారి నుండి పొందిన కానుక అది" అని శెలవిచ్చారు. అది మొదలు నిత్యం ఆ నాగపడిగను పూజిస్తున్నాము.

## శ్రీ కంకిపాటి నారాయణ రావు గారి ఇంటిలో ప్రయివేటు చెప్పుట జీతము యొక్క వివరములు - 1958 వ సంవత్సరము.

నేను గత పది సంవత్సరముల నుండి శ్రీ కంకిపాటి నారాయణరావు గారి పిల్లలకు ప్రయివేటు చెప్పుచుంటిని. "అయ్యగారూ మీ ఆడ పిల్లల నెల జీతము ఏ నెల జీతము ఆ నెల తీసుకుంటాను. పిల్లవాని జీతము మీ వద్దనే ఉంచండి. నాకవసర మైనప్పుడు తీసుకుంటానని" భార్యా భర్తల సమక్షములోనే చెప్పాను. అది మొదలుకొని అమ్మాయిల జీతము ప్రతినెల తీసుకొనుచుంటిని. పిల్లవాని జీతం వారి వద్దనే ఉండెడిది. రెండు సంవత్సరములయ్యాక నాకువారు నూటయాభై రూపాయలు ఇవ్వవలసి యుండెను. నాకేదో అవసరమొచ్చి డబ్బులు అడిగాను. మీకు మేము ఏ నెల జీతం ఆ నెల ఇస్తున్నాము కదా. ఇంక మీకెందుకు బాకీ ఉన్నాము అని నారాయణరావు గారు అన్నారు. వారి భార్య కూడా పిల్లవాని జీతం మన దగ్గరే ఉంచమన్నాడు గదా? అని చెప్పినా వారంగీకరించలేదు. అప్పుడు నేను నా డబ్బు పూర్తిగా ఇచ్చినంత వరకు నేను మీ పిల్లలకు ప్రవేటు చెప్పనని ఖండితంగా చెప్పి వచ్చాను. కానీ ఆయన

భార్యగారు "మాష్టరుగారు తొందర పడి మానెయ్యకండి. నేను వారికి చెప్పి వప్పిస్తాను" అని చెపితే ఆ తర్వాత కూడా మూడు రోజులు పాఠాలు చెప్పి వచ్చాను. ఆమె ఎంత చెప్పినా వారు వినలేదు. నా పైకం ఇవ్వలేదు. నేను వారి పిల్లలకు ప్రైవేటు చెప్పడం మానేశాను. నిత్యం వారిల్లు దాటుకొని వెళ్ళి అవతల ఇండ్లలో ప్రైవేటు చెప్పేవాడిని. ఆమె మాత్రం రెండు మూడు మార్లు నన్నాపి ఆయన మొండి మనిషని నన్నే ఎలాగైనా సర్దుకొని వచ్చి ప్రైవేటు చెప్పమని ప్రాధేయ పడింది. నేను మాత్రం నా డబ్బు ఇచ్చినంతవరకు రానని ఖండితంగా చెప్పేశాను. ఈ విషయం నేనెప్పుడూ శ్రీ రంగన్న బాబు గారికి చెప్పియుండలేదు.

ఒక రోజు కంకిపాటి రంగారావుగారు, నారాయణరావుగారు, మోతే నరసింహరావు గారి సమక్షములో వారి మేడమీద కూర్చొని యున్నారు. అప్పుడు శ్రీ రంగన్న బాబుగారు కూడా అక్కడ ఉన్నారు. శ్రీ నరసింహరావు గారి దర్శనార్ధము వచ్చిన వారు నలభై మంది ఆ హాలులో ఉన్నారు. అపుడు శ్రీ రంగన్న బాబుగారు నరసింహరావు గారితో "కంకిపాటి వారు శ్రీ దేవులపల్లి కృష్ణమూర్తి గారికి డబ్బు బాకీ ఉన్నారట. చదువు చెప్పిన ఉపాధ్యాయుని సత్కరించవలసినది పోయి వారి కష్టార్జితము ఇవ్వక పోవుట ఎంత నేరము, ఎంత పాపము. భార్య చెప్పినను వినకపోవుట ఎంత పాపము. రేపు సాయంత్రము ఆరుగంట్ల లోపల కృష్ణమూర్తిని పిలిపించి వారి కివ్వవల్సిన పైకమంతయు ఇచ్చి వేయమని ఇది నా ఆజ్ఞ అని కంకిపాటి నారాయణరావు గారికి చెప్పమనిరి.

అమావాస్య నాటి ఉదయం శ్రీ బాబుగారు మా ఇంటికి వచ్చారు. "అయ్యగారు, నారాయణరావుగారు ప్రైవేటు డబ్బులు ఇవ్వలేదని నాకెప్పుడూ చెప్పలేదే" రాత్రి నరసింహారావు గారి ఇంట్లో



జరిగిన సంభాషణంతా నాతో చెప్పారు. "పది రూపాయలు హెచ్చు తక్కువగా ఇచ్చిననూ మీరు తీసుకోండి. వద్దనకండి" అని చెప్పారు. ఈ విషయము నేనెప్పుడూ శ్రీ రంగన్న బాబుగారికి చెప్పలేదుగనుక ఆశ్చర్యపోయాను. భక్తునికి, భగవంతునికి గల అవినాభావ సంబంధము ఎవరు వర్ణించలరు.

నాటి సాయంత్రము నారాయణరావు గారి నుండి నన్ను రమ్మని కబురు వచ్చింది. నేను వెళ్ళగానే కూర్చోబెట్టి శ్రీ రంగన్న బాబు గారితో తాను ప్రైవేటు డబ్బులు ఇవ్వలేదని ఎప్పుడైనా చెప్పానేమోనని అడిగారు. ఎప్పుడూ నేను ఎవ్వరితోను చెప్పలేదని చెప్పాను. వారికి నోటి మాట రాక ఆశ్చర్యముతో ఇంట్లోకి వెళ్ళి 145 రూపాయలు తెచ్చి ఇచ్చి పొరపాటు జరిగినది క్షమించమని అడిగారు. అందరినీ శిక్షించేవాడు, రక్షించేవాడు ఆ పరమేశ్వరుడే గదండీ, నేనెంతటివాడను అన్నాను.

నారాయణరావు గారి భార్య తన భర్త చేసిన పనికి క్షమాపణ చెప్పి తిరిగి ప్రైవేటు చెప్పుటకు రమ్మని ప్రాధేయ పడింది. అలాగే వస్తానని మరునాడు విదియ నాటి నుండి ప్రైవేటు చెప్పేందుకు వాళ్ళ ఇంటికి శ్రీ రంగన్న బాబుగారి అనుమతితో పోతుండే వాణ్ణి.

తనకు సర్వస్య శరణాగతి చేసిన భక్తుల సర్వవిషయాలు శ్రీ బాబుగారికి తెలిసి ఉంటాయని, తగిన విధంగా వారు మన జీవన విధానాన్ని నడిపించి గమ్యం చేర్చుతారనేందుకు పై విషయ మొక గొప్ప ఉదాహరణ.

## మా పూజా మందిరములో నాగపడిగ అంతర్ధాన మగుట (1958)

మా తాతగారిచ్చిన నాగపడిగ మా దేవపూజ భరిణెలో చాలా కాలము నుండి ఉండెడిది. నేను నిత్యమూ ఆ నాగపడిగకు పూజ చేసే వాడిని. ఒక రోజు పూజా సమయమున నాగపడిగ కనిపించలేదు. పూజా మందిరమేగాక ఇల్లంతా వెదికాను. ఎక్కడా కనిపించలేదు. తెల్లవారి శ్రీ బాబుగారు మా ఇంటికి వస్తే నాగపడిగ కనిపించని విషయము చెప్పాను. "అయ్యగారూ! మీరేమీ దిగులు పడవద్దు నేను ప్రభువుల వారిని అడిగి చెపుతానని" చెప్పారు.

శ్రీ రామ చంద్ర ప్రభువుల వారిని అడిగితే మా పూజా మందిరములోని నాగపడిగను తామే తీసుకున్నామని, త్వరలోనే మరొకటి ప్రసాదిస్తానని చెప్పమని శ్రీ స్వామి వారు చెప్పారని బాబుగారు చెప్పారు.

## 1959 లో శ్రీ రామచంద్ర ప్రభువుల వారు బాల్యమున ధరించిన వస్తువుల దర్శనము

ఒక రోజు రాత్రి 7 గంటలకు మా ఇంటికి ఒక కొల్లాయి గుడ్డ మూట తీసుక వచ్చారు. అయ్యగారూ! ఇవన్నీ శ్రీ స్వామివారు చిన్ననాడు ధరించిన వస్తువులు. ఇలాంటివి వారికి అనేకమున్నాయి. ఇవన్నీ వారి తండ్రిగారైన దశరథ మహారాజు గారు చేయించినవట. "వీటిని మీకు చూపించమని శ్రీ స్వామివారి ఆజ్ఞ." అని చెప్పారు మాకు చూపించిన వాటిలో మెడలో ధరించు బంగారు గొలుసులు, చేతికి ధరించు బంగారపు వత్తులు, అందెలు, వేళ్ళ ఉంగరములు గలవు. ఇవన్నియు మంచి కాంతితో ధగధగలాడు చుండెను. ఆ వస్తువులు మా ఇంటిలోనే వుంచి నాల్గవనాడు తీసుకువెళ్ళారు.



## నల మహారాజు జూదమాడిన ధనం మాకు చూపుట

ఒక రోజు సాయంత్రం 5 గంటలకు చంకలో సంచి దాని పైన కండువా కప్పుకొని శ్రీ బాబుగారు వచ్చారు. వారు, నేను చాప మీద కూర్చుంటిమి. వారు సంచిలో నున్న 5, 10, 100, 1000 రూపాయల నోట్లకట్టలను చాపమీద కుమ్మరించారు. ఆ నోట్లకు పసుపు కుంకుమలు చల్లినట్లుంది. నోటితో ఊదితే ఎగిరి పోయేటట్లుంది. "ఇదంతా నల మహారాజు జూదమాడిన డబ్బట. ఇలాంటి డబ్బు ఇంకా చాలా ఉందట. ఇది మీకు శ్రీ స్వామివారు చూపించమన్నారు గనుక తెచ్చాను" అని చెప్పి 5½ గంటలకు రైలు స్టేషన్ దగ్గరున్న వాసు దేవాలయమునకు తెమ్మని ప్రభువులవారి ఆజ్ఞ అని చెప్పి ఆ డబ్బును సంచిలో పెట్టుకొని ఉత్తరీయం కప్పుకొని వెళ్ళారు.

## శివ పార్వతుల నోటికి శ్రీ కృష్ణుడు వెన్నపూస పెట్టుట

ఒక కృష్ణాష్టమి రోజు శ్రీ బాబుగారు మా ఇంటికి వచ్చారు. "అయ్యగారూ మీ ఇంటిలో ఒక విశేషము జరిగినది, గమనించారా?" అని అడిగారు. మమ్ములను మా ఇంటిలోని గోడలకు తగిలించిన పటముల దగ్గరకు తీసుక వెళ్ళి శివపార్వతుల నోటికి కరిపించిన వెన్న పూసముద్దను చూపించారు. "ఈ రోజు కృష్ణాష్టమి గనుక శ్రీ కృష్ణుడు శివపార్వతుల నోటికి వెన్నపూస ఉంచారు. అది మీరు తీసివేయకండి. వారే క్రమేణా ఆరగిస్తారు." అని చెప్పారు. మేము ఆ వెన్న పూసను అలాగే ఉంచేశాము. దాని పైన ఈగగాని దోమగాని, చీమగాని వాలలేదు. క్రమంగా వెన్న అదృశ్యమై వారి నోటి వద్ద మచ్చలు మాత్రమే ఉన్నాయి.

## వంకాయ కూర 1958 వ సంవత్సరము

ఒక రోజు నేను, నా భార్య భోంచేశాక శ్రీ బాబుగారు ఇంటికి వచ్చారు. "అయ్యగారు ఈ రోజు మీ ఇంటిలో వంకాయ కూర చేశారని శ్రీ రామచంద్ర ప్రభువుల వారు చెప్పారు. నిజమేనా" అని అడిగారు. నేను చాలా ఆశ్చర్య పోయాను. కారణం ఆ రోజు మా ఇంటిలో వంకాయ కూర చేసిన మాట వాస్తవమే. "అయ్యగారూ నేనీరోజు మొదటి అన్నం మీ వంకాయ కూరతో తినాలట. కొంచెం కూర ఆకులో పెట్టివ్వండి" అని అడిగారు. మేమలాగే ఇచ్చాము. సాయం కాలం శ్రీ బాబుగారు వచ్చి "అయ్యగారూ వంకాయ కూర్పైన, నా పైన శ్రీ స్వామి వారు అమృతము ప్రోక్షించారు. కూర ఎంతో మధురముగా ఉంది" అని చెప్పారు. మద్యాహ్నం వారికి వంకాయ కూర పెట్టినాక మా ఇంటిలో పుల్లనిమ్మకాయంత కూర మిగిలి ఉండెను. కానీ సాయంకాలం చూస్తే నలుగురు మనుషులకు సరిపడే కూర ఉంది. ఈ విషయం శ్రీ బాబు గారికి చెపితే "అంతా శ్రీ స్వామివారి దయ. ఆ కూర మీరు రాత్రికి భోంచేయండి" అని చెప్పారు. ఇలాంటి దివ్య లీలలెన్ని చేసినా ఆ మహనీయుడు శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు చేశారని చెపుతారు గాని తన ప్రశక్తి ఉంచనే ఉంచరు.

## శ్రీ మోతే నరసింహరావు గారి మేడలో నరసింహాశతక పఠనము 1960 వ సంవత్సరము

ఏలూరులో శ్రీ మోతే నరసింహారావుగారనే జమిందారు ఉండేవారు. వీరు మునిసిపల్ చేర్మెన్ పదవిని, మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిలు మెంబరుగాను ఉంటూ తన పదవులను కడు సమర్ధవంతముగా నిర్వహించారు. చివరలో వీరు సర్వసంగ పరిత్యాగము చేసి తన మేడ మీదనే ఉంటూ కొన్నాళ్ళు ఇడ్లీ మాత్రమే తినేవారు. మరి కొన్నాళ్ళు కాఫీ మాత్రమే త్రాగేవారు. మరి కొన్నాళ్ళు ఎండు ద్రాక్ష పండ్ల రసము మాత్రం స్వీకరించేవారు. ఎప్పుడూ భగవధ్యానములో నుండేవారు.

ఒక రోజు శ్రీ రంగన్న బాబుగారు, శ్రీ స్వామివారి ఆజ్ఞ అయినది గనుక ఈ రోజు మీరు శ్రీ నరసింహారావుగారి సమక్షములో నరసింహ శతకము చదువ వలెనని ఆజ్ఞాపించిరి. అంతటి గొప్ప వేదాంతి పండితుని ముందు నేను చదువడమేమిటి, వారి ప్రశ్నలకు నేను సమాధాన మివ్వగలనా అని శ్రీ బాబుగారితో అంటిని. "పఠనమునకు ముందు నీవు విఘ్నేశ్వరుని ప్రార్ధించి మొదలు పెట్టండి. వారేమి ప్రశ్నలు వేసినా శ్రీ రామచంద్ర ప్రభువుల వారే మీ హృదయములో నుండి సమాధానమిస్తారు" అని చెప్పి నన్నచ్చటికి తీసుకపోయారు. నరసింహ శతక పఠనము పూర్తయినది. శ్రీ నరసింహరావు గారు నన్నెట్టి ప్రశ్నలు వేయలేదు. శతక పఠనము శ్రద్ధగా విని ఆనందించి "చాలా బాగున్నది వేదాంతమంతయూ ఈ పద్యములలో ఇమిడియున్నది" అని పలుకుచు ఐదు రూపాయలు తాంబూలములో ఉంచి నాకు ఈయబోయిరి. నేను తీసుకొనుటకు అంగీకరించలేదు. "నేను భగవదర్పితముగా ఇస్తున్నాను" తీసుకొనమని ప్రాధేయ పడిరి. అప్పుడు శ్రీ రంగన్న బాబు గారు నా దగ్గరకొచ్చి "వారు భగవ దర్పితముగా ఇస్తున్నానంటున్నారు గనుక తీసుకోండి. తర్వాత నేను చెపుతానని పలికిరి". నేను ఐదు రూపాయలు తీసుకొంటిని. మేము సెలవు తీసుకొని వచ్చేటప్పుడు శ్రీ బాబుగారు ఆ ఐదు రూపాయలకు టెంకాయలు తెప్పించి శ్రీ మార్కండేయ స్వామి వారి ఆలయములో కొట్టించిరి.

## చిన్న తిరుపతి వెంకటేశ్వరస్వామి మమ్ములను తన దర్శనమునకు రమ్మని శ్రీ రంగన్న బాబుగారి ద్వారా కబురంపుట (1969)

శ్రీ రంగన్న బాబుగారితో మాకు పరిచయము కాకముందు నా భార్య కాపురానికి వచ్చిన కొత్తలో 1935 - 1939 మధ్య కాలములో మా పెదతాతయ్య గారి భార్య అంతర్వేది నరసింహ స్వామికి మొక్కుకున్నదట. ఏమని? "కృష్ణమూర్తికి మగ పిల్లవాడు కల్గితే శ్రీ అంతర్వేది నరసింహుల స్వామి దర్శనానికి వస్తాడు" అని చెప్పిందట. నాకు కుమారుడు జన్మించిన పదిసంవత్సరములకు అమ్మాయి పుట్టినది. అమ్మాయికి 1½ సంవత్సరము వయసు. ఒక రోజు మా స్వగ్రామమైన చాటపర్రు వెళ్ళినప్పుడు మా పెద్దమ్మ పై మొక్కుబడి విషయము నాకు చెప్పారు. ఒక రోజు కుటుంబ సహితముగా అంతర్వేది వెళ్ళిరావాలని అనుకున్నాము. శ్రీ బాబుగారికి చెపితే అలాగే వెళ్ళిరమ్మన్నారు. రేపు అంతర్వేది వెళ్ళుతామనగా ఈ రాత్రికి శ్రీ బాబుగారితో చెప్పాను. అప్పుడు బాబుగారు "అయ్యగారు మీరు అంతర్వేది దర్శించి వచ్చేటప్పుడు చిన్న తిరుపతి వెళ్ళి శ్రీ స్వామి వారిని దర్శించుకొని రమ్మని శ్రీ వెంకటేశ్వర స్వామి వారు మీకు చెప్పి రమ్మనమని చెప్పారు" అని చెప్పారు. ఆ మాట ప్రకారమే మేము అంతర్వేది తర్వాత చిన్న తిరుపతి వెళ్ళి దర్శనము చేసుకొని వచ్చాము.

## శ్రీ రంగన్న బాబు గారి ఆజ్ఞమేరకు మేనరికపు సంబందము నా కొమారునికి చేసికొనుటకు అంగీకరించుట

ఒక రోజు శ్రీ బాబుగారు మా ఇంటికి వచ్చి "అయ్యగారూ మీ బావమర్దులు ఇద్దరు మీ అబ్బాయికి పిల్లనిస్తామని రాబోతున్నారు. మేనరికము చేసుకోకూడదని ఏముంది. ఎవరి



పిల్లనయినా ఒకర్ని చేసుకుంటామని చెప్పండి" అని చెప్పారు. ఆ మహనీయుని ఆజ్ఞ మేరకు మా చిన్న బావమర్ది కొమార్తెను చేసుకుంటామని చెప్పాను. 1962 వ సంవత్సరములో నా కుమారుని వివాహము జరిగినది. మా బావమర్దులు రాకముందే శ్రీ బాబుగారు ఆ విషయం చెప్పడంతో వారు సర్వజ్ఞులని తెలుస్తుంది

## నాకుమారుని వివాహ సమయములో సదస్యము నాటి మహిమ

వివాహానంతరము పెండ్లి కొమార్తె వారు బ్రాహ్మణులకు ఒక శాలువ 2 రూపాయలు దక్షిణ ఇచ్చి సత్కరించిరి. పెండ్లి కొమారుని సదస్యము ఇంకా పది రోజులుంది. సదస్యమునకు ముందు రోజు నేను శ్రీ రంగన్న బాబుగారిని కలుసుకొని మాట్లాడాను. పెండ్లి కుమార్తె వారు శాలువ కప్పి సత్కరిస్తే మనము తాంబూలములో పైకము పెట్టి ఇస్తాము. మీరేమీ భయపడ వద్దు అని శ్రీ బాబుగారు చెప్పారు. శ్రీ బాబుగారు నేత్రములు మూసుకొని పదినిమిషములు కూర్చొని "అయ్యగారు అందరు పండితులను మూడుభాగములుగా విభజించి 1వ గ్రేడుకు పది రూపాయలు, 2వ గ్రేడుకు ఐదు రూపాయలు, 3వ గ్రేడుకు రెండు రూపాయలు ఇవ్వమని శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు చెప్పారు" అలా చేస్తామని చెప్పారు.

సదస్యము రోజు 35 మంది బ్రాహ్మణులు వచ్చారు. నేను సదస్యము మంటపములోనికి వచ్చి అందరికి నమస్కరించితిని. శ్రీ మండా జగన్నాదరావు గారిని పోలియున్న వ్యక్తి వచ్చి నా చేతికి ఒక సంచి ఇచ్చి, "ఈ సంచిలోని సొమ్మును లెక్కపెట్ట వద్దు. సంచిలో నుండి పైకము చేతికి వచ్చినంత తీసి ఇస్తుండండి" అని చెప్పారు. ఈ సంచిని శ్రీ రంగన్న బాబుగారు మీకివ్వమన్నారని చెప్పి అచ్చటనే కూర్చున్నారు.

మా బాబాయిగారిని సంచిలో నుండి డబ్బుతీసి నాకివ్వమని చెప్పాను. ఆయనను సంచిలో ఎంతున్నది చూడవద్దని చెప్పాను. ఆయన చేతికి మొదట పదిరూపాయల నోటు వచ్చినది. అది చూచి ఆయన "ఓరేయ్ క్రిష్ణా ఇంతకుముందు, జమీందార్లు, కోటీశ్వర్లు, లాక్షాదికారులు  ఎవ్వరో గాని సదస్యములో తాంబూలములో పెట్టి ఇంత పైకము ఇచ్చి యుండలేదు." అంటూ పదిరూపాయలనోటు సంచిలో పడేసి చేయి బయటకు తీయలేక గజగజ వణకుచుండెను.

"జగన్నాదరావుగారూ! సంచిలో నుండి మీరే డబ్బు తీసి ఇవ్వమని" నేనడిగి నందున, జగన్నాదరావుగారు మా బాబాయి చేతిని సంచి నుండి బలవంతంగా లాగివేసి తానే నా చేతికి డబ్బు ఇవసాగిరి. వేదపండితుల కిచ్చినంత సేపు 5 రూపాయలు, 2 రూపాయలు, 1 రూపాయి నోట్లు 3 వస్తున్నాయి. శాస్త్రి పండితుల కిచ్చినంతసేపు 5 రూపాయలు కాగితములు వచ్చాయి. 3వ గ్రేడు వారికి ఇచ్చినప్పుడు 2 రూపాయలు నోట్లు వచ్చాయి.

ఇంత వరకు సదస్యము రోజు జమీందారులు కాని లక్షాదికారులు కానీ ఇంతింత డబ్బు ఎవ్వరూ ఇచ్చియుండలేదని ఆశ్చర్యపడి నన్ను ప్రశంశించిరి. ఇదంతయూ భగవంతుని చిద్విలాసము. నాదేమియూలేదని చెప్పాను. సదస్యము అయ్యాక మండా జగన్నాదరావు రూపములోనున్న వ్యక్తి సంచితీసుకొని వెళ్ళిపోయాడు.

సదస్యము తర్వాత నేను శ్రీ బాబుగారితో మాట్లాడినపుడు అప్పుడు అధికముగా వచ్చిన ఏడుగురు సప్తరుషులనియు, మండా జగన్నాదరావుగారి రూపములో వచ్చినవారు కుబేరుడనియు వారు



సెలవిచ్చిరి. వివాహ సందర్భముగా శ్రీ సీతామహాదేవిగారు, శ్రీ రామచంద్ర ప్రభువులవారు స్వయంగా వచ్చి వధూ వరులను ఆశీర్వదించి వెళ్ళారని చెప్పారు. శ్రీ రంగన్న బాబుగారి దివ్య లీలా ప్రదర్శనమునకు ఇది ఒక మచ్చుతునక. కానీ ఆ మహనీయుడు అంతా శ్రీ రామ చంద్ర ప్రభువులు చేసినట్లుగానే చెపుతుంటారు కానీ తన మీద ఆవగింజంత కూడా ఉంచుకొనరు.

## మా కుమారుని ఉపనయన కాలములో శ్రీ సీతాదేవి వచ్చి వడ్డించుట

మా కుమారుని ఉపనయనము రోజున మూడవ పంక్తికి బందుమిత్రులు కూర్చున్నారు. అందరితో పాటు నా భార్య కూడా వడ్డించుచున్నది. ఆమె తర్వాత ఎవరో ఒక వ్యక్తి గరిట, గిన్నెతీసుకొని వడ్డిస్తూ వస్తున్నట్లు ఆమెకు కనిపిస్తుంది. ఆమె గిన్నెలో ఏమి తెచ్చి వడ్డిస్తుందో నా భార్యకు కనిపించలేదు. ఈ విషయమామె నాకు చెప్పి ఆమె ఎవరో క్రొత్త వ్యక్తిగా ఉన్నారు, చూడమన్నారు. నేను వెళ్ళి చూస్తున్నాను. నేను ఎక్కడ చూచినా అక్కడంతా కుంకుమ గోచరిస్తుంది. మిగిలిన వారికి ఈ దృశ్యము గోచరించడంలేదు. వంటిల్లు, వసారా పెండ్లిపందిరి ఎక్కడ చూచినా భూమి మీద కుంకుమ ఉంది నేనీవిషయం శ్రీ రంగన్న బాబుగారికి విన్నపించాను. వారు మరుసటి రోజు వచ్చి "అయ్యాగారూ మీ ఇంటికి శ్రీ సీతమ్మగారే స్వయంగా వచ్చి వడ్డించారట. అది మీ అదృష్టమని పలికిరి."

## 1962 లో భావనారాయణగారి మేడ పై జరిగిన విషయము

23-3-1962 రాత్రి 1-34 గంటలకు నా కుమారుని వివాహము. శ్రీ బాబు గారిని ఆహ్వానించుటకు గుంటూరు వెళ్ళాను.

గుంటూరులో శ్రీ భావనారాయణ గారి మేడ మీద గదిలో నేను శ్రీ బాబుగారు ఒక గదిలో పడుకోనియున్నాము. ఒక వేళలో నా పైన చల్లగా వర్షపు చినుకులవలె రాలుచున్నాయి. నేను నిద్రలేచి గదిలో ఏమిటి వర్షం పడుతుందే అని నా పడక పై చూచాను. చాలా చిత్రంగా ఉంది. పడకనిండా అక్షింతలు ఉన్నాయి శ్రీ బాబుగారిని నిద్రలేపలేదు. తెల్లవారి నిద్రలేచే సరికి నా చొక్కా, పంచె, ఉత్తరీయము పసుపుతో నిండిపోయి ఉన్నాయి. కానీ నా పరుపు, పరుపు పై పరచిన దుప్పటి, దిండు గలీబులకు పసుపు ఏ మాత్రము కూడా అంటుకోలేదు. ఈ విచిత్రమును నేను శ్రీ బాబుగారికి చెప్పి నా గుడ్డలు చూపించాను. "అయ్యగారు ఇది శ్రీ స్వామి వారు మీ పై చల్లిన అమృతపు చినుకులు. అది సుభ సూచికమైన ఆశీర్వాదము. ఈ గుడ్డలు విప్పి సంచిలో పెట్టండి. ఇంటికి వెళ్ళినాక మీ గుడ్డలు బక్కెట్టులోని నీటిలో బాగా జాడించి పసుపు నీళ్ళు త్రొక్కని తావులో పోయండి. ఈ గుడ్డలు చాకలికి వేయవద్దు. మీ సుకృతముచే శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు మీ కిట్టి దివ్యానుభవమును ప్రసాధించారు." అని చెప్పారు. నేనింటికి వచ్చి అలాగే చేశాను.

## <u>1963 వ సంవత్సరము వైకుంఠ ఏకాదశినాడు నా అనారోగ్యానికి శ్రీ బాబుగారి ద్వారా శ్రీ రామచంద్ర ప్రభువు విభూతి పంపుట</u>

వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 7 గంటలకు శ్రీ బాబుగారు మా ఇంటికి వచ్చి వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యాన్ని గురించి వివరించారు. ఈ రోజు ముక్కోటి దేవతలు ఉపవాసముందురని, ఈనాడు శరీరము వదిలిన వారికి పునర్జన్మ ఉండదని చెప్పి మమ్ముల గూడా ఉపవాసము ఉండమనిరి. శంకర మఠములో సప్తాహము ఉంది. భజన సంకీర్తన ఉంటాయి. నేను 3 గంటలకు వస్తాను. మీరు సిద్దంగా ఉండండి పోతామని వెళ్ళారు. తిరిగి మద్యహ్నాం 2 గంటలకు వచ్చి 4 బత్తాయి పండ్లు 5 యాపిల్ పండ్లు ఒక అరిటాకులో తెచ్చి ఇచ్చి మీరు ప్రశాదము తీసుకొని 3 గంటలకు సిద్దంగా ఉండమని వెళ్ళారు.

నేను పంచ, బన్నీను ధరించి చొక్కా వేసుకొనులోగా నా శరీరమంతా చీమలు పాకినట్లుంది. బనీను విదిలించి చూచాను. ఏమీ లేదు. చొక్కా వేసుకున్నాను. శ్రీ బాబుగారు వచ్చారు. నా కుమారుడు, నేను, బాబు గారు పోతున్నాము. మద్యదోవలో నా వళ్ళంతా జిల, కళ్ళు తిరుగుతున్నాయి, నడవలేకున్నాను. అప్పుడు శ్రీ బాబుగారికి చెప్పాను. పైత్యము వలన అలా ఉంది, మీ డాక్టరుగారి దగ్గర ఒక ఇంజెక్షన్ చేయించుకోండి బాగుంటుంది అని మమ్ములను ఆస్పత్రి దగ్గర వదలి వెళ్ళారు. ఆస్పత్రిలో డాక్టరు గారు లేరు. తిరుపతి వెళ్ళారు. డాక్టరుగారి మేనల్లుడు కూడా డాక్టరు గనుక కౌంపౌండర్ వారికి ఫోన్ చేస్తే వారు అర్జంటు కేసులో ఉన్నందున రాలేననియు వారిని తన దగ్గరకు పంపమన్నారు. మేము రిక్షాలో వెళ్ళాము. అక్కడికి వెళ్ళేసరికి నా శరీరమంతయు ఉబ్బి నలుగురు మనుషులు లేవదీసేందుకు వీలుకానంత బరువైనాను. నాకు స్పృహలేదు. నన్ను మరొక డాక్టరు గ్గారైన శ్రీ రావు వెంకట్రావుగారి దగ్గరకు తీసుకపోండి నేను కూడా వస్తానని చెప్పి రిక్షాలో అక్కడికి పంపారు.

శ్రీ వెంకట్రావుగారు నేను లోపలికి రాలేనిస్దితిని చూచి వారి కుమారుడు, ఆయన, ఒకేసారి చెరియొక చేతికి ఇంజక్షను చేసి ఇంటికి తీసుకపోయి బ్రాంది పోయమని చెప్పారట. ఇంటికి వస్తుంటే మద్య దోవలోనే నాకు స్పృహ వచ్చి అందరినీ గుర్తు పట్టగలుగుతున్నాను. 4 గంటలకు ఇంటికి చేరాను. నా భార్య ఇంట్లో

లేదు,  పేరంటము వెళ్ళియుండెను. రిక్షావాడు ఆతుృతతో వెళ్ళి ఆమెకా కబురు చెప్పగానే ఆమె, మా మామగారు, బావ మర్దులు, మితృలు యావన్ మందితో ఇల్లునిండి పోయింది. వారను కొన్నంత గాక నా పరిస్దితి బాగుండెను. డాక్టరు గారి మేనల్లుడొచ్చి బ్రాందివోయ వద్దు, బార్లిగాని, కాఫీగాని ఇవ్వమని చెప్పి నాలుగు మాతృలిచ్చి గంట కొకటి  వేయమని చెప్పి వెళ్ళారు. రాతృ 10 గంటలకు మామగారు, బావమరదులు ఇండ్లకు వెళ్ళారు. రాతృ 11 గంటలకు శ్రీ బాబుగారు వచ్చి అయ్యగారూ ఏమీ కంగారు పడనక్కరలేదు. అంతా శ్రీ రామ చంద్రప్రభువులవారు చెప్పారు. నాచేత విభూతి పంపారు అని కొంత నుదుటికి, కొంత పొట్టకు పూసి కొంచెం నోట్లో వేసి ఉదయానికి బాగుంటుందని చెప్పి "మీరెప్పుడూ ఉపవాసముండవద్దని" చెప్పి వెళ్ళారు. తెల్లవారి నేను మామూలుగా  పాఠశాలకు వెళ్ళాను.

ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయ మొకటుంది. శ్రీ రంగన్న బాబుగారు ప్రక్క నుండే ఆస్పతృలో వదలి వెళ్ళారు. మరి వారప్పుడే శ్రీ రామ చంద్ర ప్రభువునడిగి విభూతినిచ్చి బాగుచేయ వచ్చుగదా? ఋణాను బందాలు తీరకుండా మహనీయులు అడ్డుకోరు. లక్ష రూపాయల బాకీకి వంద రూపాయలైనా చెల్లించాలి. కొంతకు కొంతైన అనుభవించి డబ్బు కర్చయితేగాని మహనీయులు కల్పించుకోరు. ఇది తెలియక శ్రీ బాబుగారు ప్రక్క నుండి కూడా ఇలా అయినదే అని బాధపడడం మన అవివేకమవుతుంది.

<u>శ్రీ మండా జగన్నాదరావు ఇంట్లో నరసింహశతక పఠనము</u>



శ్రీ మండా జగన్నాధ రావు గారింట్లో నరసింహశతక పఠనము చేయమని శ్రీ రామచంద్ర ప్రభువుల వారి ఆజ్ఞ అయినది అని చెప్పి శ్రీ రంగన్న బాబు గారు నన్ను, నా భార్యను తీసుకొని వెళ్ళారు. అక్కడ పఠనము 1 గంట 45 నిమిషులకు పూర్తయినది. శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు ద్రాక్ష పండ్లు ప్రసాదంగా ఇచ్చారని ఒక్కొక్కరికి రెండేసి పండ్లు ఇవ్వమన్నారని చెప్పి అందరికి ఇప్పించారు. ఈ విధంగా ఎక్కువ మంది భక్తుల మద్య శ్రీ స్వామి వారు ప్రసాద మిచ్చారని ప్రసాదం ఇవ్వడం చాలా అరుదుగా జరిగేది. ఎక్కువ మార్లు ఒకరిద్దరు భక్తుల ఉండగానే అలా ప్రసాదాలిచ్చేవారు.

<u>శ్రీ వక్కల గడ్డ వెంకటరత్నం (తాతయ్య) గారింట్లో నరసింహశతక పఠనం</u>

శ్రీ వక్కల గడ్డ వెంకటరత్నం గారింట్లో నరసింహ శతక పటనం చేయాలని శ్రీ బాబు గారు నన్ను తీసుక వెళ్ళారు. పఠన మద్యలో ఆపి నన్ను "అయ్యగారూ గగన మందున్న చుక్కల నెంచవచ్చు అనే పద్యం చదవమని శ్రీ స్వామివారు చెపుతున్నారు చదవండి" అన్నారు అది కాగానే "ఆడు బిడ్డల సొమ్ము అపహరించుట కంటె" అను పద్యమును శ్రీ స్వామి వారి ఆజ్ఞచే చదివితిని. తర్వాత శతక పఠనము పూర్తయినది.

ఎన్నడూలేనిది ఈ రోజు పఠన కాలము మద్యలో శ్రీ బాబుగారు కొంత సేపు కనులు మూసుకొని ద్యానస్థులైకూర్చున్నారు. అదే గొప్ప విశేషము. పండ్లూ, పలహారములు భగవంతునికి నివేదించాక ఒకరు "శ్రీ స్వామి వారు ఆరగించారా బాబుగారూ?" అని అడిగారు. అందుకు బాబుగారు "ఈ విధంగా మనము

పరిశీలనకు పూనుకుంటే మనము నెగ్గలేము. గనుక మనము మామూలు పద్ధతిలో పోతుండవలసినదే" అని సెలవిచ్చిరి.

<u>భద్రాచలం దగ్గర నున్న పోలవరం యొద్ధ గోదావరి నదిలో **1965** లో శ్రీ రంగన్న బాబు గారు శ్రీ స్వామి అనుగ్రహముతో స్నానము చేసి వచ్చుట</u>

ఒక రోజు ఉదయం 11 గంటల కాలములో ఏలూరులో మా ఇంటిలో ఉన్న శ్రీ బాబు గారు కనులు మూసుకొని ధ్యానస్థులైరి ఒక్క నిమిషం తర్వాత కనులు తెరచి "అయ్యగారు నన్ను శ్రీ స్వామి వారు మన ఏలూరులోని తూర్పు లాకుల దగ్గరకు రమ్మంటున్నారు. అక్కడ నుండి భద్రాచల సమీపమందలి పోలవరంలోని గోదావరి నదిలో స్నానం చేయించి తిరిగి 12 గంటలకు ఇక్కడకు తీసుక వస్తారట. ఇప్పుడు 11½ గంటలు అయింది. 12 గంటలకు ఇక్కడకు వస్తాను" అని చెప్పి వెళ్ళారు.

శ్రీ బాబుగారు తూర్పు లాకుల వద్ద నిలుచునియుండగా శ్రీ రామచందు్రలవారిని కండ్లు మూసుకోమని వెనుక నుండి ఒక్క నెట్టు నేట్టారట. మరు క్షణంలో కండ్లు తెరువమంటే తెరిచారు. వారు పోలవరంలో గోదావరి గట్టుననున్నారు. అప్పుడు శ్రీ రామచంద్ర ప్రభువులవారు "ఏమోయ్ రంగన్నా నదిలో స్నానము చేయవోయ్" అని ఆజ్ఞాపించారట. అది మొసళ్ళు ఉండే చోటు గనుక ఎవ్వరూ అక్కడ నదిలో దిగరట. అప్పుడు మూడు మొసళ్ళు నీటి పైన తిరుగుచున్నాయట. శ్రీ స్వామివారి ఆజ్ఞ మీరకూడదని నీళ్ళలోని శ్రీ బాబుగారు దిగగానే మొసళ్ళు నీటి అడుగునకు వెళ్ళాయి. బాబుగారు స్నానం ముగించుకొని గట్టుకు రాగానే తిరిగి మొసళ్ళు నీటి పైకి వచ్చాయి.



అప్పుడు శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు శ్రీ ఆంజనేయ స్వామి వారిని పంపి శ్రీ బాబుగారి నుదుటన, గుండెల పైన, పొట్టపైన, చేతులపైన నామాలు పెట్టించారట. అప్పుడు శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు శ్రీ రంగన్న బాబుగారిని కండ్లు మూసుకోమని చెప్పి ఎనుక నుంచి ఒక తోపు తోచినట్లుందట. ఒక్క రెప్పపాటు కాలములో శ్రీ బాబుగారు ఏలూరులోని శ్రీ కృష్ణమూర్తిగారి ఇంటిలో ఉన్నారట.

ఎక్కడ ఏలూరు ఎక్కడ భద్రాచలం - పోలవరం - గోదావరినది. గోదావరి (పోలవరం దగ్గర) నదిలో స్నానం చేయించి నామాలు పెట్టించి అరగంట లోపలే తిరిగి పోలవరం నుండి ఏలూరు తీసుక వచ్చారు. ఇదంతా నిజమేనని తెలియాలంటే శ్రీ గురు చరిత్రలోని కొన్ని దివ్య లీలలు చూడాలి.

<u>శ్రీ సీతా మహాదేవి నోము చేసుకొని ఫలహారమును శ్రీ బాబుగారి ద్వారా మాకు పంపుట **1966** వ సంవత్సరము</u>

ఒక రోజు శ్రీ బాబుగారు రాత్రి 10 గంటల వేళ మా ఇంటిలోనున్నారు. "అయ్యగారు శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు పిలుచుచున్నారు. శ్రీ సీతా మహాదేవి నోము నోచుకున్నదట. నన్ను వాసుదేవాలయము గుడికి రమ్మంటున్నారు మీకు ప్రసాదం పంపాలట" అని వెళ్ళారు. ఒక గంటలో తిరిగి వచ్చి "అయ్యగారూ, అమ్మగారూ" అని పెద్ద కేకవేసి పిలిచారు. తలుపు తీయగనే అరటాకు పొట్లముతో ఇంటిలోకి ప్రవేసించారు. అరటాకును నాలుగు ముక్కలు చేసి ఒక్కొక్క ఆకులో ఒక గారె, ఒక ఆవవడ చొప్పున పెట్టి మమ్ములను ఆరగించమని చెప్పారు. మా అమ్మాయికి

జ్వరము వచ్చి లంకణములలో ఉన్నది. ఆ విషయము శ్రీ బాబుగారికి చెప్పాము. ఏమీ భయము లేదు. అన్నీ తిన బెట్టుడి ఉదయానికి ఆరోగ్యముగా ఉంటుంది. అని చెపుతూ ఆమెకు కూడ తినిపించిరి. ఆ గారెలు ఆవవడలు కామధేనువు నెయితోను, పెరుగుతోను తయారుచేయబడినవని చెప్పారు. మేము తిన్నాక అరటాకు ముక్కలు శ్రీ బాబుగారే తీసుక వెళ్ళి క్రిష్ణకాలువలో కలిపినట్లు చెప్పారు. తెల్లవారికి మా కొమార్తెకు జ్వరము లేనందున ఆరోగ్యముగా అన్నీ తినసాగింది.

## మధుసూధన పండు ప్రాప్తి

పైన చెప్పిన గారె, ఆవవడలు ఇచ్చి వెళ్ళిన తర్వాత మరలా రెండు నిమిషములలో వచ్చి తలుపుతట్టి పిలిచారు. తలుపు తీయగానే లోపలికి వచ్చి "అయ్యగారు ఇదేమి పండు" అని ఒక పండును చూపిరి. ఆ పండు ధగధగ మెరియుచూ చిట్టీత పండు వలె ఉన్నది గనుక ఆ పేరు చెప్పాను. "ఈ పండు చిట్టీత పండు కాదు. దీని పేరు మధుసూదన పండు. దీనిని నోటిలో వేసుకొని నమలండి. గోధుమ గింజవలె జిగురుగా ఉంటుంది. ఎంత సేపైనా పూర్తిగా పలుకులు లేకుండా నమలి మింగండి అని చెప్పి వెళ్ళారు. నేను 12 గంటల నుండి 3 గంటల వరకు నములు తూనే ఉన్నాను. ఒకప్పుడు తియ్యగాను మరొక సారి పుల్లగాను, మరొక సారి చప్పగాను మరొకప్పుడు కారంగాను ఉంటుంది. 3 గంటల వరకు నమలి పడుకున్నాము. తెల్లవారుతూనే శ్రీ బాబుగారు మా ఇంటికి వచ్చి మదుసూదన పండును గూర్చి విచారించి "ఇంత వరకు ఎవరికీ ఈ పండు ఇచ్చి యుండలేదు. ఇది దొరకడం మీ అదృష్టమని చెప్పారు.



## మాగంటి సీతా రామదాసుగారి ఇంటిలో జరిగిన దృశ్యము

ఒక రోజు నేను, శ్రీ బాబుగారు సీతా రామదాసు గారింట్లో మాట్లాడుచున్నాము. "బాబుగారు మనం నివేదించిన పదార్ధాలు శ్రీ స్వామివారు ఆరగిస్తారా? ఆరగించినట్లు మనకు నిదర్శనము కనిపించునా? అని సీతారామదాసు గారొక ప్రశ్నవేశిరి. దేవుడు ఆరగించిన గుర్తులు ఎందుకు కనబడవు తప్పక కనబడుతాయి అని చెప్పిన. అప్పుడు మీరు పూజచేసి నివేదనలు ఆరగించమని శ్రీ స్వామివారికి చెప్పండి. నేను గూడా ఆరగించమని చెపుతాను అని శ్రీ బాబుగారనిరి. అప్పుడు సీతారామరాజు వారింట్లో నన్ను పూజచేయమనిరి. నేనంగీకరించలేదు. చివరకు శ్రీ బాబుగారు చెప్పినందున పూజ చేసేందుకు నేనంగీకరించితిని. అందరూ 75 మంది భక్తులు హాజరైనారు. నేను పూజచేసి, నివేదనలు ఆరగించమని శ్రీ స్వామి వారిని ప్రార్ధించి బయటకు వచ్చేశాను. శ్రీ బాబుగారు పూజా మందిరములో ఎవ్వరూలేకుండా పది నిమిషాలు తలుపులు మూయించారు. పది నిమిషాల తర్వాత నన్ను, సీతారామదాసు గారిని పూజా గృహములోకి" వెళ్ళి ఆరగించిన గుర్తులేవైనా ఉన్నాయేమో అని చూడమనిరి.

ఎంతో ఆశ్చర్యము. ఉప్మాలో మూడు వేళ్ళు గుచ్చి తీసిన గుర్తులుండెను. లడ్లు చిదిపి ఉన్నాయి. బత్తాయి తొనలు కొన్ని అదృశ్యమై వాటి సంఖ్య తగ్గి ఉన్నది. అప్పుడు సీతారామదాసుగారు ఆనందాశ్చర్యములతో నన్ను కౌగలించుకొని కృతజ్ఞతలు చెప్పారు. శ్రీ బాబుగారి పాదాలకు నమస్కరించి నా జన్మ ధన్యమైనదని పలికారు. అచ్చటకు వచ్చిన వారందరూ చాలా ఆనంద పడిరి. ఇది

జరిగిన 2, 3 సంవత్సరములలో సీతారామదాసుగారు పరమ పదించారు.

<u>శ్రీ వక్కల గడ్డ వెంకట రత్నం గారింటిలో ఒక దృశ్యం</u>

ప్రతి సంవత్సరము జరుగు విధముగనే కార్తీక మాసములో వక్కల గడ్డ వెంకట రత్నం గారింట్లో ఈ సంవత్సరము కూడా కార్తీకమాసములో నేనే శ్రీ బాబుగారి ఆజ్ఞ మేరకు కార్తీకపురాణము చదివాను. నివేదన పదార్ధములన్నియు వేరు వేరు పళ్ళెరములలో నుంచిరి. బత్తాయి తొనలు, నారింజ తొనలు ఎన్నెన్ని నివేదనకు పెట్టారో ఎంచి యుంచు కొన్నారు. నివేదన అయిపోయి, కర్పూరహారతిచ్చాక తలుపులు మూసి అందరూ బయట పది నిమిషాలు నిలబడ్డారు. తర్వాత శ్రీ బాబుగారు శ్రీ వెంకట రత్నం గారిని పిలిచి తలుపు తీసి బత్తాయి తొన లెన్ని ఉన్నాయో నారింజ తొనలెన్ని ఉన్నాయో ఎంచమన్నారు. బత్తాయి తొనలు రెండు, నారింజ తొన ఒకటి తగ్గియున్నాయని పిండిపులిహోర పై శ్రీ స్వామి వారు మూడు వేళ్ళు గుచ్చినట్లు కనబడుతుందని చెప్పారు. అందరూ లోపలికి వెళ్ళి ఈ దృశ్యము చూచి ఆశ్చర్యానందములతో గంతులు వేశారు. తర్వాత ఆ ప్రసాదము అందరికి పంచిపెట్టారు.

ఎన్ని లీలలు చేయుచున్నా శ్రీ బాబుగారు మాత్రము అవన్నీ శ్రీ రామ చంద్ర ప్రభువుల లీలలేనని తన ప్రమేయమేమీలేదని భక్తులను నమ్మించే సామార్థ్యం వారు.

<u>మండా జగన్నాద రావు గారి తోట ప్రక్కన చెరువు గట్టు పై శ్రీ సూర్య భగవానుడు పాలను ప్రసాదించుట</u>



1966 సంవత్సరము కార్తీక మాసంలో శ్రీ మోతే అంజరత్న కుమార్ జమీందారి కారులో వారు, నేను, శ్రీ బాబుగారు, శ్రీ జగన్నాదరావు గారు, వక్కల వెంకటరత్నం గారు జగన్నాద రావు గారి తోటలోకి వెళ్ళాము. అందరూ భోజనములు చేస్తుంటే నాకు మాత్రము జామ పండ్లు లేక కొబ్బరి బోండా నీళ్ళు ఇచ్చి తినమన్నారు. శ్రీ అంజరత్న కుమార్ గారు కార్తీక మాసము గనుక సూర్య దేవుని అడిగి పాలు ప్రసాదంగా ఇప్పించమని శ్రీ బాబుగారిని అడిగారు. "నేను అడుగుతాను సూర్యుడస్తమించేలోగా ఇస్తే మీకిస్తాను" అని చెప్పి ఒక సీసా తెప్పించి తన చంకలో పెట్టుకొని చెరువు కట్ట పై మాతోటి నిలుచుని యున్నారు. కండ్లుమూసుకొని రెండు సెకండ్ల కాలము ప్రార్ధన చేసి తన చంకలోని సీసానిండుగా పాలను తీసి అందరికీ ప్రసాదంగా పంచారు. అక్కడున్న వారంతా ఆ దివ్య ప్రసాదము స్వీకరించి ధన్యులయ్యారు. శ్రీ బాబు గారు మాత్రము తన ప్రమేయమేమీ లేనట్లు ఎంతో వినమ్రులుగా ఉండేవారు.

<u>నా కుమారుడు 1968 వ సంవత్సరములో 7వ తరగతి తప్పుట</u>

1968 వ సంవత్సరములో నా కుమారుడు 7 వ తరగతి పరీక్ష తప్పిపోయి చాలా బాదపడుచున్నాడు. చదవాలని బుద్ది ఉండదు. చదవాలని కూర్చుంటే వెంటనే నిద్రాదేవి తలకెక్కి ఆవలింతలు వచ్చేవి. ఎలాగో చదివినా ఒక్కటీ గుర్తుండదు. ఎంతో తెలివిగా ఉండే పిల్లవాడు ఫెయిలయి మరలా చదవలేక పోవడం చాలా చిత్రంగా ఉంది. పిల్ల వాని పరిస్థితి చూసి నేను ఒక వైద్యునికి గాని లేక ఒక భూత వైద్యునికి గాని చూపించాలని ప్రయత్నించుచుంటిని.

శ్రీ రంగన్న బాబుగారి ద్వారా లెక్కలేనన్ని అనుభవములు పొందియున్ననూ ఇప్పుడు పిల్లవాని పరిస్థితి వారికి నివేదించకుండా వైద్యునికి గాని భూత వైద్యుని గాని సంప్రదించాలను కోవడం ఎంత నీచమైన పద్ధతో చూడండి. అయినప్పటికి "మీరు మమ్ములను వదలినా మేము మిమ్ములను వదలము" అని శ్రీ వెంకయ్య స్వామి వారు చెప్పినట్లు ఈ కష్టకాలంలో శ్రీ బాబుగారే పిల్ల వానిని రక్షించారు.

నేను ఇంట్లోలేని సమయములో ఒక సోది చెప్పే ఆమె సోది చెప్పించుకోమని మా యింటికి వచ్చింది. సోదీ వద్దు ఏమీ వద్దు వెళ్ళమని నా భార్య కసురుకున్నది. నాకు డబ్బులు గాని, బియ్యం గాని ఏ ఇతరముగాని మీరు ఇవ్వనక్కరలేదు. మీకు చెప్పాలని పిస్తుంది. దయచేసి చెప్పించుకోండమ్మా అని బ్రతిమాలుతుంది. చేయి చూపించమని దగ్గరకొచ్చింది. ఇక తట్టుకోలేక అరచేయి చూపింది. అంతవరకు ఆ సోది చెప్పే ఆమె చేతిలోనున్న కరపుల్ల అదృశ్యమై ఆమె చేతిలో ఒక తాళపత్ర గ్రంధము వచ్చింది. "అమ్మా మీ పిల్లవాడు పరీక్ష తప్పియున్నాడు. ప్రస్తుతం చదువను బుద్ధిపుట్టక, చదువ బోతే ఆవలింతలు వస్తూ నిద్రాదేవికి వశమైపోతూ చదివింది గుర్తురాక చాలా బాధపడుతున్నాడు. ఆ బిడ్డ అందరికంటె తెలివిగా ఉండేవాడు. అదిగిట్టని వారు ఒక స్త్రీ గ్రహాన్ని పిల్లవాని వద్దకు పంపారు. దాని ప్రభావం వలన పిల్లవానికి చదువు పై మనస్సు లగ్నం కాక ఇబ్బంది పడుతున్నాడు. మీరేమీ చింతపడవద్దు. ఈ సారి పాసవుతాడు, మీరేమీ బాధ పడవద్దు. ఈ గ్రంధము చూడమ్మా" అని తనచేతిలోని తాళపత్ర గ్రంధము తెరిచి చూపించింది. అందులో శ్రీ రామ లక్ష్మణ సీతాదేవి ఆంజనేయ స్వామివారి పటములు లిఖించబడియున్నాయి. నా భార్య, కొమారుడు, కొమార్తె ఆ బొమ్మను కళ్ళద్దుకొని



నమస్కరించారు. అప్పుడామె ఆ గ్రంధము మూసివేసి "అమ్మ మీకేమీ భయము లేదు. పిల్లవాని సంగతి మేము చూచు కుంటాము మీరు నిశ్చింతగా ఉండండి. పొద్దు కూకుతున్నది. నేను వెళ్ళి పోతానమ్మా. నా పిల్లవాడు ఏడుస్తాడు. నా కంత ఆవకాయ పచ్చడి పెట్టమ్మా వెడతాను" అన్నది. ఈ సమయములో ఆవకాయ పచ్చడి తాకము. మరొక సారి ఇటు వచ్చినప్పుడు అడుగు పెడతానన్నది. "అమ్మా పిల్లల కోసం చిన్నజాడీలో తీసి పెట్టి ఉన్నావు. దానిలో నుండి ఒక్క దబ్బ పెట్టమ్మా" అని అడిగింది. ఆమెచెప్పిందీ నిజమే. ఆకులో పెడితే కారిపోతుంది గదా అనగానే ఆ సోది చెప్పే ఆమె బయట వాకిలి ప్రక్కన వంగి ఒక గాజు గ్లాసు తీసుకొచ్చింది. అక్కడా గ్లాసు ఎందుకున్నదో తెలియదు. నా భార్య ఆ గ్లాసులో ఊరగాయ పెట్టి తన పమిట కొంగులో ఉన్న పావలా ఇస్తే వద్దంటూనే తేసుకొని వెళ్ళింది.

నా భార్య వెంటనే వీది గుమ్మములోకి వచ్చి చూస్తే ఆమె అక్కడెక్కడా కన్పించలేదు రెప్ప పాటి కాలంలో ఆమె అదృశ్యంకావడం చాలా ఆశ్చర్యముగా ఉంది. ఆమె అంతర్ధానమైంది అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. పై విషయమంతా నా భార్య నాకు వివరించింది.

నాలుగు నెలల తర్వాత మేము శ్రీ రంగన్న బాబు గారిని గుంటూరులో కలిసాము. మేమేదో మాట్లాడుతుంటే అది ఆపమని ఆమధ్య మీ ఇంటికి ఎవరైనా సోదిచెప్పే ఆమె వచిందా? అని అడిగారు. ఔనండీ వచ్చింది అని అంతా వివరించింది నా భార్య. అంతా విని సీతా మహా దేవి మీకు ధైర్యం చెప్పేందుకు మీ ఇంటికి సోది చెప్పే ఆమె రూపంలో వచ్చింది. అది శ్రీ స్వామివారి ఆజ్ఞ అన్నారు. అంతా ఆమె చెప్పినట్లే జరిగింది. పిల్లవాడు పరీక్ష

పాసయ్యాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. శ్రీ బాబుగారు అంగీకరించరు కానీ ఆ మహనీయునికి అష్ట సిద్ధులు దాస్యము చేస్తాయి. ఆనాడు ఆ నోది చెప్పే ఆమె రూపంలో వచ్చింది వారే.

## నా ఆపరేషన్ సమయంలో శ్రీ స్వామి వారి ఆశీస్సులు

1968 వ సంవత్సరములో నా ఆసనంలో కురుపు లేచి ఆపరేషన్ చేయాలన్నారు. నేను శ్రీ బాబు గారికి చెపితే శ్రీ రామ చంద్ర పభువుల వారిని అడుగుతానన్నారు. వారి నుండి సమాధానము వచ్చేలోగా నేను ఆపరేషన్ చేయించుకొని ఆస్పత్రిలోనున్నాను. ఐదవ రోజు రాత్రి నా స్వప్నములో శ్రీ రామ చంద్ర ప్రభువులు మరియు శ్రీ వెంకటేశ్వర స్వామి పటములు దేదీప్యమాన వెలుగుతో కన్పించి ఆ వెలుగులో వారిద్దరూ ఒకరు మార్చి ఒకరు దర్శనమిచ్చిరి. వారితో పాటు ఎవరో ఒక వ్యక్తి తల కనపడకుండా శరీరమంతా కన్పిస్తూ వారితో నేను మాట్లాడుతున్నాను. వారి వెంబడి గగన మార్గమున పోతూ పర్వతములు, నదులు, అరణ్యములు. ఉద్యాన వనములు, సరస్సులు చూస్తూ పోతున్నాను, ఆ వ్యక్తి ఇది భూలోకము, ఇది భువర్లోకము, సువర్లోకము, జనాలోకము, తపోలోకము, సత్యలోకము అనిన్నీ, ఇవి అతల, వితల, సుతల, తలాతల, మహాతల, పాతాళలోకాలన్నీ చూపించిరి. నేను ఆనందముతో తేలిపోవుచున్నాను.

అనేక మంది దేవతా స్త్రీలు కన్పిస్తున్నారు. వారందరికి నమస్కరిస్తూ ముందుకు పోతున్నాను. వారు నన్నాశీర్వదించు చున్నారు. నాతో వస్తున్న వ్యక్తి ఎప్పుడో అంతర్ధాన మయ్యాడు. నా జీవాత్మ ఒక్క సారి వచ్చి నా శరీరంలో ప్రవేసించగనే నాకు



భయము, వణుకు వచ్చి హేరామా నన్నీ మాయాలోకంలో పడవేశావా అని ఏడ్చుచుంటిని.

ఇంతలో శ్రీ రామ చంద్ర ప్రభువుల వారు నా మంచము దగ్గర సాక్షాత్కరించి తన రెండు చేతులతో నన్ను లేవనెత్తారు. బలహీనము వల్ల వణికిపోతున్న నన్ను నిమురుతూ "ఏమీ భయము లేదు" అని ఆశీర్వదించి తిరిగి మంచము మీద కూర్చుండ బెట్టి అంతర్ధానమయ్యారు.

అప్పుడు నా భార్య లేచి "ఎందుకు ఏడుస్తున్నారు. ఈ మాయాలోకంలో పడవేశావా అని అంటున్నారేమైంది" అని అడుగగా నేను నా స్వప్నాన్ని శ్రీ రామ చంద్ర ప్రభువుల దర్శనాన్ని ఆమెకు చెప్పాను.

ఆస్పత్రి నుండి ఇంటికి వచ్చాక పై విషయములన్నియు శ్రీ రంగన్న బాబు గారికి చెప్పాను. అప్పుడు వారు "మీ విషయ మంతా శ్రీ స్వామి వారికి చెప్పాను. అందుకే వారు నీకా విధంగా దర్శనం ప్రసాదించారు". అని చెప్పారు. అది మొదలు నా ఆరోగ్యం బాగుపడి పోయింది.

## దింటకుర్తి సుబ్బారావు గారి మేడ పైన మాకు ప్రసాదమిచ్చుట

1969 వ సంవత్సరములో నేను, నా భార్య, మా కొమార్తె శ్రీ బాబుగారి దర్శనార్థం దింటకుర్తి సుబ్బారావు గారింటికి వెళ్ళాము. శ్రీ బాబుగారు మేడ పైనుంటే వెళ్ళి మాట్లాడాము. వారు మమ్ములను "కాళ్ళు కడుకొనిరండి. శ్రీ స్వామి వారు మీకు ప్రసాదమిస్తారట" అని చెప్పారు. మేము క్రిందికి వెళ్ళి కాళ్ళు కడుక్కొని వచ్చి వారి

ప్రక్కన నిల బడ్డాము. వారు కళ్ళు మూసుకొని చేతులు పై కెత్తారు. రెప్ప పాటులో వారి చేతులలోనికి రెండు ఆపిల్ పండ్లు వచ్చాయి. అవి నా చేతిలో పెట్టి మరలా కళ్ళు మూసుకొని చేతులు పై కెత్తి నిలుచున్నారు. వెంటనే వారి చేతిలోకి 20, 30 ద్రాక్ష పండ్లు గల గుత్తి వచ్చింది. అది కూడా మాకే ప్రసాదించి మా ముగ్గురిని ఆరగించమన్నారు. రాత్రి 11 గంటల వరకు అనేక దైవ సంబంధమైన విషయాలు మాట్లాడాము. అప్పుడు మాకు శెలవిచ్చి అక్కడే పడుకోమన్నారు.

## దింటకుర్తి సుబ్బారావు కుమారునిచే నాకు పైక మిప్పించుట **1969** వ సంవత్సరము

ఒక రోజు నేను దింటకుర్తి సుబ్బారావు గారి యొద్ద 50 రూపాయలు తీసుకొని రెండు రోజులలో తిరిగి ఇచ్చివేశాను. మరొక రోజు చిలకలూరిపేటకు పోవాలని నా దగ్గరున్న డబ్బు చాలవేమోనని శ్రీ సుబ్బారావుగారిని 25 రూపాయలు బదులిమ్మని అడిగాను. వారు నా దగ్గర డబ్బులు లేవు. నేనేమి డబ్బు ప్రోగు పోసుకొని కూర్చున్నానా? ఈ రోజు ఆదివారం డబ్బెట్లా వస్తుందని కసురుకున్నారు. నాకు డబ్బుకావాలని శ్రీ బాబు గారికి చెప్పి ఉంటే బాగుండేది. నేనలా చెప్పలేదు. ఆ తర్వాత నేను సుబ్బారావు గారి మిద్దెమీద ఉన్న శ్రీ బాబుగారిని దర్శించాను. నేనేమీ చెప్పక ముందే శ్రీ బాబుగారు "అయ్యగారూ మీరు సుబ్బారావు గారిని 25 రూపాయలు అడిగారా?" అని అడిగారు. నేను వారిని డబ్బడిగిన వైనం నేను చెప్పకుండానే వారి కెలా తెలిసింది అనే విషయం నన్నాశ్చర్యంలో ముంచేసింది. అవును బాబుగారు అడిగానని చెప్పాను. "మీరడిగిన 25 రూపాయలు వారి దగ్గర లేకుండా ఉన్నాయా? సరేకానివ్వండి" అని చెపుతూ పెద్ద గొంతుతో



"రామారావ్" అని (సుబ్బారావు కుమారుని) పిలిచారు. రామారావు వెంటనే వచ్చాడు "మీ నాన్నను మా అయ్యగారు 25 రూపాయలు అడిగితే లేవన్నాడు. నీ దగ్గరుంటే ఇవ్వవయ్యా" అన్నారు. రామారావుగారు వెంటనే 25 రూపాయలు ఇచ్చారు. నేను చిలకలూరు పేట వెళ్ళివచ్చి వారి డబ్బు వారికిచ్చేశాను.

శ్రీ బాబు గారు సర్వజ్ఞులని పై అనుభవం ద్వారా కృష్ణమూర్తి గారు గ్రహించారో లేదోగాని మనకు మాత్రము స్పష్టంగా వారు సర్వజ్ఞులని తెలుస్తుంది.

## శ్రీ భావనారాయణ గారి ఇంటి నుండి సుబ్బారావు గారింటికి రమ్మనడం

ఒక రోజు నేను నా భార్య శ్రీ బాబుగారి దర్శనార్థం గుంటూరులోని శ్రీ దింటకుర్తి సుబ్బారావు గారింటికి వెళ్ళాము. శ్రీ బాబుగారితో మాట్లాడి అక్కడే పడుకున్నాము. వేకువ జామున "అయ్యగారు ఇక్కడ భావనారాయణ అనే భక్తులున్నారు. నేను వారింట్లో స్నానం చేస్తాను. మీరు కూడా రండి అక్కడే స్నానాలు చేస్తురు" అని మమ్ములను వారింటికి తీసుక వెళ్ళారు. స్నానసంధ్యానుష్టానములయ్యాక "బాబుగారు నాకు కొంచెం పని ఉంది. నేనది చూసుకొని సుబ్బారావుగారింటికి వస్తాను. మీరు ఆలస్యము చేయకుండా వెంటనే సుబ్బారావుగారింటికి 5 నిమిషాల్లో వచ్చేయండి అని చెప్పి వెళ్ళారు. మేము వెళ్ళబోవు సరికి శ్రీ భావనారాయణ గారు మమ్ములను ఆపుచేసి మాట్లాడసాగారు. పది నిమిషముల కాలం గడిచినది. "అయ్యో బాబుగారు వెంటనే రమ్మంటే పది నిమిషాలు ఉండి పోయామే" అని వెంటనే సుబ్బారావు గారింటికి వెళ్ళాము. అప్పటికే శ్రీ బాబుగారు అక్కడ మేమింకా

రాలేదని ఎదురు చూస్తున్నారు. మమ్ములను చూసి "రండి రండి. ఆరగింపు అవుతున్నది అని కండ్లు మూసుకొని గాలిలోకి చేతులెత్తారు. వెంటనే వారి చేతిలోకి చాలా పెద్ద ఆపిల్ పండు వచ్చింది. అది నా చేతిలో పెట్టి మీరిద్దరూ ఆరగించండి బాబు గారు" అని చెప్పారు. వారు ప్రతీది రామచంద్ర ప్రభువు పై పెడుతారు. కాని వారి సంకల్పమే సర్వం చేయగలుగుతుంది. ఏ సంకల్పంలేని మనసులో ఒక సంకల్పం కల్గడమే "శ్రీరామ చంద్రుల దయ" అని వారు అలా చెప్పేవారు కాబోలు.

## దింటకుర్తి సుబ్బారావుగారింట్లో శివపార్వతుల విగ్రహాలతో మట్లాడి మాకు విభూతినిచ్చుట

ఒక రోజు శ్రీ బాబుగారు దింటకుర్తి సుబ్బారావు గారి మిద్దె పై గదిలోని శివపార్వతుల పింగాణి విగ్రహములతో మాట్లాడు చున్నారు. "అయ్యగారు శివపార్వతులు మాట్లాడుతున్నారు. మీకు వినిపిస్తుందా" అని అడిగారు. లేదు బాబుగారు అన్నాను వెంటనే రెండు తులముల విభూతి పొట్లము వారిచేతిలోకి వచ్చింది. దానిని నాకిస్తూ "అయ్యగారూ ఇది కైలాసములో పరమేశ్వరుని సన్నిధిలో వుండే విభూతి. నిత్యము స్నానానంతరం నుదుటిన ధరించి సంధ్యావందనం, దేవతార్చన చేసుకోండి. ఇది అందరికీ దొరకదు" అని పలికిరి. మేమెప్పుడో సంవత్సరము నాడు వారిని విభూతి అడిగి యుంటిమి. దానిని ఈనాడు మాకనుగ్రహించారు.

## నా బావమర్ది కొచ్చిన్ వెళ్ళలేడని బాబుగారు చెప్పడం

మేము తెనాలిలో పెండ్లికి వచ్చి శ్రీ బాబుగారి దర్శనార్థం గుంటూరు వెళుతుంటే మా బావమర్ది మైలవరపు ఆంజనేయ శాస్త్రి



కూడా శ్రీ బాబుగారి దర్శనానికి వచ్చాడు. మేము దింటకుర్తి సుబ్బారావు గారింట్లో శ్రీ బాబుగారిని దర్శించాము. మా క్షేమ సమాచారాలడిగాక బాబుగారు "క్రిష్ణా" అని పెద్ద కంఠముతో శ్రీ క్రిష్ణుని పిలిచారు. వారి చేతికి రెండు పెద్ద అరటి పండ్లు వచ్చాయి. మాకు చెరి ఒకటిచ్చి ఆరగించమన్నారు. మేము ప్రసాదము స్వీకరించాక నా బావమర్ది తాను కొచ్చిన్ వెళ్ళవలెననియు తన కొరకు గుంటూరు రైలుగేటు దగ్గర టాక్సీ వచ్చి ఉంటుందనియు చెప్పి శ్రీ బాబుగారి అనుజ్ఞతో వెళ్ళిపోతున్నాడు. శ్రీ బాబుగారు నన్ను ప్రక్కకు పిలచి "మీ బావమర్ది కొచ్చిన్ వెళ్ళలేడు. ఇది నీవతనికి చెప్పకుండా ఏమౌతుందో చూడు" అని చెప్పారు. నేను అక్కడ నుండి ఏలూరు వచ్చేశాను. సాయంత్రం 5 గంటలకు మా బావమర్ది కుమారుడు కనిపిస్తే "మీ నాన్న కొచ్చిన్ వెళ్ళాడా?" అని అడిగితే "పోలేదండీ ఇప్పుడే వచ్చి పడుకొని యున్నాడు. తన కొరకు వస్తానన్న టాక్సీరాలేదట" అని చెప్పాడు. దీనిని బట్టి వారెంతటి సర్వజ్ఞులో తెలుస్తుంది. కానీ తనకన్నీ తెలుస్తుంటాయని వారు ఎప్పుడూ బయట పడేవారు కాదు.

## మహా శివరాత్రి రోజు అలసందు గారెలు ప్రసాదించుట

1970 వ సంవత్సరము నేను, నా భార్య, కొమార్తె, కొడుకు, కోడలు అందరము మహా శివరాత్రి రోజున దింట కుర్తి సుబ్బారావు గారింటిలో నుంటిమి. మా అబ్బాయిని పిలిచి శ్రీ బాబుగారు ఆ టేబుల్ డ్రాయరులో ఏమున్నదో చూడమనిరి. అక్కడొక పెద్ద టమేటా పండు ఉన్నది. దానిని వాడొక్కడే తినవలెనని ఆజ్ఞాపించిరి. వాడట్లే చేసెను. రాత్రి 9 గంటలకు "మీ కందరికి శ్రీ స్వామి వారు ప్రసాద మిస్తారట మిద్దె మీదకు రమ్మని పిలచిరి." మేము వెళ్ళగానే శ్రీ బాబుగారు కండ్లు మూసుకొని ధ్యానస్థులైరి.

రెండు నిమిషములలో వారి చేతిలోనికి రెండు గారెలు వచ్చెను. వాటిని ముక్కలు చేసి మా కందరికీ ఇస్తూ ఇవి ఏమిగారెలు? వేటితో చేశారని మమ్ములనడిగారు. అవి మినపప్పుతో చేసినవని చెప్పాము. అందుకు శ్రీ బాబుగారు, కాదు అవి అలసందులతో చేశారు. ఈ రోజు శివరాత్రి గనుక శ్రీ రామచంద్ర ప్రభువుల వారు వీటిని చేయించుకున్నారు. మీకు కూడా ఇమ్మని ఇచ్చినారని చెప్పారు. మేమందరము ఆ ప్రసాదమును మహదానందముతో స్వీకరించాము.

## 1971 వ సంవత్సరము శ్రీ ఆంజనేయ స్వామి ద్వారా 3 అరటి పండ్లు ప్రసాదించుట

మహా శివరాత్రి ఉదయం 9 1/2 గంటలకు నేను నెయ్యి పోసే ఆమెతో మాట్లాడుతుండగా నా భార్య వంట చేస్తుంది. మిద్దె పై నున్న మా ఇంటి ప్రక్కన ఉత్తరం కొంత ఖాళీజాగా ఉంది. అక్కడెవరో కేకవేసినట్లు, పెద్ద శబ్ధముతో ఎవరో దూకినట్లు శబ్ధమయితే అక్కడకు వెళ్ళిచూచింది. గొప్ప ఆశ్చర్య కరమైన దృశ్యము. అక్కడున్న పూలకుండీల మద్య శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీరామ చంద్ర ప్రభువుల పాదముల సన్నిధిన కూర్చున్న పోజులో బాలాంజనేయ స్వామిగారు కూర్చొనియున్నారు. నా భార్య ఆశ్చర్యంతో "ఏమండోయ్ వెంటనే ఇలా రండి" అని పెద్ద కేక పెట్టినది. నేను, నా కొమార్తె ఆ కేకవిని పరుగెత్తాము. అప్పటికే శ్రీ ఆంజనేయస్వామి భూమి మీద నుండి అంతరిక్షం వైపు గగన మార్గములో పోవుచున్న దృశ్యము కనిపించింది. శ్రీ స్వామి వారికి నమస్కరించాము. వారు సంజీవ పర్వతము తెచ్చేభంగిమలో వెళ్ళిపోవుచుండిరి. మిద్దె పైన వారు కూర్చున్న చోట మూడు పెద్ద అరటి పండ్లున్నాయి. వాటిని ఏమిచేయాలో తెలియక శ్రీ బాబు



గారిని అడిగాము. ఈ పండ్లను శ్రీ స్వామివారు పంపారని, అమ్మాయి వివాహము త్వరలో ఖాయమవుతుందని ఒక పండు దింటకుర్తి సుబ్బారావు గారికి, రెండవది వెంకటేశ్వర్లు గారికి మూడవది మేమిద్దరము భార్యభర్తలము తీసుకోమని శ్రీ స్వామి వారి ఆజ్ఞను తెలిపిరి. మేమలాగే చేసి ధన్యులమయ్యాము. కొమార్తె వివాహం కూడ త్వరలో జరిగి పోయింది.

1972 వ సంవత్సరములో నేను ఇంటి దగ్గరే ఉన్నాను. మద్యహ్నాం 12 గంటల సమయము. నా భార్య దేవునికి నివేదన చేస్తుంది. మా ఇంటి ప్రక్కనున్న ఖాళీ స్థలములో దభేలుమని ఒక మనిషి దూకిన శబ్దము వినిపించింది. వెంటనే నా కొమార్తె వెళ్ళి చూసింది. అక్కడెవ్వరూ లేరు కాని ఒక మొక్కజొన్న కండె మాత్రము పడేసి ఉంది. కోతులు, కాకులు కూడా లేవు. ఆ మొక్కజొన్న కండెను కండ్ల కద్దుకొని శ్రీ రంగన్న బాబుగారికి ఈ విషయం చెప్పాలని నేను, నా భార్య గుంటూరు వెళ్ళాము. శ్రీ బాబుగారు ఈ విషయం విని శ్రీ స్వామి వారిని అడిగారు. ఆ మొక్కజొన్న కండెను మమ్ములనందరినీ ప్రసాదముగా తీసుకోమన్నారు. భవిష్యత్తులో ఎప్పుడైన ఏమైనా ప్రసాదించినా మీరే ప్రసాదంగా తీసుకొండి. మీకెవరికైనా పెట్టాలనిపిస్తే కొంతపెట్టమని చెప్పారు. సెలవు తీసుకొని ఏలూరు చేరాము.

## 1974 వ సంవత్సరము శ్రీ K.G. క్రిష్ణమాచార్యుల మేడ పై నరసింహ శతక పఠనము

శ్రీ రంగన్న బాబుగారు నరసింహ శతకము వినడమన్నా వినిపించడమన్నా ఎంతో ఆనందించేవారు. ఒక రోజు నేను, నా భార్య, కొమారుడు, కోడలు, కొమార్తె అమరావతి తీర్థయాత్ర

సేవించి శ్రీ బాబుగారి దర్శనార్థం శ్రీకృష్ణమాచార్యుల మేడ పైనున్నాము. అక్కడ అనేక మంది భక్తులు శ్రీ బాబుగారి దర్శనార్థము వచ్చియున్నారు. అప్పుడు నన్ను శ్రీ నరసింహ శతకం పఠించమని ఆజ్ఞాపించిరి. మధ్యాహ్నం 1 గంట 45 నిమిషములకు పూర్తియైనది. అరటి పండు, ఆపిల్ పండ్ల ముక్కలు కోసి గది తలుపులు మూసియుంచి నివేదనచేశారు. పది నిమిషముల తర్వాత అందరికి ప్రసాదమిచ్చి పంపేశారు.

## శ్రీ E. వేదవ్యాస గారి గృహమందు నరసింహశతక పఠనము

నా కొమారుడు, కోడలును హైదరాబాద్‌లో వదలి పెట్టేందుకు పోతున్నానని శ్రీ బాబుగారికి చెప్పాను. హైదరాబాదులో మీరు వేదవ్యాసను కలసి రంగడు పంపాడని చెప్పి మీ ఇంటిలో నరసింహ శతకము పఠించమన్నాడని చెప్పండి. పఠనమయ్యాక ఆ పుస్తకము వేదవ్యాసగారికి ఇచ్చి అప్పుడప్పుడు దానిని పఠించమని నేను చెప్పానని చెప్పండి. నేనలాగే వారిని కలసి విషయము చెప్పాను. మూడవ రోజు సాయంత్రం 6 గంటలకు పఠనము అని నిశ్చయించుకొన్నాము. మూడవనాడు వెళ్ళి 6½ గంటల నుండి రాత్రి 8½ గంటలకు పారాయణ పూర్తయినది. పుస్తకము వారికిచ్చి 9½ గంటలకు మా ఇల్లు చేరితిని.

## శ్రీ రామ చంద్ర ప్రభువుల దయతో శ్రీ రంగన్న బాబుగారి ద్వారా భక్తులకు గలిగిన దివ్యానుభవములు

1. శ్రీ దింటకుర్తి సుబ్బారావు గారు ఏలూరులో నున్న శ్రీ రంగన్న బాబుగారిని గుంటూరులోని తన స్వగృహము నందు షుమారు ఇరవై సంవత్సరములు ఉంచుకున్నారు. వారి



కొమార్తెలకు వివాహములు, కుమారులకు ఉద్యోగాలు వచ్చాయి. ఇవిగాక వారికి గల అనుభవాలు గ్రంథస్థం కాకపోవుట మన దురదృష్టము.

2. శ్రీ చీమకుర్తి మల్లిఖార్జునరావు ఏలూరు - వారికి అమృతము ప్రసాదించారు.
3. M. రామారావు - ఏలూరు వారికి పటిక బెల్లము, ద్రాక్ష, లడ్లు, త్రివిక్రమ ఫలములు ప్రసాదించారు.
4. మండా జగన్నాధరావు ఇంటిలో దేవలోక కుంకుమ భక్తులందరికీ ఇచ్చుట
5. శ్రీ బాబు గారు పోలవరము, ఏలూరు, గుంటూరులలో నివసించునప్పుడు అనేక మంది వీరినుండి ఆశీస్సులతో డబ్బుతీసుకొని వ్యాపారములలో గణనీయమైన అభివృద్ధి సాధించి వీరి పేరుతో వ్యాపారం సాగిస్తున్నారు.
6. అనేక మంది సంతానార్థులు వీరి ఆశీస్సులతో సంతానము పొందారు.
7. ఎంతో మందికి శ్రీ రామచంద్ర ప్రభువుల ప్రసాదమని పండ్లు, పూలు, తులసీ దళములు, తీర్థము పొందియున్నారు.
8. శ్రీ వేగుంట సుబ్బారావుగారు శ్రీ బాబుగారికి బాల్య స్నేహితులు. ఏలూరులో నాకు సుబ్బారావు గారితో పరిచయమై అనేక సార్లు ఇంటికి వచ్చేవారు. శ్రీ బాబుగారు మాకిచ్చిన పటిక బెల్లము, ద్రాక్ష పండ్లు, నువ్వుల చిమ్మిరి, మొదలగు వానిని ఒక్కొక్కసారి ఒక్కొక్కటి ఇస్తూ వచ్చారు. ఒక సారి తొమ్మిది పొట్లములు తెచ్చి శ్రీ బాబుగారు భక్తులందరికీ తలా ఒకటిచ్చి నాకూ ఒకటి ఇచ్చారు. నా పొట్లములో సత్యనారాయణ స్వామి ప్రసాదముండినది.

## ఒకే కాలంలో రెండు ఇండ్లలో శ్రీ బాబుగారు దర్శనమిచ్చుట

ఒక రోజు మండా జగన్నాదరావు, నేను వెళ్ళి వక్కల గడ్డ వెంకట రత్నం గారి ఇంటిలోను మరియు ఉరుం సత్యనారాయణ ఇంటిలోను శ్రీ రంగన్న బాబుగారిని గూర్చి విచారించితిమి. మద్యహ్నాము 12 గంటలకు వచ్చి భోంచేసి పరుండి టీ త్రాగి వెళ్ళారని రెండిండ్ల వారు చెప్పారు. ఒకే కాలములో ఒక వ్యక్తి రెండిండ్లలో ఉండడం అసంభవమని మేము వెళ్ళి శ్రీ రంగన్న బాబుగారిని విచారించాము. వారు నేను వక్కల గడ్డ వెంకటరత్నం గారింటిలోనున్నాను. ఉరుం సత్యనారాయణ గారింట్లో శ్రీ స్వామివారుండి ఉంటారని చెప్పారు. వారు సత్యము వెల్లడించకుండా తన శక్తి సామర్ద్యాలు గోప్యముగా ఉండాలని అలా చెప్పారేగాని ఒకే కాలంలో ఎన్ని చోట్లయినా ఉండగల మహనీయులు వారు.

ఇంతే కాదు ఈమహనీయుడు ఒకే సమయములో మద్యహ్నాభోజనము, పొన్నూరులోను, చీరాల్లోను, గుంటూరులోను మొత్తం తొమ్మిది మంది గృహాలలో చేసినట్లు భక్తుల అనుభవాలున్నాయి. అదెట్లా సాద్యం బాబుగారు అంటే, నేను ఒక్కచోటే తిన్నాను మిగిలిన చోట్ల శ్రీ రామచంద్రప్రభువులున్నారు. వారు చేయలేని దివ్యలీల ఏముంది?! అని నవ్వేవారు.



### మా ఇతర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | మౌన బోధ | 1 రూ\|\| |
| 11. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 12. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 13. | బోధ యజ్ఞాయ నమ: | 1 రూ\|\| |
| 14. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 15. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 16. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 17. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 18. | నమ్మలేని పచ్చిసత్యాలు | 1 రూ\|\| |
| 19. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 20. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 21. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 22. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 23. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 24. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 25. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 26. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 27. | స్మృతిరహిత ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 28. | శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టార్ గారు | ఉచితము |
| 29. | అమృత వాక్కులు | ఉచితము |
| 30. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ\|\| |